

# జల

- డా॥ మామిడి హరికృష్ణతో తగుళ్ళ గోపాల్

## కవిత్వపు ముచ్చట్లు



“ఒక సృజనకారుడు బహుముఖంగా ఎలా ఎదగాలో చెప్పడానికి, ఎంత అధ్యయనముండాలో చెప్పడానికి తన ఏ ప్రసంగము విన్నా తెలుస్తుంది. అచ్చమైన తెలంగాణతనంతో నిండిన ఒక సాహితీవేత్త ఎట్ల ఉంటడో , ఎట్ల ఉండాలో చెప్పడానికి హరికృష్ణన్ననే ఒక ఉదాహరణ.

హరికృష్ణన్న సాహిత్యాన్నంతా అధ్యయనం చేసిన తరువాత తన కవిత్వ మూలాల గురించి మాట్లాడుకున్న మాటలే ఈ పుస్తకం.

**సుషుప్తి నుంచి –**
లేపాక్షి పుస్తకంలో దాచుకున్న
యవ్వనపు రక్తం.
**ఒంటరీకరణ –**
తనలోకి తాను ప్రయాణించిన కాలం
**ఊరికి పోయిన యాళ్ళ–**
బురదనేలలో తిరుగాడిన జీవితం.

మూడూ భిన్న దశలు. భాషలో, అభివ్యక్తిలో ఒక్కో దశలో ఎన్నో పరిణామాలు. ఈ దశల్లో తన కవిత్వంలోని వస్తువు, శిల్పంలో వచ్చిన మార్పుల గురించి తెలుసుకునే చిన్న ప్రయత్నం ఇది.”

–తగుళ్ళ గోపాల్

# జల

డా॥ మామిడి హరికృష్ణతో

తగుళ్ళ గోపాల్

కవిత్వపు ముచ్చట్లు

# జల

డా॥ మామిడి హరికృష్ణతో
తగుళ్ళ గోపాల్
కవిత్వపు ముచ్చట్లు

ప్రతులు : 1000, వెల : రూ 70/-

ప్రచురణ :
జమిలి - సాహిత్య సాంస్కృతిక వేదిక

ముద్రణ : ఫిబ్రవరి 2024

ప్రతులకు : అన్ని పుస్తక కేంద్రాలలో

ప్రింటింగ్ : శ్రేష్ఠ ఆఫ్‌సెట్ ప్రింటర్స్
చిక్కడపల్లి, హైదరాబాద్
ఫోన్ : 98858 48262

సీతకుంట మీదంగ అలుగెల్లిన అక్షరం.
దేవునిచెర్వుకట్ట మీద వెలిసిన ర్యాల చెట్టు
రంగుల భాష తెలిసిన చిత్రకారుడు
రవీంద్రభారతికి గ్రామీణ జీవకళను
తెచ్చిన జాజుపూత
మనిషిని విడిచి ఉండలేని తనమే
తన వాక్యం
అచ్చమైన తెలంగాణతనమే
తన కవిత్వఆత్మ
ఈ అక్షరాలతొవ్వలన్నీ
మామిడి హరికృష్ణ కవిత్వప్రపంచంలోకి ..

# ప్రచురణ కర్తల మాట

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులుగా విశిష్టమైన సేవలు అందించిన మామిడి హరికృష్ణన్న అందరికీ తెలుసు . రవీంద్రభారతి వేదికగా జానపద కళారూపాలకు పూర్వ వైభవం తీసుకొని రావడంలో హరికృష్ణన్న పాత్ర ఎంతో ఉంది. యువ కళాకారులకు, జానపద కళాకారులకు అండగా నిలబడుతూ రవీంద్రభారతి కళా నిలయానికి పచ్చని మామిడి తోరణంగా నిలిచారు. నిత్యం ఊపిరి సలపని పనుల్లో ఉంటూ తనలోని సృజనను ఎలా కాపాడుకుంటూ వస్తున్నారు అనేది ఆశ్చర్యం కలిగించే విషయం. అందుకే కేవలం తన కవిత్వం మీదనే ఒక ఇంటర్వ్యూ చేయాలనుకున్నాము. ఈ ఇంటర్వ్యూలో తన కవిత్వానికి సంబంధించినవే గాక తెలుగు సాహిత్యానికి సంబంధిన, ప్రపంచ సాహిత్యానికి సంబంధించిన అనేక విలువైన విషయాలను పంచుకున్నారు. వాటిని కేవలం వీడియోకే పరిమితం చేయకుండా పుస్తకంగా తీసుకొని వస్తే ఎక్కువ మంది పాఠకులకు చేరుతుందని అనుకున్నాము. ఏ విషయం మీదనైనా అనర్గళంగా మాట్లాడే హరికృష్ణన్న జ్ఞానప్రవాహం వెనుక బతుకుమూలాలను వెతికే చిన్న ప్రయత్నం ఈ 'జల'.

'జల' పుస్తకంగా రావడానికి అవకాశం ఇచ్చిన మామిడి హరికృష్ణ అన్నకు , ఇంటర్వ్యూ చేసిన మిత్రుడు తగుళ్ళ గోపాల్ కు జమిలి సాహిత్యసాంస్కృతిక వేదిక తరుపున ప్రత్యేక ధన్యవాదాలు.

మేము ఎవరి దగ్గరినుంచైతే ఇంత జ్ఞానం, ఇంత గొప్ప అవకాశం, ఇంత సాయము పొందామో వారికి కృతజ్ఞతగా వారు చేసిన సేవలను ఈ సమాజానికి అందించాలన్నదే జమిలి సాహిత్య సాంస్కృతిక వేదిక ఏర్పడడానికి ప్రధాన కారణం. సమాజం నుంచి పొందిన సాయాన్ని తిరిగి సమాజానికి ఎంతోకొంత అక్షరంగా ఇవ్వాలనుకున్నాము.

కవి మూలా సుబ్రహ్మణ్యం చెప్పినట్లు,

“నదిలోంచి
దోసిలితో నీళ్లు తీసుకుని
తిరిగి నదికే అర్పిస్తూ
చేతులు ” జోడించినట్లుగా మేము ప్రతి మెట్టు ఎక్కడంలో అండగా నిలబడిన మామిడి హరికృష్ణన్నకు కృతజ్ఞతతో **‘జల’**ను మొదటి పుస్తకంగా తెస్తున్నాము.

-ప్రచురణ కర్తలు

# అంతర్యానంలో ఒక మజిలీ!

"I am a cage, in search of a bird"

---*Franz Kafka*

**ఇంటర్వ్యూ...!**

ఆ పేరుకు తగినట్టే ఒక మనిషిలోని అంతర్ దృష్టి ని, అంతర్గత ఆలోచనల్ని వ్యక్తం చేసే ఒక చక్కని లోచూపు!

వేర్వేరు సందర్భాలలో వేర్వేరు అంశాలపై చాలామంది నన్ను ఇంటర్వ్యూ చేయడం లేదా నేను ఇతరులను ఇంటర్వ్యూ చేయడం జరిగింది. కానీ ఇది ఎందుకో కొంచెం noteworthy అనిపించింది.

మానవుడు రచయితగా, కవిగా, సాహితీవేత్తగా, కళాకారుడిగా, architect గా, engineer గా తను చేసే సృష్టిలో, ప్రతి సృష్టిలో, ప్రతీ సృష్టిలో తను ఉంటాడు. తాను ప్రతిబింబిస్తాడు. అయితే అదంతా అంతర్లీనంగా ఉంటాడు. Unconscious గానో, subconscious గానో లేదా conscious గానో ఆయా సృజనలలో తన ఆశ, ఆశయం, ఆదర్శం, ఊహ, అపోహ, భ్రమ, సంభ్రమలను వ్యక్తీకరిస్తాడు. ఆయా పాత్రల ముసుగులు వేసుకొని peripheral గానో, superficial గానైనా తనలోని మనిషిని ప్రత్యక్షం చేస్తాడు. ఈ process and product కు psychologists అందమైన పేరు పెట్టారు. sublimation అని! కానీ వందలాది పేజీల పుస్తకం రాసినా, అందులో తానే మొత్తంగా తన ఆత్మని సంపూర్ణంగా ఆవిష్కరించడం జరగదు.

ఆ తెర వెనుక కథను, తెర మీది కథకు దారి తీసిన పరిస్థితులను, పేజీ వెనుక జీవితాన్ని, వాక్యానికీ వాక్యానికీ మధ్య విస్మృతమైన జీవన గమనాన్ని మన ముందు పరిచే ఒక ప్రయత్నం ఇంటర్వ్యూ!

తెలుగులో మనం దీన్ని ముఖాముఖి అంటాం ! ఒక మనిషి తన ముఖతా తన అంతరంగ చిత్రాన్ని, తన అంతర్ ఆలోచనల్ని, అంతః ప్రపంచాన్ని ఆవిష్కరించే ఒక అవకాశం !

Tete-e-Tete అనీ అంటాం ! ఒక homo sapiens తన intellect నీ, interests నీ, instincts నీ, intutions నీ, introspect చేసుకుంటూ, తన experience నీ, experiments with life నీ first person singular లో వ్యక్తీకరించే సన్నివేశం!

Face to Face అనీ అంటాం! ఒక soul కాస్తా faceless అయి, తన sensibilities నీ, sensitivities నీ subtle గా, straight గా అసలు soulful ముఖాన్ని లోకానికి వెల్లడి చేయాలని తాపత్రయపడే నివేదనం! ఇదంతా ఒక absurdity of aimless wandering ! Abstractly concrete advocacy ! Concretely abstract intimacy !!

అయితే నేను గతంలో ఎన్ని ఇంటర్వ్యూలలో పాల్గొన్నా, ఈ ఇంటర్వ్యూ మాత్రం ప్రత్యేకంగా అనిపించింది. ఒక మట్టి మనిషి, పల్లె ధూళిని మనసంతా పులుముకున్న మనిషి, తెలంగాణ జీవన సంస్కృతిని ఆవాహన చేసుకున్న మనిషి, అక్షరాలా అక్షరాలుగా కవిత్వాన్ని శ్వాసిస్తూ, తన వాక్యాలకి సాహిత్యపు "దండ కడియం" తొడిగిన మనిషి నన్ను ఇంటర్వ్యూ చేయడం as novel as natural గా, as natural as new గా, as new as nuances గా అనిపించింది!

తమ్ముడు తగుళ్ల గోపాల్ ఈ మట్టిని ప్రేమించిన వాడు. మనుషుల్ని ఆరాధిస్తున్న వాడు. సకల చరాచర సృష్టిని విచిత్రంగా కొత్తగా కుతూహలంగా చూస్తున్నవాడు. అలాంటి గోపాల్ నన్ను కూడా అతని దృష్టి కోణంలోంచి కొత్తగా నాలోకి నేను అంతర్వీక్షణం చేసే లాగా ప్రశ్నలు

అడిగాడు. నా నుంచి ఎన్నో సమాధానాలు రాబట్టుకున్నాడు. నిజానికి చెప్పాలంటే ఈ ఇంటర్వ్యూ నాలోని అంతర్గత మానవున్ని, అతనిలోని intrinsic urges నీ, latent thoughts నీ, covert conflicts నీ, ఒకానొక eternal crisis నీ, నాలో నాతో పాటు సంచరిస్తున్న cosmic chaos నూ ఒకింత సంతృప్తిపరిచిందేమో చెప్పలేను!

నిత్య జీవితంలో మనం ఎన్నో అంశాలని వింటాం. చదువుతాం. నేర్చుకుంటాం. అధ్యయనం చేసి, అభ్యాసం చేసి ఈ ప్రపంచాన్ని అవగాహన చేసుకునే ప్రయత్నం చేస్తాం. ఆది మధ్యాంత రహిత జ్ఞాన నదులలో మునకలేసినప్పటికీ, ఇంకా వివృతం కాని అజ్ఞానాన్ని ఆవహించి ఉంటాం. విజ్ఞానమో, వేదాంతమో, వైరాగ్యమో, వ్యామోహమో, వ్యాకులతో, విప్లవమో.. ఇంకేదో తెలీని అజ్ఞాత, అభూత, అధి భౌతిక, ఆధ్యాత్మిక ప్రవాహంలో పడి కొట్టుకు పోతాం! కానీ ఏదో ఒక సందర్భంలో ఇలాంటి ప్రశ్నలు ఎదురైనప్పుడు మాత్రమే మన తార్కికత లోని లోతు, మన తాత్వికత లోని గాఢత, మన అధ్యయనంలోని దార్శనికత, మన పఠనాభిలాష పుట్టించిన కాల్పనికత, మన జీవనానుభావం చూపించిన వాస్తవికత వాటి ప్రభావం అన్నీ, పాక్షికంగానైనా ఒకచోట గుదిగుచ్చినట్టుగా, సాపేక్షంగానైనా వేల చోట్ల విసిరేసినట్లుగా, ఎంతో ఆపేక్షగా మన నుంచి వెల్లువలాగా బయటకు వస్తాయి.

ఇది ఒక ప్రశ్నకి స్పందన మాత్రమే కాదు.

ఒక కుతూహలానికి కొనసాగింపు!

ఒక జీవి బతుకు బాటలోని గమనాల మేళవింపు!

ఒక అసంపూర్ణత నుండి మరో అసంపూర్ణతలోకి తరలింపు !

ఇలాంటి ఒక చక్కని ఇంటర్వ్యూ కేవలం ఇద్దరి సంభాషణకే పరిమితం చేయకుండా, దీన్ని "జల" పేరిట పుస్తకం గా తీసుకురావాలని, ఈ ఇంటర్వ్యూను వీడియోగా కూడా తీసుకు వస్తే బాగుంటుంది అనే ఆలోచనతో "జమిలి" సాహిత్య వేదిక ద్వారా దీన్ని ప్రచురిస్తున్నందుకు యువ దర్శకుడు, తమ్ముడు అక్షర కుమార్ కి , తమ్ముడు అంకుష్ గ్రాఫిక్స్

చేరన్, కవర్ పేజి డిజైన్ చేసిన ధని ఏలె కు, వీడియో డాక్యుమెంటేషన్ చేసిన పల్లె సన్నీ , శివలకు ధన్యవాదాలు!

ఈ ఇంటర్వ్యూ ఒక మామిడి హరికృష్ణదిగా కాకుండా, ఒక సాహితీ ప్రియుడు అక్షరాలు, అక్షరాలుగా నిర్మించుకున్న అంతర్లోకంలోకి పర్యటనలా ఉంటుందని భావిస్తున్నాను!

ఇక్కడ ప్రపంచ ప్రఖ్యాత జపనీస్ రచయిత Haruki Murakami మాటల్ని గుర్తు చేసుకుంటాను:

"I think that my job is to observe people and the world, and not to judge them. I always hope to position myself away from so-called conclusions. I would like to leave everything wide open to all the possibilities in the world"

అందరికీ ధన్యవాదాలతో...

- డా. మామిడి హరికృష్ణ

రవీంద్రభారతి,
హైదరాబాద్

# సెలిమెతోడంగ...

ఒకనాడు నందకిశోర్ అన్న ఫోన్ జేసి "తమ్మీ! నీకొకరు ఫోన్ చేస్తరు, మాట్లాడురా, నీ నంబర్ ఇచ్చిన" అన్నడు. మొత్తం విషయమేందో అర్థంగాలే. ఇగ పొద్దూకుతుందనంగ ఒక ఫోనొచ్చింది. 'హరికృష్ణన్నను ఇంటర్వ్యూ' చేయాలన్నరు.

"అసలు ఇంటర్వ్యూలో ఎట్ల మాట్లాడాలో తెల్వదు, హరికృష్ణన్న లాంటి వ్యక్తిని ఏమని ప్రశ్నలు అడుగాలో తెలువదని మనసుల మాట చెప్పిన. హరికృష్ణన్న కవిత్వం చదివిన తర్వాత తన కవిత్వం గురించి నీవేం అనుకుంటున్నవో, సహజంగా నీవెట్ల మాట్లాడుతవో అట్లనే మాట్లాడమని అన్నడు. లోపల భయం గూడు కట్టుకొని ఉన్నా సరే అని చెప్పిన. పోర్షియా దేవి మేడం ' మాట్లాడే సమయం' పుస్తకావిష్కరణ సభకు రవీంద్ర భారతి వచ్చినప్పుడు హరికృష్ణన్నను మొదటిసారి కలిసి అన్న చేతుల మీదుగానే తన సాహిత్యాన్నంత తీసుకున్న. నగరం నడిమధ్యన పల్లెను నిర్మించుకొని వచ్చిపోయే కళాకారులకు బువ్వముద్దలా మారిన తరిపొలాన్ని అక్కడ చూసిన. వరిగింజల పాటలు విన్న. మళ్ళీ చాన్నాళ్ళకు సకినం రుచి చూసిన.

ఏదో ఒక పని మీద రవీంద్రభారతికి వచ్చి పోయె ఎంతో మంది కళాకారుల నడుమ ఎవరెవరికి ఏమేం కావాలో చూసి, ఎవరెవరిని ఏ ఏ ఒడ్డుకు చేర్చాలో ఆలోచించే నావికుడిగానే తప్పా కుర్చీకే అంటుకుపోయిన అధికారి కన్పించలేదు.

ఏ మాత్రం ప్రతిభ ఉన్న యువ కళాకారులు తన దగ్గరకు వచ్చినా

“మీకొక అన్నుండు , మర్చిపోకండి “అని భరోసానివ్వడం దగ్గరి నుంచి చూసిన.

ఒక సృజనకారుడు బహుముఖంగా ఎలా ఎదగాలో చెప్పడానికి, ఎంత అధ్యయనముండాలో చెప్పడానికి తన ఏ ప్రసంగము విన్నా తెలుస్తుంది. అచ్చమైన తెలంగాణతనంతో నిండిన ఒక సాహితీవేత్త ఎట్ల ఉంటడో , ఎట్ల ఉండాలో చెప్పడానికి హరికృష్ణన్ననే ఒక ఉదాహరణ.

హరికృష్ణన్న సాహిత్యాన్నంతా అధ్యయనం చేసిన తరువాత తన కవిత్వ మూలాల గురించి మాట్లాడుకున్న మాటలే ఈ పుస్తకం.

**సుషుప్తి నుంచి -**

లేపాక్షి పుస్తకంలో దాచుకున్న
యవ్వనపు రక్తం.

**ఒంటరీకరణ -**

తనలోకి తాను ప్రయాణించిన కాలం

**ఊరికి పోయిన యాళ్ళ-**

బురదనేలలో తిరుగాడిన జీవితం.

మూడూ భిన్న దశలు. భాషలో, అభివ్యక్తిలో ఒక్కో దశలో ఎన్నో పరిణామాలు. ఈ దశల్లో తన కవిత్వంలోని వస్తువు ,శిల్పంలో వచ్చిన మార్పుల గురించి తెలుసుకునే చిన్న ప్రయత్నం ఇది.

ఉద్యమ సమయంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు వివిధ రాష్ట్రాల, దేశాల మద్దతును కూడగట్టే విధంగా తెలంగాణ గోసను తెలిసే కవిత్వాన్ని ఇంగ్లీష్ లోకి అనువాదం చేసింద్రు. సినిమా విశ్లేషణ వ్యాసాలకుగానూ రెండు నంది అవార్డులు వచ్చినప్పుడు అమ్మకు , తెలంగాణకు అంకితమిచ్చింద్రు. తెలంగాణ వచ్చిన తర్వాత “తొలిపొద్దు” కాన్నుంచి “అలుగు దుంకిన అక్షరం”, “మట్టి ముద్ర” మొదలైన ఎన్నో సంకలనాలకు తెలంగాణ ముద్ర కనిపించేటట్లు సంపాదకత్వం చేపట్టింద్రు.

ఏ సందర్భాన్ని తీసుకున్న తెలంగాణ నేల మీద నిండైన ప్రేమ తనది.

మళ్ళొక్కసారి తంగేడువనాల గట్ల మీదికి ఈ అక్షరాలు తీసుకపోతయి.

మామిడి హరికృష్ణన్న భాషా సాంస్కృతిక సంచాలకులుగా, కవిగా, అనువాదకుడిగా, సినిమా వ్యాసాల విశ్లేషకుడిగా సంపాదకుడిగా ఎంత సృజనశీలో ఈ సాహిత్య ప్రపంచానికి తెలుసు. తన మొత్తం ప్రయాణం గురించి అనేక ఇంటర్వ్యూలు, వ్యాసాలు వచ్చాయి. 'బహుముఖ సృజన శీలి' పేరుతో పాలపిట్ట (మే 2019) గొప్పగా ఆవిష్కరించింది. వివిధ రంగాలలో తన కృషిని తెలియజెప్పే ఇంటర్వ్యూలు ఐ డ్రీమ్, మైక్ టి.వి యూట్యూబ్ ఛానెల్ లో TNR, కస్తూరి మురళీ కృష్ణ, మంగ్లి మొదలైన వారు చేశారు.కానీ కవిగా తన ప్రయాణం, పరిణామ క్రమం మొత్తంగా ఎక్కడా రికార్డు కాలేదు. కేవలం కవిత్వం గురించే మాట్లాడిస్తే ఎలా ఉంటుంది అనే ఆలోచనల అక్షరరూపం ఈ 'జల'!

తన జీవితం గురించి, తన సాహిత్యం వరకే ఈ పుస్తకం పరిమితం కాలేదు. ఇప్పటి వరకు వచ్చిన సాహిత్యాల మీద ముఖ్యంగా తెలంగాణ సాహిత్యం మీద ఒక పరామర్శ లాంటిది. అనువాద సాహిత్యంలోని లోతుపాతులను విశ్లేషణాత్మంగా చెప్పిన మాటలున్నాయి. ఫ్యూజన్ షాయరీ అల్లిక వెనుక గ్లోబల్ విలేజి భావనలు ఏమిటో కనబడుతాయి. "ప్రపంచ సాహిత్యమంటూ ప్రత్యేకంగా ఉండదు. స్థానికమైన కవిత్వమే ప్రపంచ సాహిత్యంగా గుర్తించ బడింది". ప్రపంచ సాహిత్య సారాన్ని ఇలా అలవోకగా చెప్పిన మాటలెన్నింటినో గీత గీసుకోవచ్చు.

మేము మాట్లాడుకున్న ఈ మూడున్నర గంటల్లో అమ్మ పేరు చెప్పినా, అక్షరం పేరు విన్నా కదిలిపోవడం చూశాను. ఒక వాక్యంలోని విషయాన్ని వంద పేజీల్లో ఎట్లా విమర్శనాత్మకంగా చెప్పొచ్చో చూశాను. వంద పేజీల భావాన్ని ఒక పదంలో చెప్పడమూ చూశాను. చదివిన పుస్తకాల మీద గంటల తరబడి సాధికారికంగ మాట్లాడగలిగే మాటల ప్రవాహాన్ని చూశాను. "ఎందుకు చేనేత జీవితం మీద ఎక్కువ కవిత్వం రాయలేదన్నప్పుడు" జీవితం ముందు వినమ్రంగా చేతులు కట్టుకున్న నిజాయితీ చూశాను.

హరికృష్ణన్నతో మాట్లాడడమంటే లైబ్రరీలో కూర్చోని ఇష్టమైన పుస్తకాలను ఒక్కోటి తిరిగేసిన అనుభూతి.తన మాటల్లో కవిత్వానికి సంబంధించిన

నిర్వచనాలే కాదు జీవితానికి సంబంధించిన పాదులూ కనబడినయి. ఆ పాదుల్లోకి నీళ్ళు పారించడానికే ఈ సెలిమెదీస్తున్నం.

ఈ ఆలోచనకు మూలకారణమే కాకుండా దెక్కన్ టి.వి ఛానెల్ ద్వారా వీడియోను రూపొందించిన అంకుష్ గ్రాఫిక్స్ చేరన్ అన్నకు, మూడు తొవ్వలను ఒక దగ్గర కలిపి కో ఆర్డినేట్ చేసిన అక్షరకుమార్ అన్నకు, కెమెరా పని చూసుకున్న పల్లెసన్నీ, శివలకు శనార్తులు.

భయంభయంగ కెమెరా ముందు కూర్చున్నపుడు నాకు ధైర్యాన్నిచ్చిన మామిడి హరికృష్ణ అన్న ప్రేమకు నమస్కారం.

మీ

తగుళ్ళ గోపాల్

కలకొండ .







# Q

- **మీ కవిత్వంలో నాకుబాగా ఇష్టమైన కవిత *"ఊరికి పోయిన యాళ్ళ"!* అందులోని కొన్ని వాక్యాలతోనే ఈ ఇంటర్వ్యూని ప్రారంభిస్తాను.**

  *"ఊరికి రావడం అంటే*
  *ఊరికే రావడం కాదు*
  ***Bus Pass, Pass Port, visa లను Renew** చేసుకున్నట్లు*
  *నా **Indentity** ని మళ్ళీ పొడిగించుకోవడం.*
  *పొగ చూరిన ఊపిరి తిత్తుల నిండా*
  *తంగేడు పూల వాసనని మురిపెంగా నింపుకోవడం."*

  **సాహిత్య ప్రపంచంలో కవిగా, ఒక చిత్రకారుడిగా, సినిమా విశ్లేషకుడిగా, బహుముఖీనమైన రంగాలలో పేరుంది. ఇందులో మామిడి హరికృష్ణ అంటే 'ఇది' అని దేనిని ఇష్టంగా చెప్పుకుంటారు?**

**–** మామిడి హరికృష్ణ అంటే ఒక్కటి గాదు. నేనే కాదు ఏ మనిషి కూడా ఒక్కటి కాదు. Existential Philosophyలో ఒక మాట చెబుతారు. There is no such branding on anybody. బ్రాండింగ్ అనేది కుదరదు. మన సౌలభ్యం, సమాజ వ్యవస్థీకరణ కోసం కొంత మందికి కొన్ని బ్రాండ్‌లు వేస్తం. ఈయన కవి, కళాకారుడు, చిత్రకారుడు, డాక్యుమెంటరీ ఫిలింమేకర్, విమర్శకుడు, ఉద్యోగి, తండ్రి, భర్త, భార్య, పిల్ల... ఇట్లా కొన్ని బ్రాండ్‌లు వేస్తాము. నిజానికి ఈ బ్రాండ్‌లన్నింటికి అతీతమైనవాడు మానవుడు. కాబట్టి మానవుడు ఏ ఒక్క బ్రాండ్ లోనో ఒదగడు. ఒక చిన్న చట్రంలో ఒదిగే మూర్తిమత్వం ఎవరిది కాదు. ఇక నన్ను నేను ఏ ఫ్రేములో ఇష్ట పడతానంటే అన్ని కోణాలను ఇష్టపడతాను.

నన్ను ఆవిష్కరించాలంటే 360 కోణాలను తడిమి చూడాల్సిందే! నేననే గాదు, ఎవరినైనా గాని. ఒక కోణంలోంచో, ఒక డిగ్రీలోంచో చూడడం కాకుండా సమగ్రంగా చూడాలి. Max Wertheimer అనే Psychologist, ఏ మనిషినైనా, సంఘటన, విషయం, సందర్భాన్నైనా Wholosticగా, Gestalticగా చూడాలని చెబుతాడు.

The whole is greater than that of the sum of its parts! భాగాలన్నీ కలిపితేనే ఒక సంపూర్ణత! భాగాలన్నీ కలిపిన తర్వాత వచ్చే సంపూర్ణత, విడిగా భాగాలలో లేని విశిష్టతను, వైశాల్యాన్ని ప్రదర్శిస్తుంది. అది గొప్పగా, కొత్తగా ఉంటుంది. ఒక మనిషిని భాగంగా చూడకుండా సంపూర్ణంగా చూడాలి.

ఇదే సందర్భంలో నేను నమ్మే ఒక Philosophical Principal ఏంటంటే, Accept the life as it comes and Accept the person As He is!

ఎవరైనా వారు ఎలా ఉంటే అలా చూడాలి అనే భావననే ఇష్టపడుతాను. నన్ను నేను పోయెట్ గా ఇష్టపడతానా? పెయింటర్ గా ఇష్టపడతానా? ఫిలింమేకర్ గా ఇష్టపడతానా? అంటే అన్నీ కలిపితేనే నేను గనుక అన్నింటిని ఇష్టపడతాను.!

Q

- **అమ్మ గురించి చెబుతూ "అమ్మకు కొనసాగింపుగా నేను" అని చెప్పుకున్నరు కదా. అమ్మ ప్రభావం మీ సాహిత్యం మీద ఎట్లా ఉంది?**

- నాకు అమ్మే అక్షరం! అక్షరమే అమ్మ!! అందరికీ అమ్మల ప్రభావమే ఎక్కువగా ఉంటుంది. మా కుటుంబ నేపథ్యం మిగతా వాళ్ళ కంటే భిన్నంగా ఉండేది. ఎలా అంటే ఒక బిసి సామాజిక వర్గానికి చెందిన దానిలో మా కుటుంబం ఫ్యూడల్‌వ్యవస్థకు సంబంధించింది. మా తాత దగ్గర నుండి మొదలయింది. అంతకుముందు సాధారణ పేద చేనేత కుటుంబం. మా తాత తన Attentionను వ్యవసాయం, వ్యాపారం వైపు మరల్చి సక్సెస్ కావడంతో ఆ పూర్వపు వ్యవస్థ అంతా మారిపోయింది. అప్పుడు ఆ కాలంలో ఆయన తన డైనమిజంతో ఆ ఫ్రేమును బ్రేక్ చేసిండు. మా ఊర్లో మొదటి బంగ్లా కట్టింది మా తాత. బంగ్లా కట్టాలంటే ఊర్లో కొన్ని సామాజిక వర్గాలకు చెందిన వారికే పరిమితంగా ఉండేది. ఆ కాలంలో మా తాత ఆ స్థితిని సాధించడానికి కారణం ఆయన సాధించిన ఆర్థిక స్థాయి, స్థోమత, సంపాదించిన భూమి.

ఆ కాలంలో నాగళ్ళ సంఖ్యను బట్టి ఎంత పెద్ద వ్యవసాయమో అంచనా వేసేది. మాది ఎనిమిది నాగళ్ళ వ్యవసాయం. అంటే 16 ఎడ్లుండేవి. దానికో కొట్టం ఉండేది. పంటంతా నిల్వ చేయడానికి గోదాం ఉండేది. మత్స్యగిరి గుట్ట వరకు ఉన్న భూములన్నీ మా తాత ఆధీనంలోనే ఉండేవి. అలాంటి నేపథ్యం తాతది.

ఇక రెండోది. మా నాన్న డాక్టర్ కోర్స్ చదివాడు. ఐదేళ్ళు అనంత

లక్ష్మి ఆయుర్వేద మహా విద్యాలయలో చదివాడు. ఆయన చదివిన కాలంలో ఎం.బి.బి.ఎస్ లాంటివి లేవు. అప్పుడంతా ఆయుర్వేద వైద్య విధానం. ఆ కోర్సును చదివాడు.

వీటితో పాటు మా అమ్మ కూడా చదువుకుంది. మా అమ్మ హన్మకొండ సిటీకి సంబంధించిన అమ్మాయి. మా తాత బండారి మల్లయ్య. ఆయనకు తమలపాకుల బిజినెస్ ఉండడం వలన ఆకుల మల్లయ్య అని పిల్చేటోళ్ళు. వరంగల్, హన్మకొండ, కాజీపేట ప్రాంతాలలో తమలపాకులు ఎక్కడ దొరుకుతాయి అంటె ఆకుల మల్లయ్య సోల్ డిస్ట్రిబ్యూటర్ హన్మకొండలో. ఆయన పెద్దబిడ్డ చండికాంబ, రెండవ బిడ్డ విమల, మూడో కూతురే మా అమ్మ! అమ్మ చదువుకుంది. అప్పట్లో అంటే నా బాల్యంలో హన్మకొండలో జి.ఆర్. టాకీసుకు వెళ్ళాలంటే టాంగాలో వెళ్ళేవాళ్ళం. ఇలా కొంచెం సామాజికంగా ఆర్థికంగా ఉన్న కుటుంబంలోంచే రావడం జరిగింది.

మా అమ్మ బాగా చదువుకుందని చెప్పా కదా. చదువుతో పాటు నవలలన్నా, సాహిత్యమన్నా, చందమామ పుస్తకాలన్నా ఇష్టం. ముఖ్యంగా కథలంటే చాలా ఇష్టం. దాని వలన అమ్మ ఎప్పుడూ చదువుతూ ఉండేది. తనతో పాటు నన్ను కూడా చదివించేది. అలా నాకు అమ్మ, అక్షరం విడదీయలేనంతగా నా జీవన ప్రస్థానంలో తొలి అడుగుల్లోనే పడ్డాయి.

నాన్న ఎప్పుడూ మా అమ్మ కోసం పత్రికలు, వీక్లీలు, ఆంధ్రప్రభ, ఆంధ్రసచిత్ర వారపత్రిక, యువ, జ్యోతి, బాలమిత్ర, చందమామ, బుజ్జాయి... మొదలైనవన్నీ తీసుకువచ్చేవాడు. దీని వలన ఇంట్లో ఒక అకడమిక్ వాతావరణం ఉండేది.

తాత వైపు నుండి చూస్తే వ్యవసాయం ఎక్కువగా ఉండేది. మా ఇంట్లో అమ్మ నాన్న వల్ల విద్యా వాతావరణం ఉండేది. ఈ రెండు రకాల సంస్కృతుల్లోంచి నేను రావడం జరిగింది. నా చిన్నతనంలో వాటి ప్రభావం ఉంది. నేను ఎక్కువగా మా అమ్మతో పాటు ఉండేది. మా నాన్న డాక్టర్ కనుక ఇరవై, ముప్పై, ఊళ్ళకు సైకిల్ మీద పోయేటోడు. పొద్దున్నే ఆరు ఏడు గంటలకు పోయి రాత్రి ఎప్పుడో వచ్చేటోడు. అన్ని ఊర్లలో పేషంట్లను చూసుకొని ఇంటింటికి వెళ్ళి వైద్యం చేసి తిరిగి ఇంటికి వచ్చేవాడు. అందుకే నాకు మా అమ్మతో ఎక్కువ అటాచ్‌మెంట్ ఉండేది. అమ్మకు అక్షరంతో

అనుబంధం ఎక్కువ ఉండటం వలన చిన్నప్పటి నుంచే బడికి వెళ్ళడానికి ముందే మా అమ్మ దగ్గర చదవడం, రాయడం నేర్చుకున్నా. దానితో పాటు చందమామ, బాల మిత్ర, బాల సాహిత్యం చదువుకున్నా ఇలా చదువుతూ నా మస్తిష్కంలో ఒక లోకాన్ని సృష్టించు కోవడం, విజువలైజ్ చేసుకుంటూ ఉండేవాణ్ణి.

ఇప్పటికీ ఒక సినిమాకు సంబంధించిన కథ చెప్పగానే విజువలైజ్ చేసే స్కిల్ నాకు ఎక్కడి నుంచి మొదలైంది అంటే నా చిన్నపుడు చేసిన అధ్యయనం, పుస్తకాలు చదవడం నుంచే మొదలైందని చెప్పొచ్చు. అందుకే అమ్మకు నేను కొనసాగింపును. అమ్మ అధ్యయనానికి నేను కొనసాగింపును. అమ్మకు ఉండే ఆ సాహిత్య తృష్ణకు కొనసాగింపును. అమ్మ వెళ్ళిపోతూ అక్షరాన్ని తోడుగా ఇచ్చింది అని భావిస్త. I can identify my self in my Reading and writing! ఇవి తప్ప మరేమీ ఉండదు. అక్షరంతో జీవితాన్ని పెనవేసుకోవడం, అక్షరం సాంగత్యంలో ఉండడం ఇష్టంగా భావిస్తా! నా అస్తిత్వం కూడా అక్కడే. నా ఆత్మ కూడా అక్కడే!!



# Q

- **మీరు ఇంటర్. డిగ్రీలో ఉన్నప్పుడు రాసిన "సుషుప్తి నుంచి" కవిత్వం చదివినపుడు అది ఒక ఇంటర్ విద్యార్థి రాసిన కవిత్వంలా అనిపించదు. అట్లా అనిపించడానికి మీకున్న విస్తృత అధ్యయనమే కారణం అనిపిస్తుంది. మీరు ఎట్లాంటి పుస్తకాలను చదివిండ్రు? ఆ పుస్తకాల ప్రభావం మీ సాహిత్యం మీద ఎలా ఉంది?**

– ఇంతకు ముందు చెప్పుకున్నట్టు నా అధ్యయనానికి నా కుటుంబ నేపథ్యమే ప్రధాన కారణం. నేను ఎనిమిదో తరగతి వరకల్లా సాహిత్యానికి చాలా ఎక్స్‌పోజ్ అయ్యే అవకాశం వచ్చింది. అందుకు అమ్మకు ఎప్పుడూ ఋణపడి ఉంటా. మా ఇంట్లో అన్ని పుస్తకాలు ఉండేవి. మైనం పాటి భాస్కర్ వెన్నెల మెట్లు మొదలుకొని యుద్దన పూడి సులోచన రాణి, మాదిరెడ్డి సులోచన, కొమ్మూరి సాంబశివరావు, కొమ్మూరి వేణు గోపాల్ రావు, పానుగంటి లక్ష్మి నరసింహ రావులతో పాటు రవీంద్రనాథ్ ఠాగూర్ నవలలు,శరత్ సాహిత్యం ఇదంతా ఉండేది. వీటితో పాటు చలం పుస్తకాలు కూడా ఉండేవి. చలం మైదానం, బ్రాహ్మణీకం, పురూరవ, సీత అగ్ని ప్రవేశం మొదలైన పుస్తకాలన్నీ ఇంట్లో ఉండేవి. నా చిన్ననాడు మా ఊర్లో ఠాగూర్ గ్రంథాలయం ఉండేది. మామూలుగా ఊర్లో ఉన్న చిన్న లైబ్రరీ. అప్పట్లో ఆ గ్రంథాలయానికి భాండాగారి మా నాన్న. నాన్నతోపాటు నేనూ లైబ్రరికీ వెళ్ళడం అక్కడ వివిధ దేశాల భాషల అనువాద సాహిత్యం చదవడం జరిగేది.

చిన్న వయసులోనే అంటే పదవతరగతిలోపే సాహిత్యం పట్ల, సాహిత్య

ధోరణుల పట్ల, కవుల పట్ల  పరిచయం వారి రచనలపై ఒక అవగాహన ఏర్పడింది. దానికి తోడు మ్యాగజైన్‌లలో వచ్చే అంశాలు అన్ని వర్గాల వారిని అలరించేటట్లు ఉండేవి. దాంట్లో  ప్రచురితమయ్యే సీరియల్స్, ఫీచర్స్, కథలు అన్ని రకాల విషయాలను తెలిపే విధంగా  ఉండేవి. ఆంధ్ర ప్రభలో అయితే “చొప్పదంటు ప్రశ్న” పేరుతో మహీధర నళినీ మోహనరావు రాసే జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన ప్రశ్నలు, చరిత్ర, సైన్స్ కొన్ని యువతకు సంబంధించినవి,  కరెంట్ అఫైర్స్ మీద కొన్ని అంశాలు ఒకటి రెండు పేజీల్లో ఉండేవి. అవన్నీ కూలంకషంగా చదవడం వలన పదవ తరగతి లోపే ఒక Perspective ఏర్పడింది.

చందమామలాంటి పుస్తకాలలో కేవలం ఒక కాల్పనికతను, జానపదాలను, సృజనాత్మక సాహిత్యాన్ని మాత్రమే  చెప్పకుండా, ఈ బాల సాహిత్యంలో నైతిక విలువలను కథల రూపంలో ఆకట్టుకునేలా చెప్పేవారు. అంతే కాకుండా దాంట్లో కూడా విజ్ఞాన విషయాలు చాలా ఇచ్చేవారు. దేశ, విదేశాలకు సంబంధించిన విశేషాలు, క్రీడల గురించి ఐదారు పేజీల్లో ఇచ్చేవారు. వాటిని ఆసక్తిగా చదివేవాన్ని.  ఒలింపిక్స్ గురించి వాటిలో వచ్చిన వ్యాసాలు ఎంతో ఆసక్తిని కలిగించాయి. 1980లో మాస్కోలో జరిగిన  ఒలింపిక్స్ విశేషాలు నాకు ఇప్పటికీ గుర్తుంది. ఈ క్రీడల మస్కట్‌గా ‘మీషా’ బొమ్మ ఇప్పటికి నా కళ్ళముందు ఉంటుంది.

చందమామ, బుజ్జాయి, బాల మిత్ర, బాలజ్యోతి అనంగనే మనకు గుర్తొచ్చేది పట్టు వదలని విక్రమార్కుని  బేతాళ కథలు, బోధిసత్వుని కథలు, జానపద కథలు... ఇవి మాత్రమే అనుకుంటాం ఇవే కాకుండా సమకాలీన అంశాల గురించి కూడా ఎన్నెన్నో వివరాలు వీటిలో  ఉండేది. నోబెల్ ప్రైజ్ వచ్చిందనుకుంటే నోబెల్ బహుమతి విజేతల గురించి చిన్న వ్యాసం ఉండేది. దాని వలన ఒక నోబెల్ ప్రైజ్ ఉంటుంది అనే విషయం అర్థమయ్యేది. నోబెల్ ప్రైజ్‌ని ఆల్ఫ్రెడ్ నోబెల్ 1901 లో స్థాపించిండని తెలిసేది. ఇక్కడ Paradox ఏంటంటే అతను ఒక వినాశనం కోసం డైనమైట్‌ను కనుగొన్నాడు. దాంతో వచ్చిన నిధులతో ఏర్పడిన నోబెల్ ఫౌండేషన్ మాత్రం  తరువాత ప్రజా ప్రయోజనాల కోసం వాడుకోవడం జరిగింది.

ఒక వినాశనానికి సంబంధించిన డైనమైట్ కనుగొన్న వ్యక్తి ప్రపంచమంతా

శాంతి విలసిల్లాలని, తన పేరు మీద ఒక ఫౌండేషన్ ఏర్పాటు చేసి, డబ్బులు ఇచ్చి దాని కోసం ఒక అవార్డును స్థాపించడం అనేది వైచిత్రి అనిపించేది. అప్పుడు అర్థం గాక పోయేది గాని చిత్రంగా అనిపించేది. అలాగే ఎనిమిది, తొమ్మిది తరగతులకాలంలోనే నాకు "చిల్డ్రన్స్ నాలెడ్జ్ బ్యాంక్" అందుబాటులోకి వచ్చింది. అప్పట్లో పుస్తక మహల్, ఢిల్లీ వాళ్ళు 5 వాల్యూమ్స్ వేశారు. బుక్‌లో విభాగాలుగా సైన్స్ టెక్నాలజి, కెమిస్ట్రీ, హిస్టరీ, జాగ్రఫీ అంశాల మీద ప్రశ్నలు ఉండేవి. "పొద్దున్నె లేవగానే గడ్డి పరకల మీద మంచు బిందువులు ఎందుకు పడుతాయి" లాంటి ఆసక్తికరమైన ప్రశ్నలు ఉండేవి. 'మోనాలిసా నవ్వు వెనుక రహస్యం ఏమిటి?'' అనే విషయాలు కూడా అందులో ఉండేవి. దాని ప్యాటర్న్ ఏమిటంటే ఇంగ్లీష్‌లో "ఎన్ సైక్లో పీడియా బ్రిటానికా" లాంటి వాటిని సంక్షిప్తీకరించి పిల్లల కోసం, జ్ఞాన తృష్ణను పెంచడం కోసం Tell me more WHY, tell me more WHEN... వంటి Series కోవలో ఆ పుస్తకాలు ఉండేది. దానిని భారతీయ భాషల్లోకి "చిల్డ్రన్ నాలెడ్జ్ బ్యాంక్"గా అనువదించారు. దాన్ని చదివేవాణ్ని. చదవడమే కాకుండా నోట్స్ రాసుకునేవాణ్ని అందులో ఉన్న ఒక ప్రశ్నవల్ల ప్రెషర్ కుక్కర్ అప్పుడే తెలిసింది నాకు. ఆ కాలానికి మా ఊర్లో కి ఇంకా గ్యాస్ స్టవ్ అనేదే అందుబాటులోకి రాలేదు. అలా లేని సమయంలో ప్రెషర్ కుక్కర్ గురించి, అందులో అన్నం ఎందుకు తొందరగా ఉడుకుతుంది? అనే ఒక ప్రశ్న గురించి తెలియడం గొప్ప! దానికితోడు ఈ ప్రశ్నను ఈ బుక్‌లో సైంటిఫిక్‌గా Explain చేస్తారు. ఇలాంటి ప్రశ్నలు ఎన్నో ఉండేవి. భాషకు ఆంత్రోపాలజీకి సోషల్ సిస్టమ్, కొన్ని నమ్మకాలు. విశ్వాసాలు, ఆవిష్కరణలు, భౌగోళిక ప్రాంతాల గురించి ఉండేవి. బెర్ముడా ట్రయాంగిల్‌కి వెళ్ళగానే నౌకలన్ని మాయమౌతాయా? అనే ప్రశ్నతో బెర్ముడా ట్రయాంగిల్ గురించి ఎనిమిదో తరగతిలోనే తెలిసింది. థ్యాంక్స్ టూ చిల్డ్రన్ నాలెడ్జ్ బ్యాంక్, పుస్తక మహల్.!

ఉదయం, సాయంత్రం చదవడంలోనే గడిచి పోయేది. చదవడం కూడా నిరంతర తృష్ణతో ఉండేది. ఎవరైతే చిన్న వయస్సులోనే ఎక్కువ పుస్తకాలతో గడిపే అవకాశం కలిగి ఉంటారో వాళ్ళ మెంటల్ ఏజ్, క్రానోలాజికల్ ఏజ్ కంటే ఎక్కువ ఉండే అవకాశం ఉంది. బహుశా నా విషయంలోనూ అదే జరిగి ఉంటుంది అనుకుంటాను. ఇవన్నీ నేను ఇప్పుడు చెబుతున్నవి గాదు.

నేను ఎనిమిదో తరగతిలో చదివినవన్నీ గుర్తు చేసుకొని చెబుతున్నవి. టెన్త్ క్లాస్ వచ్చే వరకల్లా జ్ఞానపీఠ్ గురించి తెలుసు. సాహిత్యంలో ఉన్న కవుల గురించి తెలుసు. రవీంద్రనాథ్ ఏం రాశాడు? "గీతాంజలి" ఎందుకు గొప్పది? ఇలాంటి విషయాలన్ని తెలుసు. శరత్ చంద్ర చటర్జీ 'బడదీది' తెలుసు. 'దేవదాసు'కు, 'పరిణీత'కు తేడా కూడా తెలుసు. దేవదాసుచేసిన పొరపాటును సరిదిద్దు కోవడానికి శరత్ చంద్ర పరిణీత రాశాడన్నది నా అప్పటి భావన.

1986 సమయంలో భోపాల్‌లో "ప్రపంచ కవితోత్సవ్" జరిగింది. చాలా మంది భారతీయ కవులు కూడా ఆ కవితోత్సవమ్‌లో పాల్గొన్నారు. అక్టేవియో పాజ్, తోమస్ ట్రాన్స్ ట్రోమర్, ఒమేరో అరిడ్జిస్ వంటి ప్రపంచ ప్రఖ్యాత కవులు అక్కడికి వచ్చారు. అక్కడికి వచ్చిన కవితల్ని ఆంధ్రజ్యోతి వీక్లీలో తెలుగులోకి అనువదించి ఒక సీరీస్‌గా ఆర్టికల్స్ రాశారు. ట్రాన్స్ టోమర్ పేరు మొదట అలా పరిచయం అయ్యింది. గుంతర్ గ్రాస్, గాబ్రియెలా గార్షియె మార్క్వెజ్ అలా పరిచయమైన వారే! అలా డిగ్రీకి వచ్చేనాటికి భారతీయ సాహిత్యంతో పాటు ప్రపంచ సాహిత్యానికి సంబంధించిన చాలా అంశాలు అధ్యయనం చేసే అవకాశం వచ్చింది.

చాలా మంది నన్ను "ఒకరే ఒంటరిగా ఉంటరు కదా? ఎట్ల ఉంటరు? ఇబ్బంది కాదా?" అని అంటుంటారు. నేనొక్కడినే ఎలా ఉంటా? ఒక సారి బుచ్చి బాబు ఉంటడు. గోపిచంద్ ఉంటడు. రావి శాస్త్రి ఉంటడు. లేకపోతే బైరాగి, దాశరధి, దర్విష్ వీళ్ళందరితో పాటు సహయానం వడుస్తుంటుంది. ఇపుడు సీమస్ హీనీని చదువుతున్న. ఆయన అధ్యయనలోకంలోకి వెళుతున్న.!

నా ఇంటర్మీడియట్ ను నేను ములుగు రోడ్, వరంగల్ లోని లాల్ బహుదూర్ కాలేజిలో చదువుకున్నా. అందులో ఒక లైబ్రరీ ఉండేది. "ఆ లైబ్రరీని అత్యధికంగా వాడింది బహుశా నేనొక్కడినేనేమో! ఇది లైబ్రేరీయన్ చెప్పిన మాట. అందులోనే ఎన్ సైక్లోపిడియా బ్రిటానికా ఉండేది. దీని గురించి ఆంధ్ర సచిత్ర వార పత్రిక ద్వారా తెలిసింది. ఒక స్టూడెంట్ కార్డు ఉండేది. దానిని చూపిస్తే లైబ్రరీలో పుస్తకాలు తీసుకోవచ్చు. నేను కాలేజ్‌లో స్టూడెంట్‌ను ఆ కాలేజీలో జాయిన్ అయిన కొద్దిరోజులకే "ఎన్‌సైక్లోపిడియా" కావాలని అడిగాను. లైబ్రేరీయన్ ఆశ్చర్యపోయిండు. "ఏం కావాలి" అని మరొక సారి

అడిగిండు. ఒక ఇంటర్ చదువుతున్న విద్యార్థి నుంచి అలాంటి ప్రశ్న ఎక్స్‌పెక్ట్ చేసేది కాదు. ఆ విధంగా ఆ లైబ్రరీలో దానిని మొదటి సారి చూసిన. అది ఒక్క పుస్తకం కాదు 26 Volumes. ఆ పుస్తకాలలో ఆల్ఫా బెటికల్ ఆర్డర్‌లో ప్రపంచ జ్ఞానాన్ని ఒక చోట క్రోడీకరించిన విధానం నచ్చింది.

ఆ సమయంలోనే లెక్సికాలజి, లెక్సికోగ్రఫి గురించి కూడా అధ్యయనం చేసిన. డిక్షనరీని ఎలా తయరు చేస్తారు? డిక్షనరీతో పదాలను ఎందుకు ఆల్ఫాబెటికల్ ఆర్డర్‌లో పెట్టాలి? మొదలైన వాటిని అధ్యయనం చేసే అవకాశం ఎన్‌సైక్లోపిడియా బ్రిటానికా వలన వచ్చింది. మొదటి ఇంగ్లీష్ డిక్షనరీ ఫార్మట్‌ను 1755లో తయారు చేసింది శామ్యూల్ జాన్సన్. తరువాత ప్రపంచంలోని అన్ని భాషల్లోని డిక్షనరీలు కూడా తెలుగుతో సహా 'అకారాది క్రమం'లో అదే ఫార్మట్‌లో వచ్చాయి. ఇదేక్రమాన్ని 'ఎన్ సైక్లోపిడియా'లో A నుంచి Z వరకు ఫాలో అయ్యారు. మొత్తం 26కు పైగా వాల్యూమ్స్ ఉన్న బృహత్ సంకలనం బ్రిటానికా! దీనికి సంబంధించిన విషయ సూచికలే రెండు వాల్యూమ్స్ ఉంటాయి. అప్పట్లో నాకు ఏడౌట్ వచ్చినా, ఒక దేశం గురించో ఒక వ్యక్తి గురించో దీన్ని చదవటం ద్వారానే నేను తెలుసుకునేవాణ్ని.

అలా అధ్యయనంలో విస్తృతి పెరిగింది. 'సుషుప్తి నుంచి'లోని కవితలు ఇంటర్ నుంచి డిగ్రీ ఫైనల్ ఇయర్ వరకు ఉన్న పిరియడ్‌లో రాసినవి. అవి కూడా లేపాక్షి బుక్‌లో నేను వరసగా రాసుకుంటూ వెళ్ళి పోయాను! ఏ ఆలోచన కలిగితే, ఎలా అనిపిస్తే అలా రాసుకుంటూ పోయాను.

ఇక్కడ ఇంకో విషయం చెప్పాలి నాకు Hand writing అంటే కూడా బాగా ఇష్టం. తొమ్మిదో తరగతిలోనే ఒక లిఖిత పత్రికను కూడా ప్రారంభించిన. అపుడు ప్రింటింగ్ గురించి తెలువదు. కాని ఒక మ్యాగజైన్ తీయాలి. ఎలా అంటే అందులో అంశాలన్నీ నేనే రాసుకోవాలి, నేనే బొమ్మలు వేసుకునేది. ఆ బొమ్మలకు ప్రేరణ 'చందమామ'లో శంకర్. ఆయనను ఫాలో అవుతూ వేసే వాడిని. ఇక స్క్రిప్ట్ స్టైల్‌కు సంబంధించి నాకు బాగా ఇష్టమైనవాళ్ళు బాపు, చంద్ర. వారు రాసే శైలిలోని స్ట్రోక్స్ గాని, తెలుగు అక్షరాలను విరిచే విధానం గాని బాగా నచ్చి వాళ్ళను అనుకరించడం జరిగేది. అందుకే ఆ నోట్‌బుక్‌లో కవితలను వారి శైలిలోనే రాసాను. "సుషుప్తి నుంచి" కవిత్వం అప్పుడు నోట్ బుక్ లో నా చేతి రాతతో ఎట్లుందో అట్లనే ప్రింట్ చేసిన.

ఇప్పటి తాలూకు జ్ఞానము వద్దనుకున్నాను. మనం 1989 నుంచి 2020 వరకు మధ్య కాలంలో ఎంతో కొంత ఎదిగి ఉంటాము. ఎన్నో మార్పులు జరిగి ఉంటాయి. భౌతికంగా, సామాజికంగా, ఆర్థికంగా, మేధో పరంగా, ఆలోచనాత్మకంగా, కవిత్వ నిర్మాణ పద్ధతుల పరంగా, శైలి పరంగా, వస్తువు పరంగా చాలా పరిణామాలు జరిగాయి.

అయినప్పటికీ ఇవేవీ నాకొద్దు As it is గా print చేయాలనుకొని పుస్తకంగా వేశాను. ఇవి నా తొలి అడుగులు. తప్పటడుగులా, మెప్పటడుగులా నాకు తెలియదు కాని నా తొలి అడుగులు. నన్ను నేను అన్వేషించడం కోసం "సుషుప్తి నుంచి" అనే పుస్తకం వేశాను. గమ్మత్తు ఏందంటే ఇంటర్మీడియట్ స్టేజిలో 'సుషుప్తి' అనే పదాన్ని వాడడమే చాలా పెద్ద విషయం. విస్తృతమైన అధ్యయనం వలన భాషతో, పదాలతో పరిచయం ఏర్పడింది.

అలాగే ఇక్కడ మరో విషయం ప్రస్తావించాలి. నేను చదివిన లాల్‌బహదుర్ డిగ్రీ కాలేజిలో ఒక మ్యాగజైన్ ఉండేది. "బహదుర్" అని దాని పేరు. డిగ్రీ మూడు సంవత్సరాలు వరుసగా నేనే దానికి ఎడిటర్‌గా పనిచేశా. ఎడిటర్‌ని అంత ఈజీగా ఎంపిక చేయరు. దానికి ఒక Essay Writting పరీక్ష పెడుతరు. ఈ పరీక్షలో ఎక్కువ మార్కులు వచ్చిన వాళ్ళు మాత్రమే ఎడిటర్‌గా ఎంపికౌతారు. ఆ కాలేజి చరిత్రలో మూడు సంవత్సరాలు వరసగా ఎడిటర్‌గా ఉండడం అనేది గొప్ప విషయం. ఆ ఎంపిక పరీక్షలో టాపిక్ కూడా వారం రోజుల ముందు చెప్పరు. అప్పటికప్పుడు చెబుతారు Instant essay writing అన్న మాట.

దాని గురించి గంట సేపట్లో రాయాలి. తెలంగాణ మట్టి నుంచి మొదలుకొని మాంచెస్టర్, మాంటీస్సోరి, మదర్ థెరిసా వరకు అన్ని అంశాలు పరిచయమై ఉండడం వలన Topic ఏది ఇచ్చినా, చిన్న విషయం చెప్పినా ఇపుడు గూగుల్‌లో సెర్చ్ చేసినట్టుగా నా బ్రెయిన్‌లో గుర్తుకు తెచ్చుకొని రాసేవాణ్ని.

"సుషుప్తి నుంచి.." కవిత్వం రాయడం వెనుక ఇదంతా ఉంది.

# బహాదుర్

సాహిత్య వార్షిక సంచిక

**1989 - 1990**



లాల్ బహాదుర్ కళాశాల

వరంగల్

# బహాదుర్

1989 - 90

## తెలుగు విభాగము

ప్రధాన సంపాదకులు :
డా॥ ఎ. వెంకటాద్రి
ప్రిన్సిపాల్

ఇతవరి :
జి. యాదగిరి
ఆంధ్రోపన్యాసకులు

సంపాదకుడు :
యం. హరికృష్ణ
బి.ఎ. తృతీయ (ఇ.మీ.)

# EDITORIAL BOARD



**M. Hari Krishna**
B.A. Final
Telugu Editor



**R. Rajeshwar Rao**
B.Sc. (BZC) II year
English Editor



**S.M.L. Prasad**
MPC I year (EM)
Hindi Editor



**Mohd. Jaffer Khalid**
B.Sc. (BZC) II year
Urdu Editor

# 1988 - 1989 బహదూర్ సంచికలో సంపాదకీయం

## సంపాదకీయం

నమస్కారం!

మన కళాశాల సాహిత్య వార్షిక సంచిక "బహాదుర్" తెలుగు విభాగానికి సంపాదకుడిగా మీ అందరి భావాలతో, భాషాపాటవాలతో, ఊహాసమూహాలతో, ఆలోచనావ్యూహాలతో పరిచయం చేసుకోగలగటం నాకు చాలా ఆనందం కలిగించింది.

ప్రతి సంవత్సరంలాగానే ఈ విద్యా సంవత్సరంలో కూడా మన కళాశాల వార్షిక సంచిక "బహాదుర్"కిగాను నిర్ణీత తేదిలో తమతమ రచనలందించి సహకరించిన మనలోని సాహితీమిత్రులకీ కవితా హృదయులకీ నా ధన్యవాదాలు.

ఈ సంచిక కోసం మొత్తం 75 మంది విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా ముందుకువచ్చి తమతమ రచనలను అందచేశారు. వీటిలో 60 పైగా కవితలు, 6 పైగా వ్యాసాలు, 2 కథలు మొ॥నవి ఉన్నాయి. ఐతే పేజీల పరిమితి, స్థలాభావం కారణంగా వీటన్నింటినీ ప్రచురించలేకపోయాం. మన విద్యార్థిలోకంలోని ఔత్సాహిక కవులను రచయితలను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో సాధ్యమైనంత వరకు అందరివీ ప్రచురించబడేలా చూశాం. దీనివలన వ్యాసాలను, కథలను ప్రచురించకుండా ఇందులో కేవలం కవితలనే ప్రచురించడం జరిగింది.

ఈ కవితలు ఆయా విద్యార్థుల ఆశలను, ఆశయాలను, భావోద్వేగాలను, హృదయభావాలను మనసు అట్టడుగు పొరలలోని బాధాగాధలను, ఆనందపు కేరింతలను ప్రస్ఫుటంగా ప్రతిబింబిస్తున్నాయ్. వీటిలో మార్పునుకోరేవి, కర్తవ్యాన్నిస్ఫురణకు తెచ్చేవి, ఈ అస్తవ్యస్త సామాజిక వ్యవస్థను విమర్శించేవి కొన్నికాగా, ప్రేమేజీవితంగా ప్రేమేజీవనంగా తమప్రియుల్ని లేదా ప్రేయసిని ఊహారూపంలో నిలుపుకుని మదిలో నింపుకుని హృదయాన్ని చింపుకుని తద్వారా వెలిగ్రక్కిన, వెళ్ళగక్కిన ప్రేమ కవితలు మరికొన్ని, ప్రకృతినీ, ప్రకృతిలోని వింత వింత ఆకృతినీ చూచి స్పందించడానికి కృతిగా సమర్పించిన భావకవితలు మరికొన్ని.

సాధారణంగా కళాశాల స్థాయిలో చదివేవాళ్ళు అందరూ టీనేజ్ వాళ్ళే ఈ టీనేజ్‌లో అవరేజ్‌గా స్పెషలైజ్ అయ్యేటీ, రియలైజ్ రికగ్నైజ్ చేసుకునేది అంతా తోడుకోసమే. అందుకే ఇందులో ఎక్కువ కవితలు ప్రేమ చుట్టూ కేంద్రీకరించబడి ఉన్నాయి.

ఐతే కొంతమంది విద్యార్థులు కాపీ రచనలను ఇవ్వడం శోచనీయం. వీరిదృష్టిలో కవితలు వ్రాయడమంటే బ్రహ్మవిద్యేమో నాకుతెలియదు "కవిత" అనేది ఆయావ్యక్తుల ఆలోచనలకు, ఊహలకు, భావాలకు అక్షరరూపంలో కూర్చిన ప్రతీక తమలోని భావాలను ఏదో ఒకవిధంగా "అక్షరీక

రించడమే" కవిత. ఇలాంటి కవితలను తమ స్వతహాగా, తమ తమ భాషాలాఘవాల మేరకు వ్రాయాలి కానీ 'కాపీ' కొట్టడం అనేది చాలా విచారించదగిన అంశం. ఇలాంటి విద్యార్థులు ఇకముందు సాధ్యమైనంత వరకు తమ స్వీయ ఆలోచనలకు ప్రాధాన్యం ఇవ్వగలరని ఆశిస్తున్నాను.

మొత్తంమీద అందరూ తమ ఆలోచనాపటిమకు, భావ విన్యాసాలకు పదును పెట్టి తమ భాషా నైపుణ్యాల మెరుగులుదిద్ది అరుదైన అచ్చమైన "కవితాశిల్పాన్ని" రూపొందించారనడం నిస్సందేహం

ఇందులో ప్రచురించబడిన కవిత రచయితలకు మా అభినందనలు ప్రచురించబడని రచయితలు కవులు నిరుత్సాహపడకుండా 'త్రి' గుణీకృతోత్సాహంతో ప్రయత్నించగలరని మనవి. రచయితలందరికి మా కృతజ్ఞతలు. మీరు మున్ముందు ఇంకా ఉత్తమమైన, సర్వోత్తమమైన, ఉన్నతమైన రచనలు చేసి సాహితీవినీలాకాశంలో చిరుతారలై, సాహితీవనంలో పారిజాతాలై, సాహితీ కళామతల్లికి కరతలామలకాలై విరాజిల్లాలని ఆశిస్తున్నాను.

చివరగా, నాకు ఈ సంపాదక బాధ్యతను అప్పగించిన మన కళాశాల ప్రిన్సిపాల్ డా॥ ఎ. వెంకటాద్రిగారికి, అవసరమైనపుడు సలహాలు, సూచనలుఇచ్చి ప్రోత్సహించిన ఇతవరి డా॥ ఐ. కిషన్‌రావుగారికి, నా వెంట ఉండి నా ఈ సంపాదక బాధ్యతలను నిర్వర్తించడంలో పూర్తి సహాయసహకారాలను అందించిన సాహితీమిత్రుడు, కవి శ్రీ ఆకునూరి మల్లయ్యగారికి మరియు ఈ గురుతర కృషివెనుక ఉన్న మిత్రులకి, శ్రేయోభిలాషులకి కృతజ్ఞతాభివందన వందనాలను తెలియచేస్తూ....

మీ

మామిడి హరికృష్ణ

( తపస్వి )

సంపాదకుడు

# 1989 - 1990 బహదూర్ సంచికలో సంపాదకీయం

## అవలోకనం

నమస్కారం!

మన కళాశాల వార్షిక సంచిక "బహదూర్" తెలుగు విభాగ సంపాదకునిగా వరుసగా మూడో సారి మీమీ రచనలతో, భావాలతో, ఆలోచనలతో, ఉద్దేశ్యాలతో లక్ష్యాలతో అన్నిటినీ మించి మీ మీ రచనా శైలితో పరిచయం కలగడం నాకెంతో ఆనందంగా ఉంది.

ఈ సంచిక ప్రత్యేకతల గురించి తెల్సుకునే ముందు ఈ సంచిక రూపకల్పనకి అందిన రచనలను గురించిన సమాచారాన్ని తెల్సుకోవడం అవసరం. మొత్తం 18 వ్యాసాలు, కథలు, 125కు పైగా కవితలను మన విద్యార్థి మిత్రులు అందజేయడం ద్వారా ఈ సంచిక సృజనకి కారకులయినారు. వీరందరికీ నా కృతజ్ఞతాభివాదములు.

ఈ 1989-90 వార్షిక సంచిక విషయానికొస్తే, దీనిని స్థూలంగా రెండుగా విభజించడం జరిగింది. 1) కథ, వ్యాసాలు 2) కవితలు, సాహిత్యం యొక్క వివిధ రూపాలయిన కథ, వ్యాసం, కవిత మొ॥ వాటిని ప్రతిబింబించాలనే ఉద్దేశ్యంతో ఈ విభజన చేయడం జరిగింది. స్థలాభావం వల్లనైతేనేమి, ఎక్కువ మంది విద్యార్థుల రచన లు ప్రచురించాలనే సదుద్దేశం వల్లనైతేనేమి, గత రెండు వార్షిక సంచికలలో కేవలం కవితలను మాత్రమే ప్రచురించడం జరిగింది. దీనివల్ల గత రెండు సంచికలు పేరుకు "సాహిత్య వార్షిక సంచిక"లుగా ఉన్నప్పటికీ వివిధ సాహిత్య రూపాలను ప్రతిబింబించక పోగా ఏక పక్షంగా తయారవడం జరిగింది. ఈ లోపాలను దృష్టిలో పెట్టుకుని లోప రహితంగా కాకపోయినా, లోపసహితంగా మాత్రం ఉండకుండా ఈ సంచికను మీ ముందుకు తీసుకురావడం జరిగింది. వీన్ని బట్టి గత రెండు సంచికల కన్నా ఈ సంచిక విశిష్టమైందవడంలో ఎవరికీ అనుమానం ఉండదు కదా!

అంతేగాక, 'ఒమేరో అరెడ్జిస్' అనే మెక్సికన్ ఆధునిక కవి అన్నట్లు

"మన తల్లిదండ్రులు మనకి రక్తాన్నిచ్చారు
ఒక భాష నిచ్చారు
మనం మన పిల్లలకి ఒక కొత్త రక్తాన్నిద్దాం
ఒక కొత్త భాషనిద్దాం" అనే ఉద్దేశ్యంతో మన పూర్వ సంపాదకులు ఏర్పరిచిన

సంప్రదాయాలను అనుసరిస్తూనే, వైవిధ్యం కోసం ప్రతి వ్యాసాన్నీ సంపాదక పరిచయ వ్యాఖ్యానంతో ప్రారంభించడం జరిగింది. ఇది కేవలం పరిచయ వాక్యాలుగానే మిగలకుండా, అవసరమైన చోట వ్యాసానికి సంబంధించిన అదనపు సమాచారాన్ని అందించేలా ఉండటాన్ని మీరు గమనిస్తారు. ఈ

వ్యాసాల ప్రచురణలో గల మరో విశిష్టత ఏమిటంటే, వ్యాస రచయితలలో చాలా మంది ఆయా విద్యా రంగాలలో ప్రత్యేకీకరింపబడినవారు కావడమే.

ఇక వ్యాసంలోనికెళ్ళి చూస్తే, వ్యాసాలు ఆయా రంగాలను ప్రతిబింబిస్తూ రాయడం జరిగిందనే విషయం స్పష్టపడుతుంది. అవి 1) సాధారణ మరియు సామాజికాంశాలు ప్రాధానంగా గల వ్యాసాలు. దీనికి ప్రతి రూపాలుగా చల్లా దేవారెడ్డిగారి 'మన దేశంలో శాస్త్రీయ దృష్టి లోపం – హిందూ మత ప్రభావం', ఆకునూరి మల్లయ్యగారి 'పితృస్వామ్య వ్యవస్థలో ఆడవాళ్ళ అవస్థలు' మరియు యస్.ఆర్. రాణిగారి "సీటు–పాటు" మొ॥ ఉదహరించవచ్చు. 2) సమకాలీన అంశాలే ప్రాధానంగా గల వ్యాసాలు ఆర్. రవీందర్‌గారి 'భారత్–పాక్ సంబంధాలు' మరియు యం. శ్రీధర్ గారి "ప్రపంచ శాంతి" ఈ కోవకి చెందినవి. 3) ప్రత్యేక అంశాలు ప్రాధానంగా గల వ్యాసాలు. కె. జనార్ధన్ గారి 'భారత దేశం ఆర్థిక స్థితిగతులు', ఆర్. సుధాకర్ రెడ్డి గారి 'గ్రుడ్డు–ఒక పోషకాహారం' ఈ తరగతికి చెందినవి.

ఇక కవితా విభాగం విషయంలో "శివతాండవం" గ్రంథకర్త పుట్టపర్తి నారాయణాచార్య దృష్టిలో "కవిత్వంలోని వాదాలలో ప్రధానమైనవి రెండు – భాష, భావము" అన్న అభిప్రాయాన్ని బట్టి, మరియు "భాష, భావం అనే వజ్రాలను సానపట్టి పలకలు చెక్కి అందంగా ఉంగరంలో పొందికగా అమర్చేవాడు కవి" అన్న Alexander Pope మాటలను బట్టి భాష, భావం అనే రెండు అంశాలకు కవిత్వంలో గల ప్రాధాన్యత చేత తెల్లమగుచున్నది.

"భావం" కవి ఉద్దేశ్యాలు, లక్ష్యాలు, ఆలోచనలు, ఆకాంక్షలు మొ॥ వాటి సమ్మిళితమై, సామాజిక, ఆర్థిక, రాజకీయ సాంస్కృతిక, చారిత్రక అంశాలచేత మరియు కవికున్న పరిజ్ఞానం, పరిశీలనాశక్తి, పరిశోధనాశక్తి చేత ప్రభావితం అవుతుంది. కాగా కవి భావ వ్యూహాలనూ, ఊహా సమూహాలను, ఆలోచనా తరంగాలను, ఆకాంక్షల కెరటాలను లిఖితబద్ధం చేసే అక్షర సముదాయమే "భాష" స్వర్ణకారుని చేతిలో బంగారపు తీగె ఎన్నో మెలికలు తిరిగి ఆభరణం అయినట్లే, 'భాష' కూడా కవి యొక్క 'భావ' ప్రవాహంలో ఎన్నో వంకరులు తిరిగి కవితగా రూపొందుతుంది. దీన్ని బట్టి "భావం" స్వతంత్ర భూత బలాంకమనీ, "భాష" ఆధారభూత బలాంకమనీ అనడానికి చాలా సుగమం అవుతున్నది. ఈ సంచిక కవితలలో ఈ రెండు అంశాలనూ ప్రతిబింబించేవి ఉన్నాయి కనుక "భాష–భావం"ల ప్రాతి పదికగా ఈ కవితా విభాగాన్ని విశ్లేషిస్తాను.

ముందుగా 'భాష' ప్రాతిపదికగా చూస్తే 'సిద్ధాంతాల దాసనత్వం నుంచి స్వేచ్ఛనిచ్చే ఒకే శక్తి కవిత్వం' అని మహాత్మాగాంధీ నుడివిన మాటలకు ప్రతిరూపంగా నిలిచేవి కొన్ని కాగా, 'తన మానసిక స్థితిని ఇతరులకు అర్థం అయ్యేలా చెప్పడం చాలా కష్టం' అన్న చలం మాటలను స్ఫురణకు తెచ్చేవి కొన్ని ఉన్నాయి.

కవితలో అంతర్లీనంగా దాగి ఉన్న 'భావం' ప్రాతిపదికగా చూస్తే రెండు రకాలు – భావాత్మకము భౌతికాత్మకము అయిన కవితలు ఉన్నాయని చెప్పవచ్చు. భావాత్మక లేదా ఆత్మాశ్రయవాద కవితలలో ప్రేయసి, ప్రియుల ప్రేమ ప్రధానాంశంగా ఉండగా, భౌతికాత్మకమైన కవితలలో అభ్యుదయ, విప్లవ, సామాజిక సంస్కరణ ధోరణులు మొ॥ ప్రధానాంశాలుగా ఉన్నాయి.

ఈ కవితా విభాగంలోని మరొక విశిష్ట అంశంగా 'అశు కవితా పోటీలో' బహుమతి పొందిన కవితల ప్రచురణను చెప్పవచ్చు. మన కళాశాలలోని 'Committee of Co-curricular Activities' వారు ఈ 'అశు కవితా పోటీ'ని 'స్నేహం' అనే శీర్షిక పై నిర్వహించారు. ఇందులో బి.ఏ. ప్రథమ సం॥ తెలుగు మీడియంకు చెందిన యల్. గోపాల్ రెడ్డి గారు Distnictive Special Prizeము: B.Sc. (BZC) తృతీయ సం॥ ఇంగ్లీషు మీడియంకు చెందిన బి. కనకదుర్గ గారు ప్రథమ బహుమతిని పొందడం జరిగింది. ఈ రెండు కవితలలో ఒకటి ఛందోబద్ధంగానూ, మరొకటి స్వచ్ఛమైన వచనం లోనూ రచించబడి వీటికి గల ప్రత్యేకత దృష్ట్యా ఈ రెండింటినీ కొంత వరకు సమీక్షించడం అవసరం అనిపిస్తున్నది.

యల్. గోపాల్ రెడ్డిగారి పద్యమును సమీక్షించే ముందు ఛందోబద్ధ కవితా (పద్యం) గురించి కొన్ని వివరాలు తెల్సుకోవడం ఎంతయినా అవసరం. ఛందోబద్ధ రచనలకి కాలం చెల్లిందని కొందరు, వచనంలో సైతం ఛందోబద్ధత లేకపోలేదని మరికొందరు తమ తమ విమర్శలను, వాదనలను ఇంకా కొనసాగిస్తున్న తరుణంలో మన కళాశాలలోని సహవిద్యార్థి ఛందోబద్ధ రచన చేయడం మనమంతా గర్వించదగ్గ అంశం. గిడుగు వెంకట రామమూర్తి పంతులు గారు లేవ దీసిన 'వ్యావహారిక భాషా ఉద్యమం' వల్లనైతేనేమి, తెలుగు వచన కవితా పితామహుడు కుందుర్తి అంజనేయులు సభ్యుడిగా గల 'ఫ్రీ వర్స్ ఫ్రంట్' కృషి వల్లనైతేనేమి నేడు పద్య రచన (ఛందోబద్ధ కవిత) ప్రాచుర్యం, ప్రాముఖ్యత తిరోగమించింది. నార్ల వెంకటేశ్వరరావుగారన్నట్లు ప్రబంధ కవులు లేదా పద్యకవులు 'యతిప్రాసల పైన, యమకాల పైన చూపించే మోజులో పాతికో, పరకో మాత్రమే నిక్కువమైన కవిత మీద చూపించనప్ప'టికీ, నేడు ఈ పద్య కవులు సైతం "వచన కవిత్వం అంటే ప్రజల కవిత్వం, నా కవిత్వానికి వ్యాకరణం ప్రజలు" అన్న కుందుర్తి అంజనేయులు మాటలను తమ పద్యాల ద్వారా రుజువు చేస్తున్నారు.

ఇప్పుడు, ఇక పద్యం వైపు దృష్టి సారిద్దాం దీనిని కవి వరుసగా తేట గీతి, అట వెలది మరియు కంద పద్యాలతో పూర్తి చేశాడు. కవి 'స్నేహం' అనే విస్తృత భావనని తన పద్యాలలో సమర్థ వంతంగా నిర్వహించడమే కాక,

'స్నేహ దీపమొకటె జీవితాంతమునిచ్చి
అరిపోదు ఎపుడు పోరకున్న' అని వైషమ్యం లేనంత వరకూ దానికి గల శాశ్వతత్వాన్ని నిర్ధారించాడు. అంతేగాక,

'సుజన చెలిమి లేని జీవితంబుల కంటె
మృత్యువైన చాలునదియె ఫలము' అని అంటూ మంచి స్నేహం పొంద కుండా జీవించం కన్నా చావడమే మేలని చెప్పడమే కాక, అలా అని చెడ్డవారితో సైతం స్నేహం నియచేడాకి పాల్పడకూడదని

'కుజన చెలిమి కంటె కూర్చునుఱెమిన్న' అన్న వేదువాస్తవాన్ని చెప్తూనే, మంచి, చెడు స్నేహాల మధ్య స్పష్టమైన రేఖల్ని గీసాడు.

ఇక ప్రథమ బహుమతి పొందిన బి. కనకదుర్గ గారి కవితను పరిశీలిస్తే, అది మొదటి పద్యానికి పూర్తి భిన్నంగా (భావంలోనూ, భాషలోనూ మాత్రం కాదు సుమా!) ఉన్నదనే విషయం తెలుస్తుంది. కవయిత్రి వచనంలో రాసింది కనుక దీనిని 'పద్యం' అనడం కన్నా 'కవిత' అనడమే సమంజసం. కవయిత్రిగారు

'స్నేహాన్ని మించింది లేదు లోకాన

అది అన్నింటి కన్న మిన్న తూకాన' అన్న మొదటి వాక్యాలలోనే 'స్నేహం' కు గల అధిక్యాన్నీ, సార్వజనీనతని అల్ప పదాలతో జనల్పార్థాన్ని సృష్టించారు. అంతేగాక,

'ఈ కవిత నా స్వంతం

కాదు దేనికి అనువాదం' అని అంటూనే తనదైన, తన భావరూపమైన ఈ కవితను

ఇస్తున్నా నా నేస్తానికి అంకితం

లేకుండానే నా సంతకం అని తన నేస్తానికి (?) అంకితం ఇస్తున్నానడంలో కవయిత్రికి గల స్నేహ పిపాస, ఆచరణాత్మకత, నిబద్ధత మనకు బోధపడ్తాయి.

చివరగా, నా ఈ సంపాదక బాధ్యతల నిర్వర్తనలో నా నూతన పంథాను సమర్థించడమే కాక, అందుకు అవసరమైన సలహాలు, సూచనలు అందచేసి ప్రోత్సహించిన ఇతవరి, ఆంధ్రోపన్యాసకులు శ్రీ జి. యాదగిరి గారికి, ఈ ప్రక్రియలో నన్ను వెన్నంటి ఉన్న మిత్రుడు శ్రీ ఆకునూరి మల్లయ్య గారికీ, ఈ వార్షిక సంచిక ప్రధానాచార్యులైన డా॥ ఎ. వెంకటాద్రి గారికీ నా యొక్క కృతజ్ఞతలు.

మరియు ఈ "తాజ్ మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలై"న................ ప్రింటింగ్ ప్రెస్ యజమాని, కార్మికులు మరియు విద్యార్థి రచయితలు, ఇతర మిత్రులందరికీ నమస్సులర్పిస్తూ

మీ

హరికృష్ణ

సంపాదకుడు

Q

- **మీతో పాటు సమకాలినంగా రాసిన కవులు ఎవరు? వారిలో మీ ప్రత్యేకత ఏమని అనుకుంటారు?**

– నేను నమ్మేది ఏమిటంటే ఎవరికి వారే కొలమానం! కవిత్వానికి సమకాలీనత ఒకటి ఉంటుంది. అలాగే సార్వకాలీనత, సార్వజనీనత కూడా ఉంటుంది. ఏ ఇతర కవులతోను నేను పోల్చుకోలేదు. అది విమర్శకులు చేయాల్సిన పని. ఒక విమర్శకుడు ఆ కాలంలో వస్తున్న సాహిత్యాన్ని కవుల ప్రత్యేకతలను గురించి వారే మాట్లాడాలి. ఒక కాలంలో వస్తున్న కవిత్వాన్ని లేదా సాహిత్యాన్ని పరిశీలించడం ఒకటైతే, ఒక కవికి మరొక కవికి వస్తువు విషయంలో గాని, శిల్పం విషయంలో గాని, కవిత్వాన్ని వ్యక్తీకరించే ధోరణుల విషయంలో గాని తులనాత్మకంగా అధ్యయనం చేయడానికి విమర్శకు లైతే బాగుంటుంది. నేను దాని మీద ఖచ్చితంగా చెప్పలేను.

నా కవిత్వమంతా కూడా సార్వకాలీనమే! నేననే గాదు ఎవరు కవిత్వం రాసినా అందులో సార్వకాలీనతే ఉంటుంది. ఉదాహరణకు మీ కవ్వితమే తీసుకుందాం. తగుళ్ళ గోపాల్ రాసిన "దండకడియం" కవిత్వంలో మాండలిక భాషా పదాలు, తెలంగాణ భాషా పదాలు, తెలంగాణ జన జీవనం ఉన్నప్పటికీ సార్వకాలీనతే ఉంటుంది. కవిత్వం గొప్పతనమే అది. కవిత్వం ఈ కాలానికి సంబంధించిన అక్షరాలతో కూడిన రచన అయినప్పటికి దానికి సార్వకాలీనత, సార్వజనీనత ప్రధానంగా ఉంటుంది. అందుకని కవిత్వానికి సంబంధించి సమకాలీనత కంటే కూడా ఈ కోణంలో ఆలోచించడం మంచిదని నా వ్యక్తిగత అభిప్రాయం

ఇక రెండోది ఏమిటంటే, నన్ను ప్రభావితం చేసింది ఒక్కరు అని చెప్పలేను. అన్ని రకాల సాహితీ ధోరణులు, అన్ని రకాల సాహితీ ప్రక్రియలు నేను చదివాను. తెలుగు విషయానికి వస్తే పద్యం నుంచి మొదలు కొని గజల్ వరకు నాకు ఇష్టమే. వాటి ప్రభావం ఖచ్చితంగా ఉంటుంది. నేను స్పష్టంగా గీత గీసి ఈ ప్రభావం వలన ఈ కవిత్వం రాశానని చెప్పలేను గానీ వాటన్నింటి యొక్క సంకలన రూపంగా మాత్రం ఉండడం జరుగుతుంది.

ఇంకో విషయం ఏమిటంటే, కవిత్వానికి ప్రభావం గాని, ప్రేరణ గాని కవిత్వమే కానవసరం లేదు. ఒక నవల చదివినపుడు కూడా కవిత్వం రాయొచ్చు ఒక సినిమా చూసినపుడు కూడా కవిత్వం రాయొచ్చు. చాలా మంది గొప్ప కవులు కూడా Even శ్రీశ్రీ కూడా రాక్సీ థియేటర్ గురించి కవిత్వంలో రాశారు. మనం వస్తువుగా మెచ్చి ప్రేరణ ఇచ్చే అవకాశం ఉన్నది ఇదే అని నిర్దిష్టంగా చెప్పడానికి లేదు.

ప్రక్రియల విషయానికొస్తే పద్య ప్రక్రియ కూడా నాకు ఇష్టం! పెద్దన రాసిన 'స్వారోచిష మనుసంభవం' అనబడే 'మను చరిత్ర' లోని "అటజని కాంచె భూమిసురుడంబరచుంబి" పద్యంలోని నడక, అల్లసాని జిగిబిగి శైలి ఎంతిష్టమో, కురిక్యాల శాసనానికి సంబంధించిన కంద పద్యాలు కూడా అంతే గొప్పగా అనిపిస్తాయి. ఆధునిక కవిత్వానికి సంబంధించి శేషేంద్ర శర్మ, భైరాగి, మో, ఖాదర్ మొహియుద్దీన్, అఫ్సర్, ప్రసేన్, సీతారాం, యాకూబ్, నందిని సిధారెడ్డి, నాళేశ్వరం శంకరం, దర్భశయనం శ్రీనివాసా చార్య, మందరపు హైమావతి, కొండేపూడి నిర్మల,పైడి తెరేష్ బాబు, మద్దూరి నగేష్ బాబు, కె.శ్రీనివాస్, లక్ష్మీ నరసయ్య... ఇలా ఎంతో మంది ఉన్నారు. ఒక్కరని చెప్పలేను.

కవిత్వం అనేది నిరంతర అధ్యయనం. నిత్యానుభూతి! అలాగే త్రిపురనేని శ్రీనివాస్ రాసిన "రహస్యోద్యమం" కవిత్వం ఉంది. దాని నుంచి ప్రేరణ పొందుతాము. దాంట్లో ఎన్నో అద్భుతమైన వాక్యాలు ఉన్నాయి. 1990లలో కవిత్వంలో గొప్ప రెవల్యూషన్ తీసుకొచ్చిన ఒక పీరియడ్ అది. అదే టైం లో దళిత వాద కవిత్వం వచ్చింది. మైనార్టీవాద కవిత్వం వచ్చింది. స్త్రీ వాద కవిత్వం వచ్చింది. వీటన్నింటి ప్రభావం, భావధార మన మీద ఉంటుంది. నిరంతరం అధ్యయనం చేస్తాము గనుక వాటి ప్రభావం ఉండొచ్చు,

ఉండక పోవచ్చు. ఏది ఎక్కడ మొదలు ఏది ఎక్కడ అంతము అని చెప్పడానికైతే ఉండదు.

మాయా ఏంజిలో ఉంది. ఆమె కవిత్వమంటే విపరీతమైన ఇష్టం. ఎవర్ని కాదంటాము, ఎక్కడ కాదంటాము చదువుతున్న క్రమంలో ఒక్కొక్కరిది ఒక్కొక్క వాక్యం గొప్పగా మనల్ని ప్రేరేపించవచ్చు. కవిత్వానికి సంబంధించిన సంపూర్ణ జీవితాన్ని ఆవిష్కరించవచ్చు. టోని మారిసన్ నవల The Beloved చదివాను. అది చదివినప్పుడు కవిత్వం రాయాలనిపించింది.ఒక నవల కవితకి ప్రేరణ కావడం, ఒక సినిమా కవితకు ప్రేరణ కావడం చాలా సందర్భాలలో జరుగుతుంది. గనుక ఇది మాత్రమే కవిత సృష్టికి కారణం అని కాకుండా మన చుట్టూ ఉండే జీవితం, మనం చూస్తున్న ప్రపంచమే కవిత్వానికి ప్రేరణగా నిలుస్తుందని నా భావన.

ఇంకా చెప్పాలంటే తెలంగాణ భాషలో విస్తృతంగా కవితలు రాయడం జరిగింది. బతుకమ్మ పండుగ గురించి, బోనాల పండుగ గురించి "ఊరికి పోయిన యాళ్ళ"లో చాలా కవితలు ఉంటాయి.

అందుకని కవి సమకాలీనతకు మాత్రమే పరిమితమై లేడు. కవి సార్వజనీనుడు,! సార్వకాలికుడు! 9వ శతాబ్దం నాటి పంపన కూడా నా మీద ప్రభావం చూపించి ఉండవచ్చు. ఈనాటి తగుళ్ళ గోపాల్ దండకడియం కూడా ప్రేరేపించి ఉండవచ్చు. ఇదొక నిరంతర ధార. ఈ నిరంతర ధారలో మన కాల కొలమానాల ప్రకారం సమకాలీనత అనే ఫ్రేములో కాలాన్ని ఫ్రీజ్ చేసి చెప్పడానికైతే ఉండదు అని నేను అనుకుంటాను.

Q

- ***వచన కవిత్వంలో "ఫ్యూజన్ షాయరీ" అనేది మీరు ప్రవేశ పెట్టిన కొత్త ఒరవడి. దాని వలన కవిత్వం చదవడం కూడా చాలా సహజంగా అనిపిస్తుంది. ఫ్యూజన్ షాయరీ పట్ల మీ అభిప్రాయం?***

- We are Living in a world where all the Multi Cultural and Multi Lingual lives are Intertwined గ్లోబల్ విలేజ్ కాన్సెప్ట్ వచ్చిన తరువాత  అంటే 1991 తరువాత, ముఖ్యంగా ప్రపంచం అంతా ఒక కుగ్రామం అయిపోయింది. ఇక ఇంటర్ నెట్ రెవల్యూషన్, సోషల్ మీడియాలు వచ్చిన తర్వాత ఒక వ్యక్తికి సంబంధించిన జీవితం కానీ, సమాజం గానీ, దేశం, జాతి గానీ వాటి జీవితాలు కానీ ఒక నిర్దిష్టమైన జీవిత శైలికి మాత్రమే పరిమితమై ఉండే స్థితిని దాటిపోయాయి.

అన్ని దిక్కుల నుంచి అన్ని రకాల, జాతుల సంస్కృతులు వచ్చిపడుతున్న సందర్భంలో మనం ఉన్నాం గనుక అలాంటి జీవితాన్ని మనం అనుభవిస్తున్నాం గనుక మనం వాటన్నిటి చేత ప్రభావితం అయిన మానవుడిగా మారడంలో ఆశ్చర్యం లేదు. ఒకప్పుడంటే అంబాసిడర్ కార్ ప్రీమియర్ పద్మిని అనే రెండు కార్లే ఉండేవి. ఇపుడు ఒక సుజుకి మారుతి కార్‌లోనే 15 రకాల Variants ఉన్నవి. ఇలాంటి ఒక జీవన వైవిధ్యాన్ని, జీవన వైశాల్యాన్ని మన వస్తు సంస్కృతిలోనే కాకుండా, జీవన సంస్కృతిలో కూడా కనిపించే విధంగా టి.వి. రెవల్యూషన్, శాటిలైట్ ఛానల్ రెవల్యూషన్, సినిమాలు, ఒ.టి.టిలు అలాగే టెక్నాలజి అడ్వాన్స్‌మెంట్ వచ్చినందువల్ల మనది ఫ్యూజన్ లైఫ్ అయిపోయింది. ఒక దానితో ఒకటి సమ్మిళితం అయిపోయి, సకల అంశాల సంగమ జీవన స్థలి అయ్యింది. దానితో పాటు ఫ్యూజన్ మ్యూజిక్ కూడా

వచ్చింది. ఒకప్పుడు కర్ణాటక శాస్త్రీయ సంగీతం, లేదా హిందూస్థాని సంగీతం, రవీంద్ర సంగీత్ ఉండేది. అలాగే వెస్టర్న్ కల్చర్‌కు కూడా వెస్టర్న్ క్లాసికల్ మ్యూజిక్ ఉంది. మనం స-రి-గ-మ-ప అంటే వాళ్ళు డొ-రె-గ-మ అంటారు. వాళ్ళకు కూడా ఒక క్లాసికల్ మ్యూజిక్ ఉంది. మొజార్ట్, బీథోవెన్ వంటి వారు ఎన్నో గొప్ప సింఫనీలను కంపోజ్ చేసారు. అలా East meets west శైలిలో Fusion music వచ్చింది. అలాగే Fusion dance! even Michael Jackson Black or white పాటలో ఒడిస్సీ నర్తకితో కలిసి ఆడిపాడతాడు. అలాగే భారతీయశాస్త్రీయరీతులలోనే భారతనాట్యం, ఒడిస్సీ, కథకళి, కూచిపూడి, కథక్ వాటిని కలిపి ఒకే ఫ్యూజన్ డ్యాన్స్ ప్రదర్శిస్తున్న ప్రయోగాలు ఇప్పుడు సాధారణం అయిపోయాయి. folk fusion కూడా ఇప్పటి ట్రెండ్! భాంగ్రా, గర్భ, డాండియా, డప్పులు, శింగారి మేళం, డోలు,జాజ్, కీబోర్డ్, సాక్సాఫోన్, ఫ్లూట్, తబలాలు కలిసి కొత్తతరం సంగీతనృత్యాలను ఈ శైలిలో అందిస్తున్నాయి.

ప్రస్తుతం ఒక జాతి మరొక జాతితో, ఒక భాష మరొక భాషతో, ఒక సంస్కృతి మరొక సంస్కృతితో ఆదాన ప్రదానాలు జరుగుతున్న ఒక జీవన దశలోమనం ఉన్నాం! గనుక సాహిత్యంలో కూడా ఫ్యూజన్ షాయరీ ఎందుకు ఉండకూడదు? అనిపించింది. కొన్ని పదాలను. భావాలను చెప్పడానికి మళ్ళీ మన మాతృభాషలోనే దానికి తగిన పదాలనే వెతుక్కొని వెతుక్కొని రాయాల్సిన అవసరం ఏముంది?

ఒకప్పుడు 'పద్య' సాంప్రదాయం కాదని 'వచన కవిత్వం' ఎట్లైతో వచ్చిందో, జీవితం ఆ జీవితాన్ని ప్రతిబింబించేవే ఫ్యూజన్ అనేది రేపటి తరానికి, ఇప్పటి తరానికి సంబంధించిన ఒక కవితా ప్రక్రియ ధోరణిగా భావించి ఆ వస్తువు, ఆ శిల్పాన్ని అట్లా ఎన్నుకోవడం జరిగింది. ఇప్పుడు ఫ్యూజన్ మ్యూజిక్, ఫ్యూజన్ డాన్స్ కూడా జీవనంలో అంతర్భాగం అయ్యింది. ఇలాంటి సందర్భంలో ఫ్యూజన్ సాహిత్యం మాత్రం ఎందుకు ఉండకూడదు?

ఒక ఇంగ్లీష్ భాషా పదం లేకుండా ఒక ఊర్దూ భాషా పదం లేకుండా, తెలుగు భాషను స్వచ్ఛంగా, సంపూర్ణంగా మాట్లాడగలిగే స్థితి ఇప్పుడు లేదు. అలాంటపుడు కవిత్వంలో మాత్రం మడి గట్టుకొని ఎందుకు కూర్చోవాలి? అనే ఆలోచన ఒకటి ఉంది.

ఇంకా చెప్పాలంటే కొన్ని ఎక్స్‌ప్రెషన్స్ చెప్పడానికి కొన్ని పదాలే

సరిపోతాయి. కొన్ని భాషలే బాగాసరిపోతాయి. ఎందుకంటే కొన్ని వేదనలు, ఎమోషన్స్ కొన్ని జాతులకు సంబంధించి గొప్పగా ఉంటాయి. ఉదాహరణకు తెలంగాణ పరంగా చెప్పాలంటే 'గోస' అనే పదం ఉంది. ఒక ట్రాన్స్‌లేటర్‌గా దీనికి సమాన ఇంగ్లీష్ పదం గురించి ఎంతో తండ్లాడాను. తెలుగు నుంచి ఇంగ్లీష్‌కు, ఇంగ్లీష్ నుంచి తెలుగుకు కొన్ని వందల కవితల్నినేను అనువాదం చేశాను.

అనువాదం చేస్తున్న క్రమంలో నాకు అర్థమైన విషయం ఏందంటే కొన్ని పదాలు కొన్ని భాషల్లో మాత్రమే అద్భుతంగా అతుకుతాయి. వాటిని ఇతర భాషల్లో ఎంత చెప్పినా, ఎన్ని సమానార్థకాలు వెతికి చూచినా ఆ గాఢత గానీ, ఆ తాత్వికలోతు గాని దాంట్లో రాదు. 'గోస' అనే తెలంగాణ పదాన్నే ఉదాహరణగా తీసుకుంటే ఇంగ్లీష్ లో ఈ పదానికే Agony అంటాను. Pain అంటాను. మరి 'గోస' అంటే Agony మాత్రమేనా? గోస అంటే Grief మాత్రమేనా? గోస అంటే Pain మాత్రమేనా? గోస అనంగానే తెలంగాణలో "అరిగోస" పడుతున్న అంటరు. అరిగోస అనే పదంలోనే ఆ భావనలో దాగి ఉండే ఎమోషన్స్ తాలూకు గాఢత,లోతు, దాని విశ్వరూపమంతా అర్థమవుతుంది. అదే ఇంగ్లీష్‌లోకి అనువాదం చేస్తున్నపుడు కొంతైనా కుంటుపడుతుంది. ఆయా భాషల్లో ఉండే స్థానిక, ప్రాదేశిక పరమైన అవసరాలు, ప్రజల జీవన విధానం, జీవన అనుభవాలు వీటన్నింటి నుంచి పదాలు పుడుతాయి. అందుకని ఆ పదాల్లో ఆ గాఢత ఉంటుంది. అలాంటపుడు ఇంగ్లీష్ పదాలకు బదులుగా తెలుగు పదాలను వెతకాల్సిన అవసరం ఏమిటి? అదే పదం పెడితే తప్పేంటి? ఈ ఒక్క ఆలోచనే 'Fusion షాయరీ' ఆవిష్కరించడానికి ప్రధాన కారణం అయ్యింది. దీనికి కూడా కొన్ని నియమాలు పెట్టుకున్న. మరీ Free flow of thoughts అని కాకుండా కొన్ని నియమాలు పెట్టుకున్న. పద్యం లాంటి కఠిన పాండిత్య నియమాలు కాకపోయినా సొబగు ఉండడం కోసం నేను నాకంటు పెట్టుకున్న నియమాలు ఇవి

1. 5 నుంచి 8 స్టాంజాల మధ్యలో ఉండాలి.

2. ప్రొజాయిక్‌గా ఉండొచ్చు. ఒక వాక్యం తరువాత ఒక వాక్యం అని కాకుండా Prose లాగ వరసగా రాసుకుంటూ పోయిన ఫరవాలేదు. ఒక కవితకు ఇదే Structure అని అనుకోవలసిన అవసరం లేదు.

**3.** ప్రతి స్టాంజా ఒక మకుటం లాంటి వాక్యంతో End అయితే బాగుంటుంది.

ఒక వస్తువును చెప్పడానికి, ఒక జీవన పార్శ్వాన్ని చెప్పడానికి, దేనినైతే ఎన్నుకుంటామో అపుడు Spontaneous గా ఏ పదాలు వస్తాయో అదేలాగ వాటిని రాసుకుంటూ పోవడం కవితాత్మను మిస్ అవకుండా చూసుకోవడం ఈ Fusion షాయరీలోని సౌలభ్యత, విశిష్టత.

అందుకని, Fusion షాయరీ అనేది ఒక కొత్త ప్రక్రియ అయినప్పటికీ, ఇప్పటి కాలానికి అని మాత్రమే కాకుండా రాబోయే కాలపు దార్శనిక ప్రక్రియ అని కూడా భావించవచ్చు.

PALAPITTA

# పాలపిట్ట

మాసపత్రిక

సంపుటి: 10 సంచిక: 4 హైదరాబాద్ మే 2019 పేజీలు: 84 వెల: రూ. 30/-

రామా చంద్రమౌళి
కస్తూరి మురళీకృష్ణ
బండ్లమూడి నాగేశ్వరరావు
అయినంపూడి శ్రీలక్ష్మి
మృత్యుంజయ
ఎం. నారాయణశర్మ
సి. పార్థసారథి
అయినంపూడి శ్యాంసుందర్‌రావు
విజయేంద్రప్రసాద్
కె.పి. అశోక్‌కుమార్
ఒగ్గు రవి
సిద్ధార్థ
ప్రవంతి - స్వాతి - సుకృతి
సికిందర్
పత్తిపాక మోహన్
చింతపట్ల సుదర్శన్
బుర్రా లక్ష్మీనారాయణ
ఘట్టమరాజు
నన్నపనేని రవి
చిత్తలూరి సత్యనారాయణ
అనామిక
ఎస్.వి. ఆర్. శాస్త్రి



## బహుముఖ సృజన శీలి

RNI No. APTEL / 2010 / 32190



# ఊరికి పోయిన యాళ్ళ...



మామిడి హరికృష్ణ

కవిత్వం

ఉస్మానియా యూనివర్సిటీలో ఎం.ఏ. సైకాలజీలో చేరిన రోజుల్లోనే తెలంగాణ భాషలో నేను కవిత్వం, కథలు రాయడం, ఇతర రచనలు చేయడం షురువయింది. అప్పటి సంది, ఏదో ఒక సందర్భంలో నేను తెలంగాణా భాషలో కవిత్వం రాస్తూనే ఉన్నా! నన్ను ఆలోచింపచేసిన, నన్ను స్పందింప చేసిన అంశాలు, సంఘటనలు, వస్తువుల మీద తెలంగాణ కవితలు ఎన్నో రాసాను. తెలంగాణ భాష, తెలంగాణ ప్రజాజీవనం ఎంత సులభంగా, సుళువుగా, సరళంగా ఉంటుందో అంతే సాదాసీదాతనం నా కవిత్వంలో ప్రతిబింబించాలనే ఉద్దేశంతో కవిత్వంలో సంక్లిష్టత (Complexity), సందిగ్ధత (Ambiguity) లేకుండా అత్యంత సరళంగా, సహజంగా రాసే శైలినే ఎన్నుకున్నాను. తెలంగాణ భాషలో, చెప్పే విధానంలో, మాట్లాడే 'తరీఖా' లో కథనశైలి (Narrative Style) ప్రధానాంశంగా ఉంటుంది. విషయాన్ని సూటిగా చెప్పడం, సందర్భాన్ని బట్టి వివిధ భావోద్వేగాలతో చెప్పడం, ఆర్తిగా, ఉగ్రంగా, దయతో చెప్పడం, ఎవరో ఒకరిని ఉద్దేశించి చెప్తున్నట్లుగా 'సంభాషణా శైలి'తో చెప్పడం తెలంగాణా రీతి... రివాజు! ఇది తెలంగాణా కథా, కథన, కవిత్వ ఆత్మ. అందుకే నేను కూడా ఆ 'ఆత్మగల్లతనాన్ని' నా కవితలలో ప్రతిష్ఠించడాన్ని సహజంగా చేసాను.

తెలంగాణ భాషలో 1995 నుండి ప్రస్తుతం వరకు నేను రాసిన కవితలలో ఎంపిక చేసిన కవితలతో ఈ 'ఊరికిపోయిన యాళ్ళ'ను ప్రచురించాను. దీని ద్వారా ప్రజల భాషకు, సామాన్య ప్రజల ఆకాంక్షలకు శనార్తులు తెలియజేయడమే నా అభిలాష. ఈ కవితల ద్వారా తెలంగాణ గ్రామీణ జీవితాన్ని, దానిలోని వైవిధ్యతను, ఉద్యమ కాలపు ఉద్వేగాలను, మట్టి-మనిషి బంధాలను మొత్తంగా తెలంగాణా అస్తిత్వాన్ని, ఆత్మను తెలంగాణ భాషలోనే తెలియజేసే ప్రయత్నం చేశాను.

"మా గోసను మేము చెప్పాలే" అనే దశ నుండి "మా గోసను మా బాసలోనే చెప్పాలె" అనే తర్వాత దశలోని స్పష్టమైన తండ్లాటకు ఈ సంకలనం ఓ సంకేతం.

– మామిడి హరికృష్ణ



An Anthology of poems in Telangana Language

# *Ooriki Poyina Yaalla...*

*Mamidi Hari Krishna*

*The book OORIKI POYINA YAALLA... (WHEN WE VISIT OUR HOME VILLAGE..), is an anthology of selected poems written in Telangana language from 1995 to 2018, portrays the fairs, festivities, lifestyle on one hand and the transformation of Telangana country life at various phases of modernization, on the other.*

*The poems depict the struggles - sacrifices, pains - pleasures, confusions-commotions, conflicts - conclusions of the people, their nostalgia and the alienation with their roots, inevitably happening due to the globalisation, technological advancement etc., from the point of view of a common man and in people's language. These are the impeccable expressions straight from the heart of a true Telanganite. Every line of these poems sincerely represents the emotions than euphemism, attachments than allegories, man-mud relations than metaphors.*

ఊరికి పోవడం అంటే
'ఊరికే' పోవడం కాదు -
ఊపిరి కోసం పోవడం
తప్పనిసరై తప్పక పోవడం కాదు -
గతి తప్పకుండా ఉండడం కోసం పోవడం.

ఊరికి రావడం అంటే
'ఊరికే' రావడం కాదు -
బస్ పాస్, పాస్‌పోర్ట్, వీసాలను రీన్యూ చేసుకున్నట్లు
నా ఐడెంటిటీని మళ్ళీ పొడిగించుకోవడం...!
పొగమారిన ఊపరితిత్తుల నిండా
తంగేడు పూల వాసనని
మురిపెంగా నింపుకోవడం...!

ISBN 978-93-5416-515-3

Swarajyam Publications
Hyderabad

ఊరికి పోయిన యాళ్ళ.....

మామిడి హరికృష్ణ

మామిడి హరికృష్ణ

కవిత్వం



# ఒంటరీకరణ

## MAMIDI HARIKRISHNA, THE POET

Mamidi Harikrishna hails from Shayampet village in Warangal district of Telangana State. He is one of the prominent poets in contemporary Telugu Literature. A government employee by profession, he is a poet, painter, writer, translator, essayist, historian, film maker and film critic by predilection. He is influenced by the world literature as well as the world cinema.

His poetry tries to portray the two ends of human agony and ecstasy in their myriad forms. His style is deeply rooted in the local dialect and lifestyles and with a blend of "native roots of naturalism" and changing times of "cosmopolitan ultra modernism". He is a master graduate in Psychology and Education and his poetry tries to unravel and explore the unexplored plains of human psyche.

He had a credit of publishing thousands of essays on various topics like art, culture, heritage, literature, cinema, behaviour etc. which are published in National and International papers and magazines.

He introduced "Fusion Shayaree", a novel style of poetry writing in Telugu literature in 2014 January, which gives scope and space to the multicultural and multilingual lives we live in contemporary society in literary format.

He had edited more than 45 books in Telugu and in English, which are unique in their nature and substance.

He published OORIKI POYINA YAALLA... (WHEN WE VISIT OUR HOME VILLAGE..), an anthology of poems written in Telangana language, in 2018.

He won the prestigious NANDI AWARDS FOR BEST FILM CRITICISM for the years 2009 & 2012, CINEGOER AWARD 2008 as BEST SCRIPT WRITER, INDYWOOD AWARD in 2018, ZEE CINE AWARD 2019 for promotion of the art of cinema & short films.

*Presently he is the Director of the Department of Language and Culture, Government of Telangana State.*



# Ontareekarana

*(A solitude)*

అక్షరం – నిత్య అసంతృప్తవాది...!

మనస్సు అనే పరమాణువులో, ఆలోచనలు అనే **Orbital**లో అలజడితో, అలికిడితో నిరంతరం సంతృప్త స్థితి కోసం **Elliptical Shape**లో పచార్లు చేస్తూనే ఉంటుంది. పరిభ్రమిస్తూనే ఉంటుంది!

పదం – **Unrest**తో తండ్లాడే తాపసి...! ఉన్నచోట నిలవకుండా అర్థానర్థమో, అర్థరహితమో ఏదో ఒక వాక్యంగా పొదగడానికి నిత్యం సంచరిస్తూనే ఉంటుంది.

వాక్యమ్ – **Insecurity**తో బాధపడే లోకసంచారి...! ఒక కాడ ఆగకుండా గదిగదినీ వెదుక్కుంటూ, లోకాలన్నీ కలియదిరుగుతూ నిత్య అభద్రతతో చేతనాత్మక జాగరూకతతో ప్రయాణం చేస్తూనే ఉంటుంది.

కవిత్వం – మాత్రం ఒంటరి...!

**Demographics**లోని ఏకాంతవాసి...!

దాని దర్శనం మనం గుంపులో ఉన్నప్పుడు, మనలో గుంపులున్నప్పుడు సాధ్యం కాదు!

అన్ని వలువలూ, శాలువాలూ, భుజకీర్తులూ, గజమాలలూ, **Crowns**, **Queries** పరిత్యాగం చేసి నగ్న హృదయంతో మనల్ని మనం ఒలకపోసుకున్నప్పుడు, సాష్టాంగపడి వెక్కిళ్ళతో ఏడ్చినప్పుడు మాత్రమే కవిత్వం ప్రత్యక్షమవుతుంది. అలా నాకు గత దశాబ్దాల కాలం నుంచి సాక్షాత్కారం అవుతూనే ఉంది.

**Overt**గానూ, **Covert**గానూ గుంపులో లేని వాన్ని కదా ... ఇంపులు, కంపులేవీ పట్టని వాన్ని కదా! అందుకే నా తెలీనితనంలోంచి నాకు కొంచెం తెలిసిందాన్ని మీతో పంచుకుందామనుకుంటున్నా... నాకు ప్రత్యక్షమైన అక్షరానుభవంలోకి మిమ్మల్ని ఆహ్వానిస్తున్నా...

నాకు అర్థమైనంతవరకూ –

కవిత్వం ఎప్పుడైనా ఒంటరే ...

కవితా సృజనే ఒంటరీకరణ ....!

– మామిడి హరికృష్ణ

ISBN 978-93-5457-352-1

9 789354 573521

Swarajyam Publications
Hyderabad

ఒంటరీకరణ

మామిడి హరికృష్ణ



# తొలి పొద్దు

## 442 కవుల కవిత్వం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
భాషా సాంస్కృతిక శాఖ

సాహితీ చరిత్రలో అధిక సంఖ్యాక కవుల కవితా సంకలనం

అఫ్సర్ మొహమ్మద్ అన్వేషి అన్వర్ అనుముల ప్రభాకరాచారి అనిశెట్టి రజిత బల్లా సరస్వతి బి. హరిరమణ ఆచార్య వెలుదండ నిత్యానందరావు బిల్ల మహేందర్ ఆచార్య డి.యం. రవిప్రసాద్ చైతన్య ప్రకాశ్ డా. చెమన్ డా. తిరుమల శ్రీనివాసాచార్య

ఆకుల సుష్మ అన్నవరం దేవేందర్ బి.కళాగోపాల్ ఆచార్య ఫణీంద్ర ఆచార్య ఎస్.వి. సత్యనారాయణ ఆచార్య బన్న అయిలయ్య ఆచార్య జి. చెన్నకేశవరెడ్డి డా. కె. జ్యోత్స్నప్రభ డా. జె. బాపురెడ్డి డా. జి. నరేందర్ రెడ్డి

అమరవాది కళ్యాణ చక్రవర్తి అంబటి నారాయణ అమ్మంగి కృష్ణారావు ఆచార్య టి. మోహన్‌సింగ్ బి. శ్రీమన్నారాయణచారి ఆచార్య రామా చంద్రమౌళి బూదిద అరుణ్‌గౌడ్ సి. హెచ్. ప్రకాశ్ డా. లింగంపల్లి రామచంద్ర

అంబటి వెంకన్న ఆచార్య అనుమాండ్ల భూమయ్య ఆచార్య రావికంటి వసునందన్ బి. సత్యనారాయణ చిలివేరి రాజారాం డా. చింతల ప్రవీణ్‌కుమార్ డా. జనువాడ రామస్వామి

ఆడెపు లక్ష్మణ్ అంబట్ల రవి ఏ. ఆంజనేయ ప్రసాద్ ఆనంద్ విరించి ఆచార్య ననుమాసస్వామి అచార్య సి. నారాయణరెడ్డి బండి ఉష బి. నరసింగరావు డా. గండ్ర లక్ష్మణరావు డా. ఎ. జయంతి

ఆశారాజు ఎ.బి.జె. సత్యంసాగర్ అయినంపూడి శ్రీలక్ష్మి బండ అరుణారెడ్డి ఆచార్య మసన చెన్నప్ప బి. పద్మజ రమణ డా. అమ్మంగి వేణుగోపాల్ డా. టీవీ భాస్కరాచార్య

ఎ. జ్యోతి బండారి రాజ్‌కుమార్ చిక్కా రామదాసు అచార్య ఎన్. గోపి బైరోజు చంద్రశేఖర్ ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య చరణ్ దాస్ బైరోజు శ్యాంసుందర్ బూర్ల వెంకటేశ్వర్లు డా. కాంచనపల్లి డా. గంటా జలంధర్ రెడ్డి డా. తిరునగరి

ఆచార్య పి. లక్ష్మీనారాయణ ఏ. సూర్య ప్రకాశ్ ఆచార్య జ్యోతిరాణి బుర్రా తిరుపతి బైరపాక స్వామి చిందం ఆశన్న డా. గుడికాడి ఆంజనేయులు డా. కాసర్ల నరేశ్‌రావు డా. దేవరాజు మహారాజు

సి.హెచ్ మధు డా. కొమర్రాజు రామలక్ష్మి బోధనం నర్సిరెడ్డి బెంకి రాఘవేందర్‌రెడ్డి బూర రాజశేఖర్ రావు డా. కాసుల లింగారెడ్డి డా.ఆర్. కమల డబ్బీకార్ సురేందర్ డా. కలువకుంట రామకృష్ణ చిక్కా శంకర్ డా. కూరెళ్ళ విఠలాచార్య డా. దామెర రాములు డా. టి. గౌరీశంకర్

డా. అయాచితం నటేశ్వరశర్మ డా. ఎండ్లూరి సుధాకర్ సి.హెచ్. ఉషారాణి డా. అగ్రహారం ఛందోబారావు డా. కూర్మాచలం శంకరస్వామి డా. చక్రవర్తుల లక్ష్మీనర్సమ్మ డా. తండు కృష్ణ కౌండిన్య డా. పి. సరళ

డా. కపిలవాయి లింగమూర్తి డా. అడువాల సుజాత డా.ఎం. పురుషోత్తమాచార్య డా. తక్కెళ్ళ బాలరాజు డా. తాడూరి వెంకట నర్సయ్య

డా. నందిని సిధారెడ్డి డా. బండారు సుజాత శేఖర్ డా. ఏనుగు నర్సింహారెడ్డి డప్పోల్ల రమేష్ సి.హెచ్. ఆంజనేయులు డా. తూర్పు మల్లారెడ్డి డా. పత్తిపాక మోహన్

డా. బాణాల శ్రీనివాసరావు డా. పిల్లలమర్రి రాములు డా.ఎస్. రఘు డా. మల్లేశ బలాస్తు

డా. నాళేశ్వరం శంకరం డా. పల్లా రత్నాకర్ డా. పోరెడ్డి రంగయ్య డా. బుక్కా బాలస్వామి డా. పసునూరి రవీందర్ డా. నలిమెల భాస్కర్ డా. యం. లక్ష్మణాచార్యులు డా. పులిపాటి గురుస్వామి

డా. భీంపల్లి శ్రీకాంత్ డా. బెల్లంకొండ సంపత్ కుమార్ డా. యస్. చెల్లప్ప డా. మడికొండ శ్యామ్ సుందర్ డా. రూప్‌కుమార్ డబ్బీకార్ డా. వడ్డేపల్లి కృష్ణ డా. రాపోలు సుదర్శన్

డా. మడికొండ ప్రవీణ్‌కుమార్ డా. సిహెచ్ ఆంజనేయులు ధాత్రిక సాయి రఘునాథ్ చరణ్ డా. బెజ్జాగాము రామమూర్తి డా. మల్ల అంజయ్య శతావధాని

డా. వాణి దేవులపల్లి డా. శంకరమంచి శ్యాంప్రసాద్ డా. సుంకిరెడ్డి నారాయణరెడ్డి డా. వి.ఆర్. శర్మ డా. వెంకన్న గారి జ్యోతి డా. వి. త్రివేణి

లెనిన్ శ్రీనివాస్ దార్ల రామచంద్ర దండ్రెరాజమౌళి

దామరకుంట శంకరయ్య డా. సమ్మన్న ఈటెల డా. విప్లవ్ దత్ శుక్లా ద్యావరి నరేందర్‌రెడ్డి డా. వెలుదండ సత్యనారాయణ

దాసరి వెంకటరమణ మణి కె. దాసోజు జ్ఞానేశ్వర్ గాజుల శ్రీధర్ డా. దిలావర్ ఎలుగేటి దేవదాస్ డా. యాకూబ్ దాసరి రంగ డి. రమాదేవి ఎలనాగ

డా. వి. శంకర్ దోరవేటి గన్ను కృష్ణమూర్తి డా. యల్లంభట్ల నాగయ్య దెంచనాల శ్రీనివాస్ శాస్త్రులు రఘుపతి డా. వెల్చాల కొండల్‌రావు

ఏనుగు సత్యనారాయణరెడ్డి ఇరువెంటి వెంకటేశ్వర శర్మ జూపూడి జగీష్ దేశపతి శ్రీనివాస్ ఎడమ రాంరెడ్డి ఎడవెల్లి అనిల్‌రెడ్డి ఏలేశ్వరం వెంకటేష్

దాసరాజు రామారావు ఏలేశ్వర నాగభూషణాచార్య ఇ. వెంకటేశ్ జనజ్వాల జీవనరాధ జి. బాలసరస్వతి గసికంటి సంజీవ గరిశకుర్తి శ్యామల

దేవులపల్లి రమేశ్ డి. నిఖిత గజ్జెల శ్రీనివాస్‌గౌడ్ ఎన్నవెళ్ళి రాజమౌళి కమలేకర్ నాగేశ్వరరావు జూకంటి జగన్నాథం కపిలవాయి వెంకటేశ్వర్లు

గడీల సుధాకర్ రెడ్డి గరిశకుర్తి రాజేంద్ర గజవెల్లి నర్సయ్య గాదె వెంకటేష్ హిమజ జూపాక సుభద్ర జలజం సత్యనారాయణ గోరటి వెంకన్న

కందుకూరి శ్రీరాములు జాజుల గౌరి కమలేకర్ రామచందర్‌జీ రావు జె. రామకృష్ణరాజు జి. అనసూయ ఐతా చంద్రయ్య జి. వెంకటేశ్వర్లు

జి.ఆర్. కుర్మే జూలూరు గౌరీశంకర్ గుముడాల చక్రవర్తి గౌడు కమలేకర్ శ్యామ్‌ప్రసాద్‌రావు కట్టా భగవంతరెడ్డి జి. నర్సింహస్వామి గురిజాల రామశేషయ్య

కనుకుంట్ల వెంకటేశ్వర్లు గోశిక్ నరహరి గాజీపూర్ నాగయ్య గుడిపల్లి నిరంజన్ గోర్ల బుచ్చన్న జి. విజయ స్వామి జ్వలిత

జి. అశ్వని కందాళై రాఘవాచారి కమలేకర్ డాగోజీరావు ఘనపురం దేవేందర్ రాగ (కసువోజుల రాజేశ్వరి) గోపగాని రవీందర్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి

కోటం చంద్రశేఖర్ కె.ఎ.ఎల్. సత్యవతి కంకణాల రాజేశ్వర్ కరిపె రాజ్‌కుమార్ హలావత్ సీత్లానాయక్ కాచాపురం పాపేశ్వరశర్మ జోగు అంజయ్య

కాసుల ప్రతాప్‌రెడ్డి కె. లక్ష్మణ్ గౌడ్ కె. పబ్రాకర్ కొండి మల్లారెడ్డి కొలిపాక శోభారాణి కారం శంకర్ కృష్ణ మణి కొల్లాపురం విమల కొండపల్లి నీహారిణి కూకట్ల తిరుపతి

కె. సిరిచందన కుమ్మరి భిక్షపతి కొమురవెల్లి అంజయ్య కాల్వ వేణుగోపాల్ కొండ రవీందర్ కె.ఎస్. అనంతాచార్య కోడూరి విజయకుమార్ కూజ సుష్మ

మాడిశెట్టి గోపాల్ మామిడి కొండల్‌రెడ్డి కూరపాటి మోహన్ మడిపల్లి భద్రయ్య మహమూద్ పాషా కాంచనపల్లి రాజేంద్రరాజు కోట్ల వెంకటేశ్వర రెడ్డి మడిపల్లి రాజ్‌కుమార్

కొండపర్తి భాస్కరాచారి మిట్టపల్లి పరశురాములు మియాపురం శ్రీనివాస్ పూడూర్ మధుకర్ వైద్యుల కొత్త శంకర్ రెడ్డి మహ్మద్ కుర్షీద్ పాష

లింగాల రాజ సమ్మయ్య మల్యాల మనోహరరావు కే. విజయ నర్సింహారావు మిర్యాల లలిత మడిపల్లి హరిహరనాథ్ మందుల పరమాత్మ మొగిలి వెంకట నర్సింహారెడ్డి

మడికొండ శ్రీనివాసరావు, యమ్ మామిడి హరికృష్ణ మునాస వెంకట్ మహ్మద్ హనీఫ్ అలీ ముక్కెర సంపత్ కుమార్ మహ్మద్ వలి హుస్సేన్ మరికంటి

మహ్మద్ ఖాజా మైనద్దీన్ మద్దికుంట లక్ష్మణ్ పల్లి నల్లనయ్య నిసార్ పిట్టల రవీందర్ మండల స్వామి డా. మోత్కూరి మాణిక్యరావు పర్కపెల్లి యాదగిరి మద్దెర్ల రమేశ్

పరమాత్మ నాగవరం బాల్‌రాం మోహన్ రుషి మొగిలి స్వామిరాజ్ నారాయణస్వామి మోతుకూరి అశోక్‌కుమార్ ఎన్. నరసింహశర్మ

నందిగామ నిర్మలకుమారి మెర్సీ మార్గరెట్ బోడ మహమ్మద్ జూబర్ ఆలీ ఖాన్ ఒరుగంటి పురుషోత్తం పడాల రామారావు పులి జమున పొద్దుటూరి మాధవీలత

నాగరాజు రామస్వామి నన్నపురాజు విజయశ్రీ త్రివిక్రమ శర్మ నక్కా హరికృష్ణ పలస వెంకటేశ్వర్లు యం. శ్రీరాములు నాంపల్లి సుజాత నెల్లుట్ల రమాదేవి రాజీవ పోతన జ్యోతి

మౌనశ్రీ మలిక్ పట్టాల అశోక్ నాగారం వనిత నామని సుజనాదేవి ఎం. జలజారాణి మొగిలి శ్రీనివాసు నిఖిలేశ్వర్ ఓదెల వెంకటేశ్వర్లు ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్ సుజాత ముదిరాజ్

రమాదేవిదేశ్‌ముఖ్ ఎన్. హరిప్రియా గిరిధర్‌రావు నరాల సుధాకర్ ఎన్వీ రఘువీర్ ప్రతాప్ రవీణ చవాన్ పొన్నం రాజయ్య (గౌడ్) పెందోట వెంకటేశ్వర్లు శిక గణేష్ శ్రీరాములు సతీష్ అట్ల

నేరోజు రమేష్ పంజాల ఐలయ్య పొన్నాల బాలయ్య ఆర్. చెన్నయ్య రమావత్ దస్రునాయక్ పొన్నం రవిచంద్ర పున్న అంజయ్య రేడియమ్ సహచరి (కె. ప్రభాకర్) సస్యశ్రీ

పిన్నంశెట్టికిషన్ ఆర్. విద్యాసాగర్‌రావు పెరుమాళ్ళ ఆనంద్ 'సమతశ్రీ' వల్లాల పరంధామ్ యాదవ్ రామానుజం సుజాత ఎస్. వేణుశ్రీ శ్రీరామోజు హరగోపాల్ రామడుగు నరసింహాచార్యులు

పి. పద్మ పెద్దూరి వెంకటదాసు పి. జగన్మోహనరావు శ్రీనివాసుగద్దపాటి యస్.పి. అన్నపూర్ణ రాజారాం ప్రకాశ్ సబ్బని లక్ష్మీనారాయణ రాంచందర్ భీంవంశీ సామ లక్ష్మారెడ్డి టింగిరికార్ వెంకటేష్

సీతారాం సిద్దెంకి యాదగిరి శ్రీపెరంబుదూరు నారాయణ రావు రేళ్ళ శ్రీనివాస్ రుద్రారం శ్రీనివాస్‌రెడ్డి శారదా హన్మాండ్లు రామాచారి బంగారు సుతారపు వెంకట నారాయణ

సిద్ధార్థ సిద్దినబోయిన వెంకట్ యాదవ్ శేషం సుప్రసన్నాచార్యులు త్రివిక్రమ శర్మ సిద్దగాని సుదర్శన్ తిరుమల శ్రీనివాస్ ఆర్య సృజామి (వి. సత్యన్నారాయణ) టి. నరేష్

సంపటం దుర్గాప్రసాదరావు తాళ్ళూరి రాధ సిరిసిల్లా గఫూర్ శిక్షక్ తైదల అంజయ్య సుప్పని సత్యన్నారాయణ సూక్తిసాగర్ (సందాపురం బిచ్చయ్య) తాయమ్మ కరుణ (మిర్యాల పద్మ)

తిరునగరి సంధ్య తెలిదేవర భానుమూర్తి సంతపురి నారాయణరావు తెలంగాణ రమేష్‌బాబు సుంకర రమేష్ సుదర్శన రెడ్డి కట్టా సంకెపల్లి నాగేంద్రశర్మ తుడిమిళ్ళ భీష్మాచారి విజయ రాజం

టి. లక్ష్మీ నారాయణ తోటపల్లి భూమన్న తోడిశెట్టి పరమేశ్వర్ తిరునగరి దేవకీ దేవి విద్వాన్ బైరపనేని పోతురాజు చౌదరి వనపట్ల సుబ్బయ్య వల్లందాసు వెంకటేశ్ వారాల ఆనంద్ వి.పి. చందన్‌రావు

సూరారం శంకర్ వద్దిరాజు నాగేందర్ రావు వలస. వెంకటేశ్వర్లు వెంకట్రామ నర్సయ్య కాజీపేట ఊడుగుల వేణు ఉండ్రాల రాజేశం వఝల శివకుమార్ విలాసాగరం రవీందర్ వల్స-పైడి వరుకోలు లక్ష్మయ్య

సొన్నాయిల కృష్ణవేణి తంగెళ్ళపల్లి కనకాచారి వడ్డెబోయిన శ్రీనివాస్ వల్లభాపురం జనార్దన యనగందుల దేవయ్య విరజాజి రామిరెడ్డి వంగర నరసింహారెడ్డి వైద్యం భాస్కర్ యడవెల్లి సైదులు

స్కైబాబ ఉదారి నారాయణ వరంగల్ శ్రీనివాస్ వి.ఆర్. విద్యార్థి వి. రాఘవరావు (రఘుశ్రీ) వై. రుక్మాంగదరెడ్డి వీరేంద్ర కాపర్తి వి. భాస్కర్ వి.తేజశ్రీ(మహతి) వేముల సత్యనారాయణ

షాజహానా వెంగలి నాగయ్య వేముల ప్రభాకర్ వేంకట రాణాప్రతాప్ వేముగంటి మురళీకృష్ణ పులిమళ్ల సునంద జింబో (రాజేందర్) వై. శివకుమార్ వేణు సంకోజు యడవల్లి శైలజ యేరువ రత్నారెడ్డి


**తెలంగాణ ప్రభుత్వం**

భాషా సాంస్కృతిక శాఖ ప్రచురణ

రవీంద్ర భారతి, కళాభవన్, హైదరాబాద్.

Q

- ***మీ కవిత్వంలో భాషను చూసినపుడు "ఒంటరీకరణ" వరకు ఒక మిశ్రమ భాష కనిపించింది. "ఊరికి పోయిన యాళ్ళ"లో పూర్తిగా పల్లెటూరి గ్రామీణ భాష కనబడింది. మొదట వ్యవహారిక భాషలో రాసి తర్వాత పూర్తిగా తెలంగాణ భాష వాడడానికి కారణం ఏమిటి?***

**–** అవన్నీ ఏకకాలంలో జరిగినయి. ఎలా అంటే కవితా వస్తువు, భాషను ఎన్నుకుంటుంది. మనం ఎన్నుకోము. తెలంగాణ జీవిత నేపథ్యానికి సంబంధించి చెప్పేటప్పుడు తెలంగాణ గోసని, ఆర్తిని, ఆకాంక్షని చెప్పేటపుడు తెలంగాణ భాషను మించిన బలమైన వాహిక లేదు. Which ever what ever the subject, that have chosen that style and language! నేను "మావోన్ని మాయం సేసినంక'' అనే కవిత రాసిన. అది పూర్తిగా తెలంగాణ భాషలో వ్యవహారికంలో ఉంది.'శంబూక' అనే కవి చనిపోయినపుడు ఆయన స్మృతిగీతంలాగ రాసిన! అది రాసిన సమయంలోనే నేనొక ప్రేమ కవితను కూడా రాశాను. అలాగే 'ఒంటరికరణ' రాసిన! ఇది world poetry లాగ పూర్తిగా డిఫరెంట్ స్టైల్‌లో ఉంటుంది.

అదే 'మావోణ్ణి మాయం సేసినంక' అయితే తెలంగాణ భాషలో తండ్రి వేదనలాగ ఉంటది. ఇంకొకటి రాసినపుడు అది వేరేలాగ ఉంటది. ఏక కాలంలో ఇవన్నీ జరిగాయి. అందుకని వస్తువును బట్టి భాషగాని, వ్యక్తీకరణలు గాని వచ్చాయని భావిస్తాను. ఆమాటకొస్తే, ఏ కవి కూడా కావాలని చేయడు. వస్తువే భాషను ఎంపిక చేసుకుంటది.

# ఊరికి పోయిన యాళ్ల



మామిడి హరికృష్ణ

కవిత్వం

Q

- ***1986 నుంచి కవిత్వం రాస్తు కూడా ఈ మధ్యన 2018, 2019లలో కవిత్వాన్ని పుస్తకంగా తెచ్చారు. ఇంత వ్యవధి తీసుకోవడానికి కారణం ఏమిటి?***

– నాకు ఆనవాలు లేని జీవితం గడపాలని ఒక కోరిక తమ్ముడూ! మనం రాశాము వెళ్ళిపోయాము. అంతే నేను రైతును. తోటమాలిని కాదల్చుకోలేదు. తోటమాలికి, రైతుకు చాలా తేడా ఉంది. తోటమాలి అయితే తన తోట చుట్టు కంచె పెట్టి ఇది నా తోట, ఇది నా గులాబి తోట అని బోర్డు పెట్టుకుంటడు. ఎవరు వచ్చినా చూపించుకుంటడు. ఎంత కాసింది, ఎంత దిగుబడి వచ్చింది అని చెప్పుకుంటూ ఉంటడు. కానీ రైతు మాత్రం విత్తనాలు వేసుకుంటూ వెళ్తూ ఉంటాడు. బండ మీద పడితే విత్తనం మొలువదు. సారవంతమైన నేల మీద పడితే అది మొలుస్తుంది. అదొక ప్రాకృతిక ధర్మం ప్రకారం జరిగిపోతుంది. నేను 2018లో పుస్తకాలు వేసేంత వరకు కూడా నాకున్న అభిప్రాయం ఇదే. ఏదీ నాది అనేది మిగల కూడదు. నేను వెళ్ళి పోయిన తర్వాత ఈ ప్రపంచంలోకి హరికృష్ణ అనే వాడు వచ్చాడు, వెళ్ళిపోయాడు అంతే! ఒక సంచారి, ఒక బాట సారి, ఒక ప్రయాణికుడు ఏం చేస్తడు? వస్తడు, వెళ్ళిపోతడు అంతే, ఏం మిగల్చడు. ఇక్కడ మిగిల్చడానికి కూడా ఏం ఉండదు. ఒక వేళ మిగిలినట్టు ఎవరైన ఫీల్ అయితే అది వాళ్ళ గొప్పతనం. ఇదొక యాత్ర. ఈ యాత్రలో ఆనవాళ్ళు లేని జీవితం గడపాలనే ఆకాంక్షతోనే పుస్తకాలుగా నా కవిత్వాన్ని ఇంతకాలం సంకలనం చేయలేదు.

నిజానికి నేను ఎప్పటి నుంచో రాశాను. నేను తొమ్మిదో తరగతిలో ఉన్నపుడే "కెరటం" అనే మా స్కూల్ మాగ్జిన్‌లో మొదటి సారి నా పేరును అచ్చులో చూసుకున్న. మరి ఇంతగా ఎందుకు రాశాను? అంటే నా కాన్వాసు

పెద్దది. నాకు ఫ్రెండ్స్ లేరు! ఫ్రెండ్స్ ఉంటే అప్పటికపుడు నాలో కలిగిన ఎమోషన్స్‌ని వారితో పంచుకునేవాడిని. ఈ రోజు గోపాల్ కలిశాడు. నా మనసులో కలిగిన భావాలను వెంటనే చెప్పేస్త. చెప్పడంతోని ఏమిటంటే మనలోని భావాలు, ఆలోచనల Intensity, Depth ప్రభావం తగ్గిపోతుంది. సైకలాజికల్‌గా It is a proved fact!

మనం రాసే వాటి కంటే రాయని కవితలే చాలా ఉంటాయి. నా భావాలు గాని, ఆలోచనలు గాని, విజ్ఞాన విషయాలు గాని ప్రపంచానికి వెల్లడి చేయాలని వ్యాసాలు చాలా రాశాను. అవన్ని కూడా ఎక్కువ మందికి తెలియాలంటే నాకున్న సాధనం పత్రిక! పత్రికలో ప్రచురించడం కోసం పంపించాను కాని పుస్తకంగా వేయలేదు. అలాగే నాకు మా నాన్నకు వారధి పత్రిక. నేను నా జీవన పోరాటంలో ఉద్యోగరీత్యా వేరు వేరు ప్రాంతాలకు రావడం సహజంగా జరిగింది. ఇప్పటికి నాన్న పేపర్లు బాగా చదువుతాడు. ఇంటికి నాలుగైదు పేపర్లు వస్తే వాటిని కూలంకషంగా చదువుతడు. ఆ పేపర్లు చదువుతున్నపుడు నా గురించిన వ్యాసమో, నేను రాసిన వ్యాసమో, కవితనో వస్తే అది మా మధ్య ఒక ఎమోషనల్ బాండింగ్ లాగా ఉంటుంది. ఏదైనా కవిత పేపర్లో వస్తే ఫస్ట్ ఫోన్ నాన్నదే అయితది. నాన్నకు చేరుతుంది కదా అనుకోవడం వలన పత్రికలలో రాశాను. నాకు ఆనవాళ్ళు ఎందుకు? అని అనుకోవడం వల్ల నా రచనలను పుస్తకంగా సంకలనం చేసి తీసుకురాలేదు.

2018లో మాత్రం మా అమ్మ సంవత్సరీకం నాడు ఏదో ఒకటి గుర్తుండి పోయేది చేయాలని అనుకున్న. సెప్టెంబర్ 25 అమ్మ వర్ధంతి. అమ్మ 1998లో చనిపోయింది. 2018 కి ఇరవై యేళ్ళు. ఈ 20 ఏండ్ల సందర్భంగా కొన్ని కవితలతోనైనా ప్రతి సంవత్సరం పుస్తకం వేయాలని అనుకున్నా. మా అమ్మ వెళుతూ వెళుతూ నాకొక అక్షరాన్ని తోడుగా ఇచ్చింది ఈ అక్షరాన్నే అమ్మకు నీరాజనంగా ఇద్దామని అనుకున్న. అలా 2018లో మొదట 'ఊరికి పోయిన యాళ్ళ' ను వేశాను. 2019లో ఒంటరీకరణ వేశాను. 2020లో 'సుషుప్తి నుంచి' అదీ నా Hand Writing తో రాసిన కవిత్వం వేశాను. ఈ సంవత్సరం నేను 'నమస్తే తెలంగాణ'లో అనువాదం చేసిన కొన్ని ప్రపంచకవితలను పుస్తకంగా తేవాలని అనుకుంటున్న.

Q

- **మీ "ఊరికి పోయిన యాళ్ళు" కవిత్వం చదివినపుడుతెలంగాణ ఉద్యమంలో బలమైన కవిత్వం రాసినట్టు కనబడింది. అట్లనే "గుట్టను పగలేసినం" కవిత పైకి గుట్టను తొలుస్తున్నట్లుగా ఉంటుంది కాని ఆంధ్ర పెత్తందారీ వ్యవస్థ గురించి అద్భుతమైన శిల్పంతో కవిత్వీకరించారు. మీ కవిత్వమంతా శిల్పం మీద నిలబడుతుందని నారాయణశర్మ లాంటి విమర్శకులు కూడా అన్నారు. కవిత్వంలో ఈ శిల్ప శ్రద్ధ మీకు అనుకోకుండా వచ్చిందా? ఒక స్పృహతోనే రాశారా?**

– 'గుట్టను పగలేసినం' కవిత పూర్తిగా Metaphorical symbolic ఎక్స్ ప్రెషన్స్‌తో ఉంటుంది. గుట్ట అనేది సింబాలిజం. ఎక్కడ కూడా ఎవరిని ఉద్దేశించినట్టు గాని, ఒక సామాజిక వర్గాన్ని, ఒక సమూహాన్ని ఉద్దేశించినట్టుగా కాకుండా ప్రజలందరు కలిసి గుట్టను ఎట్లా తొలిచారు అనే ఆలోచన కనిపిస్తుంటుంది. ఇదంతా World Poetry లో కనిపించే స్టైల్. ప్రత్యేకంగా లాటిన్ అమెరికన్ పోయెట్రిలో ఇట్లాంటివి కనబడుతాయి ఆ శిల్పం అక్కడి నుంచి తీసుకున్నాను. ఉద్యమం సమయంలో, కవిత్వం ఎక్కువగా డైరెక్ట్‌గా, నినాదాలుగా ఉండడం, సంభోదిస్తూ కవితలు రాయడం జరిగింది. శత్రువెవరో స్పష్టంగా తెలుసు. శత్రువును ఉద్దేశించి, శత్రువుని చూపిస్తూ, జరుగుతున్న దోపిడీని స్పష్టంగా ఎలాంటి దాపరికాలు లేకుండా చెప్పడం కనిపించింది.

నేనేమి చేశానంటే, దీనిని పొయేటిక్‌గా చెబితే బాగుంటుందని, తెలంగాణ భాషలో చెబితే బాగుంటుందని, ఒక మనిషి ఆవేదనలోంచి తెలంగాణను కలుపుతూ ఒక World Poetry స్టైల్లో చెప్పాలని 'గుట్టను పగలేసినం' రాసాను. అందుకే ఈ శిల్పం చాలా మందికి నచ్చింది. దీనిని ఇట్లా కూడా చెప్పొచ్చా అని అనుకున్నరు. ఉద్యమ సమయంలో చాలా కొత్తగా అనిపించింది. ఇలా నేను తెలంగాణా కవితలు రాయడంపై ప్రభావం ఎక్కడి నుంచి వచ్చిందంటే ఆఫ్రికన్ పోరాటం నుంచి, లాటిన్ అమెరికన్ ఉద్యమాల్లోంచి, భారత దేశం స్వాతంత్ర్య సంగ్రామం నుంచి తెలంగాణ ఉద్యమంలోంచి ఆ ధార వచ్చింది. అలా ఆ ధార ఒకటి కాదు. ఎన్నో ధారలు కలిపితే 'గుట్టను పగలేసినం' అనే కవితా శిల్పం ఏర్పడింది.

Q

- **తెలంగాణ వచ్చినంక చాలా మంది కవులకు వస్తువు లేదని విమర్శలొచ్చినాయి. దీని పట్ల మీ అభిప్రాయం?**

– వస్తువు ఎప్పటికప్పుడు నిత్యనూతనం. కవిత్వానికి సంబంధించి ఎన్నో అంశాలున్నయి. జెఫ్రీ ఛాసర్ Father of English literature! ఆయన 'కాంటర్బరీ టేల్స్' ను 14th సెంచరీలో రాసినప్పటి నుంచి మొదలుకొని, షేక్ స్పియర్ రాస్తున్నప్పటి నుంచి జాన్ కీట్స్, షెల్లీ వీళ్ళంత రాసినప్పటి నుంచి ఇప్పటి వరకు ఇంకా కవిత్వం వస్తుందంటే దానర్థం ఏమిటి? ఇంకా మనం రాయనిదేదో ఉన్నది అనే కదా! ఇంకా చెప్పాల్సింది ఏదో ఉంది. ఇంకా వస్తువులు ఏవో ఉన్నట్టే కదా! ఒక వేళ లేకపోయి ఉంటే ఇన్ని వందల సంవత్సరాల పరిణామ క్రమంలో ప్రపంచంలోని ఇన్నివేల భాషల్లో కోట్లాది కవితలు వచ్చి ఉండేవి కావు కదా? తెలుగు విషయానికి వస్తే పంపన రాసినప్పటి నుంచి ఇప్పటి వరకు చూస్తే గనుక, కొన్ని కోట్ల పదాల సాహిత్య సృష్టి జరిగింది. కొన్ని లక్షల వస్తువులతోని కవిత్వం సృష్టించబడింది. అయినా కవిత్వం ఇంకా ఎందుకు పుడుతుంది?

ఇప్పటికీ ఎందుకు కవితలు రాస్తున్నరు? అంటే ఇది ఒక రోజులో అయిపోయేది కాదు. మానవ భావోద్వేగాలతో ముడిపడి ఉన్నది గనుక. Emotions ఏ కాలానికి ఆ కాలానికై కొత్తగా ఉంటాయి కనుక. ఇది అనంతం

కనుక! భావోద్వేగాలను నవరసాలు అని మనం వర్గీకరించి చెబుతున్నాము గానీ ఏ అభివ్యక్తికి ఆ అభివ్యక్తి, ఏ రసానికారసం, ఏ కాలానికి ఆ కాలం గొప్పదే. ఇంకా చెప్పాలంటే Every day is a good and Fresh Morning. నిన్నటిలాగ ఈ రోజు ఉండదు. ఈ రోజు లాగ రేపు ఖచ్చితంగా ఉండదు. అలాంటపుడు నిన్నటి అనుభూతి ఈ నాటి అనుభూతికి సమానం కాదు. ఇవాల్టి వేదన రేపటి దు:ఖానికి అంత కన్నా సమానం కాదు. అలాంటపుడు ఈ రోజు దు:ఖాన్ని, ఈ నాటి ఆనందాన్ని, ఈ నాటి సంబురాన్ని, ఈ నాటి ఆక్రోశాన్ని, సంవేదనను ఖచ్చితంగా ఈ రోజు చెబుతాం. అందుకని నేను ఏమనుకుంటానంటే కవిత్వానికి వస్తువు పరంగా ఎప్పుడూ కొరత లేదు. ఎక్కడా కొరత రాలేదు.

తెలంగాణ ఉద్యమానికి ముందు జరిగిన నేపథ్యం చెబుత! మోడ్రన్ పొయెట్రీ వచ్చిన తర్వాత ముఖ్యంగా 19వ శతాబ్దం వచ్చిన తరువాత మొదట్లో కవిత్వాన్నంతా నడిపించింది అభ్యుదయవాదం అంతకంటె ముందు భావ కవిత్వం పేరుతో చాలా మంది కవులు రాశారు. దేశభక్తి, ప్రేమ భావన, ప్రకృతి ఆరాధన ఇలాంటి అంశాలతో వచ్చిన భావ కవిత్వ దశ ఒకటి. ఆ తర్వాత దశలో కవిత్వం వర్ణనల కోసం కాదు ప్రజల కష్టాలను వ్యక్తీకరించడం కోసం అని అనుకున్నపుడు ఆ ధోరణిలో వస్తున్న వాళ్ళందరు కూడా "అభ్యుదయవాదం"తో కవిత్వ ప్రయోజనాన్ని చెప్పే విధంగా రచనలు చేశారు.

వస్తువు అలా మారుతూ వచ్చింది. ఆ తర్వాత కవిత్వం అంతిమ లక్ష్యం అణగారిన ప్రజల ఆర్తగీతాన్ని, వారి వాదాన్ని వినిపించాలి, ప్రజల పక్షాన కవిత్వం నిలవాలి అని అనుకున్నపుడు "విప్లవ వాద కవిత్వం" వచ్చింది. ఆ తరువాత మళ్ళీ 1965 ప్రాంతంలో "దిగంబర కవిత్వం" వచ్చింది. అదే సమయంలో "చేతనావర్త కవులు" కూడా వచ్చారు. ఒక్కొక్కరు ఎవరి ఐడియాలజిని అనుసరించి దాని నిర్మాణాలను చేస్తూ వచ్చారు. తరువాత అదే అస్తిత్వవాద ఉద్యమాలకు దోహదపడింది. "దళిత వాద", "స్త్రీవాద", "మైనార్టీ వాద" ఉద్యమాలు తమ గొంతుకలను బలంగా వ్యక్తీకరించాయి.

ఈ క్రమంలో "ప్రాంతీయ అస్తిత్వవాదం"కు సంబంధించిన అంశాలు కూడా వచ్చినయి. ప్రాంతీయ అస్తిత్వంలోనే తెలంగాణ తత్వం, తెలంగాణ ఆకాంక్ష, ప్రజల గోస, అణిచివేతకు గురౌతున్న తీరు వీటన్నింటిని వస్తువులుగా

చేసుకొని ఎన్ని కోణాలలో ఎన్ని రకాలుగా చెప్పవచ్చో వందలాది కవులు అద్భుతంగా తెలంగాణ అస్తిత్వ స్పృహతో కవిత్వం రాస్తూవచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వరకు కూడా ఏ కోణంలోంచి చూసినా ఈ తరహా కవిత్వం అంతిమ లక్ష్యం తెలంగాణనే! నేను రాసిన కవిత్వంలో కూడా 'సలిమంట' కవితను తీసుకుంటే 'సలిమంట' అనే నేపథ్యంలో కవిత నడుస్తున్నప్పటికీ అంతిమ లక్ష్యం తెలంగాణ ఏర్పాటు అయితే బాగుండు అనే కాంక్షను వ్యక్తం చేయడమే ఉంటుంది. "నదీనాం సాగరోగతి:" అన్నట్టు ఆర్థిక, సామాజిక, సాంస్కృతికంగా ఏ కోణంలోంచి వ్యక్తం చేసినా ఆ కవిత యొక్క అంతిమ లక్ష్యం ప్రాంతీయ అస్తిత్వాన్ని స్పర్శించే తెలంగాణ సోయితోనే కవిత్వం వచ్చింది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఒక స్తబ్దత, ఒక ఖాళీ ఏర్పడింది అని అందరూ సాధారణంగా అంటుంటారు. గతంలో కూడా ఇది ప్రతి సందర్భంలో జరిగింది.

ఒక విశాల దృక్పథంతో ఆలోచిస్తే నన్నయ, తిక్కన, ఎర్రనలు రాస్తున్న క్రమంలో ఇక్కడ పాల్కురికి సోమనాథుడు జాను తెలుగు, అచ్చ తెలుగు పేరుతో "వృషాధిప శతకం", "బసవోదాహరణం" రాస్తున్నపుడు ఆ మధ్య కూడా గ్యాప్ వచ్చింది. ఆ శూన్యత ఏర్పడినపుడు కొత్తగా అచ్చ తెలుగులో ప్రజల భాషకు పట్టం గడుతూ ద్విపదల్లో రాశాడు. ఒక కొత్త ప్రక్రియ ఎస్టాబ్లిష్ అవ్వడానికి ముందు సంధి దశ. ఆ తర్వాత ఇలా ప్రతి దశకు చెప్పుకుంటూ వెళ్ళొచ్చు. అందుకని, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత కూడా ఒక సంధి దశలాంటిది ఉంది. కవులందరికి ఎలాంటి వస్తువు మీద రాయాలన్నది ఒక సందిగ్ధత ఏర్పడింది. ఇది సహజమే!

ఇలాంటిది ఇంకొకటి కూడా చెబుతా. 1980ల్లో ఒక సందిగ్ధదశ. ఎందుకంటే శ్రీశ్రీ అనంతర కవిత్వం ఎట్లా ఉండాలి? ఎట్లా రాయాలి అని చాలా మందికి సందేహం కలిగింది. తిలక్, శేషేంద్ర శర్మ రాసినట్లు అనుభూతివాద ధోరణితో రాయాలా? లేక విప్లవ భావ జాలంతో రాయాలా? లేదా ఇంకేదైనా సంస్కరణ వాదంతో రాయాలా? అనే సందేహాలు ఏర్పడ్డాయి. ఆ దశలో 'జీవ కవిత్వం జిందాబాద్' అన్న పేరుతో కొత్త కవిత్వం వచ్చింది. అనుభూతి, విప్లవం అన్ని కలగలిసిన ఒక కొత్త కవిత్వం, కొత్తతరం వచ్చింది. అలాగే వేగుంట

మోహన ప్రసాద్ లాంటి కవులు రాసిన స్ర్రియలిస్టిక్ కవిత్వం కూడా తెలుగులోకి వచ్చింది.

ఈ ప్రస్థానాన్ని, పరిణామాన్ని అంతా గమనిస్తే అర్థం అయ్యేదేమిటంటే, ఎప్పటికప్పుడు, కవిత్వమే తన వస్తువును ఎన్నుకుంటది! కవుల చేత రాయించుకుంటది! ఎప్పటికపుడు కొత్తగా ఆవిష్కృతం అయితది!

మనకు తెలిసిందే మనం చూస్తున్న ప్రపంచమే ఏ రోజు కా రోజు కొత్తగా ఉంటది. దానిని కొత్తగా చూసే కోణం కవికి మాత్రమే ఉంటుంది. కవి అంతర్నేత్రానికి ఆ సామర్థ్యం ఉంటుంది. ఆ అంతర్నేత్రం ఎప్పటికపుడు కొత్త కొత్తగా ఆలోచిస్తుంది కనుక కొత్త వస్తువులు పుడుతూ ఉంటాయి. కొన్ని  సార్లు విషయ నేపథ్యాలు ఒకటైనా, వస్తువు వేరుగా ఉంటుంది. వస్తువు వేరు కావడం వలన వ్యక్తీకరణ విధానం వేరుగా ఉంటుంది. శిల్పం వేరు కావడం వలన అభివ్యక్తిలో వైవిధ్యత కనిపిస్తూ వస్తుంది. కాబట్టి 'తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత కవిత్వంలో శూన్యత ఏర్పడింది.' అనే దాని కంటే కొత్త కవితా వస్తువులను ఆవిష్కరణ చేసే అవకాశం వచ్చిందని నేను భావిస్తాను.

దీనికి రాష్ట్ర అవతరణ ఉత్సవాల సందర్భాలను ఉదాహరణలుగా చెపుతాను. మన భాషా - సాంస్కృతిక శాఖ ద్వారానే ప్రతి సంవత్సరం కవిసమ్మేళనాలు నిర్వహిస్తాం. ఉగాది, రాష్ట్ర అవతరణ, బతుకమ్మ పండుగ సమయాలు, ప్రపంచ కవితా దినోత్సవ సందర్భంగా రాష్ట్రస్థాయి కవిసమ్మేళనాలు రవీంద్ర భారతిలోనే గత ఏడేళ్ళ నుండి నిర్వహిస్తూ వస్తున్నాము. (కరోనా కాలాలు మినహా) ఈ సమ్మేళనాలలో ఒక సారి "ఊరు" అనే థీమ్ పెట్టుకున్నం. లబ్ద ప్రతిష్ఠులైన కవులు తమ ఊరుని గుర్తు చేసుకుంటూ అద్భుతమైన కవితలు రాశారు. దానిని 'తల్లివేరు' పేరుతో సంకలనం వేశాము. అలాగే 'నీరు-చెరువులు' అనే వస్తువును తీసుకొని 'అలుగు దుంకిన అక్షరం' వేశాము. 'రైతులు - వ్యవసాయం' వస్తువుగా తీసుకొని కవిత్వం చెబితే ఎలా ఉంటుందని అనుకున్నపుడు చాలా మంది కవులు కవిత్వం రాశారు. దానిని 'స్వేదభూమి' పేరుతో కవితా సంకలనంగా వేశాం.

ఇలా ప్రతి సందర్భంలో కూడా కవితా వస్తువుకి ఎప్పుడూ కరువులేదు. కవి నిరంతర అన్వేషి. ఒక దానితో సంతృప్తి పడేవాడు గాదు. కవి నిత్యం అసంతృప్తితో కూడిన జీవి. నిత్యం తండ్లాడుతూ ఉండే మనిషి.

కొన్ని కవితలను, కావ్యాలను గమనిస్తే మనం 'ఇది వస్తువా? అనుకుంటాం. కానీ దానిని కూడా వస్తువు చేసి కవిత్వం రాసిన సందర్భాలు ప్రపంచ సాహిత్యంలో ఉన్నవి. భారతీయ సాహిత్యంలో ఉన్నవి. తెలంగాణ సాహిత్యంలో కూడా ఉన్నవి. కాబట్టి ఏదీ అవస్తువు కాదు. అవస్తువును కూడా వస్తువుగా మార్చగలిగే 'పరుసవేది విద్య' కవికి తెలుసు. మట్టిలోంచి ఏదైనా సృష్టించగలుగుతాడు. మనిషిని ముట్టుకుంటే కవిత్వాన్ని సృష్టించగలుగుతాడు. గాలిలోంచి కూడా కవితను సృష్టించగలుగుతాడు. అలాంటపుడు కవితా వస్తువులకు కొరత ఉంది అని చెప్పేంత లేదు అని నేను భావిస్త.

Q

- ***ప్రపంచ సాహిత్యాన్ని మీరు చదువుతున్నపుడు, అనువాదం చేసేటపుడు తెలంగాణ కవిత్వం ఏ స్థాయిలో ఉందనిపించింది? తెలంగాణ కవిత్వం ఎక్కువగా అనువాదానికి నోచుకుంట లేదు. దీనికి కారణం తెలంగాణ భాషే కారణమంటారా?***

– చాలా మంది ప్రపంచ సాహిత్యం అంటే ఏమనుకుంటారంటే అదేదో బ్రహ్మ పదార్థం అనుకుంటారు. నా అధ్యయనం మేరకు నాకు అర్థమైంది ఏందంటే “ఏదైతే స్థానికమైన కవిత్వం ఉంటదో అదే ప్రపంచ సాహిత్యం!’’

మహమ్మద్ దర్విష్ సాహిత్యం తీసుకోండి ఏ ప్రపంచ కవినైనా తీసుకోండి వాళ్ళు వాళ్ళ దేశం గురించి రాసింద్రు. వాళ్ళ పల్లెను గురించి, వాళ్ళ వేదనను గురించి రాసింద్రు. Ernest Herming Way అనే రచయిత Whom the bell tols for అనేది రాసిండు. దాంట్లో 1936-39 మధ్య జరిగిన స్పానిష్ సివిల్ వార్ గురించి ఉంటది. మాక్సింగోర్కి రాసిన ‘అమ్మ’ నవలలో రష్యన్ రెవల్యూషన్ ప్రస్థానమంతా కనిపిస్తుంది.

ప్రపంచ సాహిత్యంలో గొప్ప ఎపిక్స్‌గా గ్రీకుకు సంబంధించిన ఇలియడ్, ఒడిస్సి గ్రంథాలను చెపుతారు. హోమర్ రాసాడు వాటిని. చైనాలో అత్యంత అద్భుతమైన సాహిత్యాన్ని కన్ఫ్యూషియస్ రాశారు. జలాలుద్దిన్ రూమీ, హాఫెజ్ అరబిక్ పోయెట్రీ రాశారు. మీర్జా గాలిబ్ గజల్స్, ఉమర్ ఖయ్యాం రుబాయిలు.. ఇలా ఎవరు రాసినా ఇప్పుడు గొప్ప సాహిత్యం అని చెప్పుకుంటున్నాం.

ప్రపంచ సాహిత్యం గొప్పది అని అనుకుంటే వాళ్ళేమీ ప్రపంచ సాహిత్యం అనే ప్రత్యేక 'జెనర్'లో రాయలేదు. వాళ్ళ స్థానికమైన, ఒరిజినల్, నేటివ్ అంశాలలోంచే కవితలు రాశారు. అదే ప్రపంచ సాహిత్యంగా ఎదిగిపోయింది. మానవ భావోద్వేగాలు, సంవేదనలు అందరికి సమానం కనుగ అలా జరిగింది. ఏ సాహిత్యమైతే మానవుడిలో అంతర్ గర్భితంగా, లోలోపలి అంతర్ పొరలలో ఉండే ఆ ఎలిమెంట్‌ను టచ్ చేయగలిగిందో అది ప్రపంచ సాహిత్యపు స్థాయిని పొందింది.

ఏ భాషలో ఏ కవిత్వమొచ్చినా అది ప్రపంచ సాహిత్యం స్థాయిలో ఉంటుంది. తెలుగు సాహిత్యం అంతే! తెలంగాణ సాహిత్యం అంతే! ఎక్కడైతే సంఘర్షణ ఉంటుందో, ఎక్కడైతే వేదన ఉంటుందో, ఎక్కడైతే అణిచివేత నుంచి ధిక్కార స్వరం వినిపిస్తుందో అది ఖచ్చితంగా ప్రపంచ స్థాయి కవిత్వానికి సమానమైన ఉద్వేగాలను క్రియేట్ చేయగలుగుతుంది. ఈ లెక్కన చూస్తే అది పాలస్తీనా గానీ, తెలంగాణ గానీ వీటన్నింటిలో ఆ సంఘర్షణ ఉంది! ఆ వేదన ఉంది.!

ఏ ఆఫ్రికన్ కవిగాని, ఏ లాటిన్ అమెరికన్ కవిగాని, ఏ స్పానిష్ కవిగాని, మెక్సికన్ కవిగాని ఎంతైతే గాఢంగా చెబుతారో, ఆ గాఢతకు ఏ మాత్రం తీసిపోని కవిత్వం తెలంగాణ నుంచి వచ్చింది. అది మనకు తెలియకపోవచ్చు లేదా తెలిసేలా చెప్పే ప్రయత్నం జరగకపోవచ్చు. అంతే! పాబ్లో నెరుడా, బాబ్ డిలాన్... వీళ్ళందరు కూడా వివిధ భాషల్లో రాశారు. అవి ఎప్పుడైతే అనువాదం ద్వారా ఇతర భాషల్లోకి వెళ్ళాయో అపుడు మాత్రమే ఆ ప్రామాణికత, ఆ ప్రాధాన్యత ఏర్పడింది.

నోబెల్ ప్రైజ్, బుకర్ ప్రైజ్, పెన్ అవార్డు ఇలాంటివి ఒక్కొక్క దేశానికి సంబంధించి అంతర్జాతీయ స్థాయిలో ఇచ్చే అవార్డులు ఉన్నాయి. వాటి చేత గుర్తించబడ్డ కవిత్వం కూడా వివిధ భాషల్లో అనువాదం అయిన సందర్భాలు ఉన్నాయి. ఒక రచన అనువాదం అవుతుందంటేనే అది గొప్ప సాహిత్యం అనే భావన మనలో ఉంటుంది.

తెలంగాణ సాహిత్యం, తెలుగు కవిత్వం కూడా అంతర్జాతీయ కవిత్వానికి ఏ మాత్రం తగ్గని స్థాయిలో సృష్టించబడింది. ఇపుడు కూడా సృష్టించ బడుతుంది.

ఇక ముందు కూడా సృష్టిస్తుంది. కాకపోతే దీనికి వాహిక కావాలి. ప్రపంచ సాహిత్యము గదులు గదులుగా ఉండే వ్యవస్థ అనుకుంటే ఆ గదిలోకి వెళ్ళడానికి మనకొక మీడియం కావాలి. ఆ మీడియం ఇంగ్లీష్! ఇంగ్లీష్‌లోకి ఎప్పుడైతే అనువాదం చేయబడుతుందో అది అందరికీ చేరుతుంది. దానికి సంబంధించి, తెలుగు తెలంగాణా సాహిత్యం, కవిత్వం అనువాదాలుగా తక్కువ జరిగాయనేవి నిజమే! అందుకే నేను 2011లో తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ కవితలను అనువాదం చేశాను. తెలంగాణ పోరాటానికి ప్రపంచ వ్యాప్తంగా ఒక సంఘీభావం కావాలి అని అనుకున్నపుడు నేను చేసింది ఏమిటంటే తెలంగాణ కవితలను ఇంగ్లీష్‌లోకి Translate చేసి International చేయడం. ఎవరైతే తెలంగాణ ఆకాంక్షను చెబుతూ కవితలు రాశారో వాటిని అనువాదం చేసా. అది Front line Formation అనే పుస్తకంగా కూడా వచ్చింది.

అనువాదాలు బాగా జరిగితే, అనువాదాలు చేసే వారికి ప్రామాణికత ఉంటే ప్రపంచ స్థాయి కవిత్వపు బ్లాక్‌లోకి తెలంగాణ కవిత్వం కూడా వెళ్తుంది. ఇప్పటివరకు దీనికి సంబంధించిన వర్క్ చాలా తక్కువనే జరిగింది అని చెప్పుకోవాలి.

తెలంగాణ వచ్చిన తర్వాత తెలంగాణ భాష - సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌గా ఉంటూ కొంత ప్రయత్నించాను. 1911-2011 మధ్య వందేళ్ళ కాలంలో వచ్చిన అత్యుత్తమ 50 కథలను ఎంపిక చేసి 'Telangana Harvest' పేరుతో ఇంగ్లీష్‌లోకి అనువాదం చేయడం జరిగింది. International Magazines లో దాని మీద రివ్యూలు కూడా వచ్చాయి. హరిత హారం Concept మీద వచ్చిన కవితల్లో కొన్నింటిని ఎంపిక చేసి Green Garland పేరుతో తెలంగాణ భాష, సాంస్కృతిక శాఖ ద్వారా ప్రచురించాము. దీనికి ఒక ప్రామాణికత ఏర్పడింది. ఇలాంటిది అనువాదం చేయడం ద్వారా మాత్రమే సాధ్యమౌతుంది.

మరొక ప్రశ్న కూడా అడిగావు కదా! తెలంగాణ కవిత్వం అనువాదం విస్తృతంగా జరగక పోవడానికి తెలంగాణ భాషలో ఉండే సంక్లిష్టతనే కారణమా? అని! ఈ విషయానికొస్తే తెలంగాణ భాషలో సంక్లిష్టత అస్సలు లేదు. అనువాదానికి ఒదగనంత, అనువాదం చేయడానికి వీలు లేనంత భాషలు

ఈ ప్రపంచంలో ఏమీ లేవు. ఒక వేళ ఉన్నట్టయితే ఒక సౌలభ్యం కూడా ఉంది. ఒక అనువాదకుడిగా నేను ఈ మాట అంటున్నాను. ఏదైతే అనువాదానికి ఒదగదో, ఏ సాంస్కృతిక వైవిధ్యత అంశాల వలన ఒక జాతిలో, ఒక భాషలో, ఒక జీవన విధానంలో ఉన్న అంశాన్ని మరొక జాతికి చెందిన భాషలోకి అనువదించలేక పోతామో, ఆ పదాలను ఇటాలిక్స్‌లో పెట్టి అలాగే రాస్తాము. కింద స్టార్ మార్క్ పెట్టి దాని గురించి Foot Notes చెబుతాము

ఉదా॥ బతుకమ్మ అని ఉంది. బతుకమ్మకు వేరే పదం లేదు దానిని బతుకమ్మ అనే చెబుతాం. బతుకమ్మకు బదులుగా Festival of flowers అంటాము గాని దానికి ఇంగ్లీష్‌లోకి అనువాదం చేసేటపుడు బతుకమ్మ ఇటాలిక్స్‌లో పెట్టి బతుకమ్మ BATHUKAMMA FESTIVAL OF FLOWERS PERFORMED BY WOMEN OF TELANAGANA అని FOOT NOTE రాస్తాము. దీని వలన అంతర్జాతీయంగా ఎవరు చదివినా కూడా అర్థం చేసుకుంటారు.

ఏ పదాలైతే ఒక జాతి సాంస్కృతిక మూలాలకు మాత్రమే పరిమితంగా ఉండి, దాని అస్తిత్వాన్ని చెప్పగలిగి ఉండి, ఇతర జాతుల సాంస్కృతిక జీవన విధానాల్లో ఉండవో వాటిని ఉన్నవి ఉన్నట్లు రాసి చెబుతాం. మనకు ఇంగ్లీష్‌లో ఆఫ్రికన్ లిటరేచర్‌లో గెట్టో (Ghetto) అనే పదం ఉంది. ఈ మాటను మనం మురికి వాడ, స్లమ్ అని చెప్పడానికి లేదు. కాఫీ తోటల ఎస్టేటు యాజమానులు ఆఫ్రికన్ వాళ్ళను బానిస కూలీలుగా తీసుకొచ్చి వాళ్ళను ఉంచే కొట్టాలను గెట్టొలని అంటారు. మనం పశువులను ఎట్లాగైతే కొట్టంలో పెడతామో అలా బానిసలను ఒక చోట సంకెళ్ళతో ఉంచే స్థలం అన్న మాట.

ఈ వివరణను తెలంగాణ సాహిత్యానికి కూడా వర్తింపచేయవచ్చు ఆ లెక్కన ఒక్క పదం వెనుక ఇంత సామాజిక, ఆర్థిక, రాజకీయ, చారిత్రక, సాంస్కృతిక నేపథ్యం అల్లుకుని ఉంటుందన్న మాట. అందుకని అలాంటి పదాలను యథాతథంగా తీసుకుని వాటికి అర్థవివరణ (Interpretation) ఇవ్వడం ద్వారా ఒరిజినాలిటీ ఎక్కడా చెక్కు చెదరకుండా భావాన్ని

వ్యక్తీకరించవచ్చు. పైగా ఈ తీరు వల్ల ఇతర భాషా పదాలు ఇంగ్లీష్ సాహిత్యంలోకి చేరతాయి. భాషల ఆదాన ప్రదానాలు సాధ్యం అవుతాయి. దీనిని బట్టి తెలంగాణ పదాలుగాని, భాషగాని, సంక్లిష్టంగా ఉండడం వలనే అనువాదానికి నోచుకోలేదనడానికి సరైన ఆధారాలైతే ఉండవు.



Q

- *మీ 'ఒంటరీకరణ' కవిత్వం చదివినపుడు అందులో సోలో, ఒంటరీకరణ, ఒంటరి సముద్రం, దు:ఖ గీతం లాంటి కవితలు ఎక్కువగా ఉన్నాయి. ఒంటరితనం మీదనే ఎక్కువ రాయడానికి కారణం?*

– సాధారణంగా కవితలన్నీ కూడా ఒక Psychological Plain లో ఒకానొక మనోమథనంలో రాసినట్టుగా ఉంటాయి! ఇది అందరికీ సహజంగా ఉండేదే. మనం ఏ వేదన, ఏ దు:ఖం, ఏ సంఘర్షణలో ఉంటున్నామో అవి మన కవిత్వంలో ప్రతిఫలిస్తాయి. కవిత్వం అనేది నాకొక Catharsys లాంటిది దీపపుచిమ్నీలో దీపం వెలుగుతూ ఉంటుంది. రాత్రంతా వెలిగిన తర్వాత గాజు చుట్టు నుసి ఏర్పడుతుంది. ఆ నుసి లాంటిదే మన కెదురైన సన్నివేశాలు. సంఘటనలు, సంఘర్షణలు, వేదనలు, దు:ఖం ఇవన్నీ కలిసి మన మెదడులో చిమ్నీకి పొగ చూరినట్లుగా నుసి అంటుతుంది. దానిని మొత్తం తుడవాలి. దానిని తుడిస్తే తప్ప దీపపు వెలుతురు ఆ గాజు అద్దంలోంచి బయటకు కనిపించదు.

నాలో పేరుకుపోయిన దు:ఖాన్ని, వైరాగ్యాన్ని, నైరాశ్యాన్ని, నిరాసక్తతను, వేదనను తుడవడం కోసం నాకు నేను ఏర్పాటు చేసుకున్న Process ఏంటంటే Poetry రాయడం! Poetry writing is definitely a catharsys to me! 1998 నుంచి 2010 దాక నాకు చాల క్రైసిస్ టైం అదంతా. అప్పుడే మా అమ్మ చనిపోయింది. మా అమ్మ చనిపోగానే కుటుంబ బాధ్యతలు నా మీద పడ్డాయి. ముగ్గురు చెల్లెండ్లు, ఒక తమ్ముడు, నాన్న. వీళ్ళందరి బాధ్యతలు చూసుకోవడం నా శక్తికి మించి, నా వయస్సుకు మించి పనులు నిర్వహించ

వలసిన అవసరం వచ్చింది. ఆ క్రమంలో నా వేదనను, దు:ఖాన్ని చెప్పడానికి నాకున్న ఒకే ఒక మార్గం కవిత్వం. అందుకే ఆ టైంలో రాసిన కవిత్వంలో ఒంటరితనం ఉంటుంది.

అంతే కాదు. మృత్యువు మీద కూడా చాలా కవితలు ఉన్నాయి. 'థనటోస్' అనే కవిత రాసాను. థనటొస్ అనే పదం నుంచి Thanatology వచ్చింది. ఇది గ్రీకు పదం. దీని అర్థం మృత్యువు గురించి అధ్యయనం చేసే శాస్త్రం.

డోలాయమానంగా ఉండే పెండ్యులం లాంటిది జీవితం! ఒకవైపు Ecstasy మరొక వైపు Agony ఉంటది. ఈ రెండింటి మధ్య సంచారమే మనం. ఒక దగ్గర ఆనందంగా క్షణం మాత్రమే ఉంటాము. వెంటనే మళ్ళీ అక్కడి నుంచి వెళ్ళి పోతుంటాం.

ఎగోని ఎక్స్టసీల మధ్య మనం ఎక్కువగా ఎక్కడి వైపు ఉంటామో దాన్ని బట్టి దు:ఖమో, ఆనందమో కలుగుతాయి. ఏది దు:ఖమో, ఏది ఆనందమో చెప్పడానికి సన్నని రేఖ గీయడానికి ఉండదు.

నా కవిత్వంలో సంబరానికి సంబంధించిన కవితలు ఉన్నాయి. నన్ను నేను వెతుక్కుంటున్నపుడు వైఫల్యం చెందిన సందర్భంగా రాసిన కవితలు కూడా ఉన్నాయి. నా Inner journey లోకి ప్రయాణం చేస్తున్నపుడు రాసుకున్న కవితలే ఎక్కువ! నా కవిత్వంలో బహిర్లోకపు కన్నా అంత: ప్రపంచంలోని సంఘర్షణలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాను. మన లోపల పెద్ద పోరాట ప్రపంచం ఉంది. సోమర్ సెట్ మామ్ Off Human Bondage పుస్తకంలో ఒక మాట చెబుతాడు The saddest thing in the life is not the death but the loveless ness అని.

మానవ జీవితానికి సంబంధించి ప్రపంచంలో విషాదకరమైన సంఘటన మరణం అనుకుంటాం. కాని మృత్యువుకాదు. ప్రేమ రాహిత్యాన్ని మించిన విషాద సంఘటన లేదు. మనలోకి మనం తొంగి చూసుకున్నపుడు ఇది తెలుస్తుంది. దీని వలన ఒక ఫిలాసఫీ ఏర్పడుతుంది. ఫిలాసఫి లేకుండా నా కవిత్వం ఉండదు.

Q

**● ‘ఊరికి పోయిన యాళ్ళ’ కవిత్వ సంపుటిలో కొన్ని కవితలు ఐదారు పేజీల్లో ఒక దీర్ఘ కవితను పోలి ఉన్నాయి. భవిష్యత్తులో ప్రత్యేకంగా ఒక లాంగ్ పోయెం రాసే అవకాశం ఉందా?**

– ఉంది. ఉదాహరణకు ‘బుగులోని తీర్థం’ గురించి రాసిన కవిత! అందులో చిన్నప్పటి నా బాల్యమంతా చెప్పాలి. బుగులోని తీర్థం దగ్గర జరిగే విషయాలను, ఆ ప్రయాణమంతా ఒక కవితలో చెప్పాలి. అది ఒక కవితలో ఒదిగేలాగ లేదు. విస్తృతి ఎక్కువగా ఉంది. రాస్తూ పోతున్నపుడు దీర్ఘకవిత లాగ ఐదారు పేజీలు వచ్చింది. అది అనివార్యంగా వచ్చింది తప్ప దీర్ఘ కవితగా రాయాలనో, సంక్షిప్త కవిత లాగా రాయాలనే ఆలోచనతోనో Predetermined Notion తోనో రాయలేదు. నిజానికి ఏ కవి కూడా తన కవిత ఇరవై లైన్లకే ముగించాలి. లేదా కవిత 30 లైన్లకే ముగించాలి. లేదా నలభై లైన్లకే ముగించాలి అనుకోడు. తాను చెప్పుకుంటూ వెళ్తాడు. ఆ క్రమంలో ఎక్కడైతే తన ధార ఆగిపోతుందో అక్కడ ఆపి వేస్తాడు. ఆపడానికి వీలు కాకపోతే ఆ కవిత అలాగే కొనసాగుతుంది.

Q

- **మీ “ఊరికి పోయిన యాళ్ళ” కవిత్వం చదివినపుడు ఎవరికైనా ఊరికి పోయిన అనుభూతి కల్గుతుంటది. ఒక ఇరవై, ముప్పై ఏండ్లకు ముందే ఊరు నుంచి దూరం జరిగినా ఆ భాషను, ఆ ఊరును మీ కవిత్వంలో ఎలా రాయగలిగింద్రు? నాయినను చూడడానికి నెలకొక సారైనా ఊరికి పోతానని ఒక పుస్తకంలో చెప్పుకున్నరు కదా? మీరు ఒకప్పుడు చూసిన పల్లె ఇప్పుడు ఉందా?**

**–** ఉండదు. ఎందుకుండాలి? నువ్వయితే మారుతావు గానీ నీ ఊరు మారొద్దా? ఊరు మారిందని చాలా మంది కూడా కవితలు రాసింద్రు! ఊర్లలో అప్పటి అనుబంధాలు లేవని, ఊరు ఒకప్పుడు గొప్పగా ఉండేదని, పదేళ్ళలో వచ్చిన పరిణామాలను రాసుకుంటూ వచ్చారు. అయితే వీళ్ళ అభిప్రాయలను గౌరవిస్తూనే కొంత విభేదిస్తా! మనం మారినం కదా! ఒకప్పుడు ఒకలాగ డ్రెసింగ్ వేశాను. ఇపుడు మరొకలాగ డ్రెసింగ్ వేశాను. అపుడు ఒకలాగ మాట్లాడాను. ఇపుడు ఒకలాగ మాట్లాడుతున్నాను.

ఈ పదేళ్ళ కాలంలో మనిషి పరిణామం చెందినపుడు, మనుషుల సమూహమే ఊరు అయినపుడు, ఊరెందుకు మారదు? ఊరు మారాలి కూడా.

నిరంతర గతిశీలక తత్వాన్ని కలిగి ఉన్నదే ఊరు. ఇప్పటి వరకూ ఎన్నెన్నో విశ్లేషణలు, కవితలు వచ్చినప్పటికీ ఇప్పటికి ఊరు మీదెందుకు ప్రేమఉంటుంది? అధ్యయనం చేయవలసిన అంశంగా ఊరు ఇంకా

మనకెందుకు కనిపిస్తుంది ? ఆ నిరంతర గతిశీలత వల్లనే కదా. ఊరు Ever Changing and forever Dynamic అందువలనే ఊరు మీద ఆసక్తి ఉంది. నిర్దిష్టత మీద ఎపుడు ఆసక్తి లేదు. అది గమనంలోని ఆసక్తి. గమనం లేని జీవితంలో ఆసక్తి అంతగా ఉండదు! ఏదైతే గమనంలో ఉంటుందో, ఏదైతే గతిశీలకంగా ఉంటుందో దాని పట్ల మానవునికి మొదటి నుంచి కుతూహలం! చెట్టు మీద ఆదిమమానవుడికి ఎందుకంత ఆసక్తి అంటే చెట్టు స్థిరంగా ఉంటుంది కాని ఆకులు కదులుతుంటాయి, పండ్లు కదులుతుంటాయి. ఆ చలనమే మనిషిని ఆకట్టుకుంటుంది. 'గతిశీలం' అనేది ప్రకృతి ధర్మం గతిశీలమైన ప్రపంచంలో ఊరు మాత్రం మారకూడదు, అట్లనే ఉండాలి అని ఎందుకనుకోవాలి?

ఇక్కడే కారల్ మార్క్స్ మాటను గుర్తు చేసుకోవాలి. The unchanging truth in the world is, the change. ఈ ప్రపంచంలో మారని సత్యమంటూ ఉంటే అది మార్పే! భారతీయ దార్శనికతలో సత్యం, శివం, సుందరం అనేవి శాశ్వత సత్యాలుగా చెబుతాం. సత్యం అనే దానికి నిర్దిష్టత ఏది? నీ కోణంలోంచి నీ ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితుల్లోంచి ఒక సత్యం ఉంటుంది. మరొక జాతికి, ప్రాంతానికి మరొక సత్యం ఉంటుంది. సియోల్‌లో ఒలింపిక్స్ జరిగినపుడు అక్కడ కుక్కల మాంసం పెట్టారు. అక్కడ సత్యం అది! మన భారతీయ విధానం ప్రకారం అది నిషేధం! దానిని ఊహించుకోలేము కూడా! నేను చైనాకు వెళ్ళినపుడు 20 రోజులు పర్యటస్తున్నపుడు బఫె డిన్నర్ లో పాముతల కనిపించింది. భయమై అక్కడ ఏమి తినలేదు. అది పెద్ద ఇంటర్నేషనల్ హోటలే. అక్కడ పర్యటించినన్ని రోజులు మరే విధమైన ఫుడ్‌ను తినలేదు. డ్రాగన్ ఫ్రూట్స్ తింటూ ఉన్నాం. ఎందుకంటే... మన ఆహారపుటలవాట్లలో అవి నిషేధించబడ్డాయి. తినేవి ఏవి అనేవి కూడా నిర్ధారించబడ్డాయి. ఇలా మనకు సమాజపరంగా నిర్దేశించబడి, ఆమోదయోగ్య అలవాటైన సాంస్కృతిక Acceptability కోణంలోంచే ప్రపంచాన్ని గమనిస్తుంటాము.

ఇది మాత్రమే సత్యం అనుకుంటాం! అయితే సత్యమనేది ఈ కాలానికి, ఈ పరిస్థితికి, ఈ ప్రాంతానికి సంబంధించి మాత్రమే సత్యం. సార్వత్రిక సత్యాలు లేవు. మానవత్వం అనేది ఒకటుంది గాని మిగతావి ఏవి కూడా

విశ్వజనీన సత్యాలు కావు!

In an ever changing world, speed is constant అని బిల్‌గేట్స్ చెబుతాడు. నిరంతరం మారే ప్రపంచంలో స్థిరమైంది వేగం మాత్రమే అని చెబుతాడు. కారల్ మార్క్స్ చెప్పిన కొన్ని వందలాది సంవత్సరాల తర్వాత బిల్‌గేట్స్ ఈ వాక్యాలు చెప్పిండు. కొత్త సంఘటనలకు కొత్త వ్యక్తులకు, పరిస్థితులకు ఎంత స్పీడ్‌గా నిన్ను నీవు adapt, and update చేసుకుంటావో అదే ప్రపంచాన్ని శాసిస్తుందని బిల్‌గేట్స్ ఉద్దేశ్యం. ఇదే సూత్రం సాహిత్యానికి, కవిత్వానికి కూడా వర్తిస్తుంది! దేశాలు, సమాజాలు, పల్లెలు, పట్టణాలు, నగరాలకు కూడా ఈ గతిశీలతే, నిత్య చైతన్య శీలసూత్రమే వర్తిస్తుంది కాబట్టి ఊరు మారుతుంది. వ్యవస్థ మారుతుంది. మార్పును ఆవహించుకోవలసిందే...!

Q

- **మీ కవిత్వానికి ప్రధానమైన తాత్విక భూమిక ఏమని భావిస్తారు?**

– ఒక్కటని చెప్పడం కష్టం. ఇంతకు ముందు చెప్పుకున్నవన్ని ఉంటాయి. నా సాహిత్యం యొక్క ప్రధాన లక్ష్యం జీవితాన్ని అన్వేషించడం, జీవితాన్ని చిత్రిక పట్టడం, జీవితాన్ని దోసిలిలోకి తీసుకునే ప్రయత్నం చేయడం.

Q

- ***మీరు రాసిన 'కట్ట మీద ర్యాలచెట్టు' కవితను చదివినపుడు పదిమందికి సహాయంగా నిలబడడం, నిరాడంబరంగా బతకడం మీ ఫిలాసఫీ అనిపించింది. అది మీ జీవితంలో కూడా కనిపించింది. ఇదెలా సాధ్యమైంది?***

**–** జీవితం అర్థమైతే అవన్ని సాధ్యమౌతాయి తమ్ముడూ! కన్నీళ్ళు కూడా ఇంకిపోయే స్థితి వస్తే అవన్ని వస్తాయి. దు:ఖించడానికి కూడా కన్నీళ్ళు కరువైన పరిస్థితి ఒకటుంటుంది. అదే అన్ని నేర్పిస్తుంటుంది.

నా Perspective లోంచి 5 నవలలు రాయాలని నా కోరిక. మా నాన్న మా తాతల జీవితం గురించి రాయాలని ఉంది. ఈ భూమ్మీద ప్రతి ఒక్కరికి ఒక్కో కథ ఉంది. ప్రతీ ఒక్కరి కథ కూడా worthy of writing ఎవరూ తక్కువ గాదు.

Rejected indian అనే పదం నాకు ఇష్టం. మా బంగ్లా మీద మూడు గదులు నాకోసం ఉండేవి. ఆ గదుల్లో పైన Welcome to the World of Rejected Indian అని రాసి పెట్టుకున్నాను. ఎందుకో అలా నచ్చేది. ఎందుకు ఆ పదం పట్ల అనురక్తి అని అన్వేషించాలి. అన్వేషించే క్రమంలోనే ఇవన్నీ రాస్తున్నా! అది దొరికిన రోజు నేను రాయను. ఇప్పటి వరకు నేను రాసినవన్ని అసంపూర్ణ కవితలే, అర్థ కవితలే అనుకుంటున్నాను. Whatever I wrote so far is Half poetry only. మిగిలిన ఆ సగాన్ని అన్వేషించాలి.

Q

- **మీ కవిత్వంలో మీరు నడిసొచ్చిన జీవన నేపథ్యానికి సంబంధించిన కవితలు తక్కువగా ఉన్నాయి. మార్కేండేయ పురాణం, మగ్గం ఇలా కొన్ని పదాల ప్రస్తావన కనబడుతుంది గానీ పూర్తిగా ఆ జీవితాన్ని చెప్పలేదు? ఎందుకు?**

– నాది చేనేత వృత్తికి సంబంధించిన కుటుంబం అయినప్పటికీ ఆ జీవితం నాకు లేదు. నేను పుట్టే నాటికే తాతకు పెద్ద వ్యవసాయం ఉండేది. అలా మా నాన్నకు కుటుంబ పరంగా, వంశపరంగా వచ్చిన వృత్తి లేదు. ఆయన డాక్టర్ కావడం వల్ల వ్యవసాయంతో కూడా సంబంధం లేదు.

మా తాత నుంచి మా కుటుంబ Occupational Structure మారిపోయింది. మా తాత నుంచి వ్యవసాయ సంస్కృతి తెలుసు అనుకున్నప్పటికీ మా నాన్న నుంచి అది మరో అడుగు ముందుకేసి మరింత మారిపోయింది. నాన్న డాక్టర్ కావడం వలన పేషంట్లు, రోగులు, క్లినిక్,... ఇలా వాతావరణం మారిపోయింది మా అమ్మ చూస్తేనేమో విస్తృతమైన అధ్యయనం ఆమెది.

అలా అని ఆ జీవితం నుంచి పూర్తిగా వేరుపడినం అని కాదు. మా ఊరులో 90% చేనేత వృత్తికి సంబంధించిన వాళ్ళే. అక్కడికి వెళ్ళినపుడు వాళ్ళ జీవితాన్ని చూసేది. పావుకోళ్ళు, మగ్గంగుంటలు, ఊసలు అన్నీ తెలుసు. కాని పూర్తిగా మమేకత లేదు. పదబంధాలు, ప్రతీకలు కొంతవరకు రాయగల్గిన గాని మగ్గం గుంట Culture లేకపోవటం వలన ఆ జీవితాన్ని రాయలేక

పోయిన. పోనీ, వ్యవసాయానికి సంబంధించిన జీవితమైనా చెబుదామనుకుంటే పూర్తిగా వ్యవసాయంలో కూడా లేము. మా తాత, బాబాయిలు వ్యవసాయం చేశారు. నేను కచ్చురం మీద ఎక్కి పోయిన గుర్తులు ఉన్నాయి గాని దాంట్లో మమేకమైన సందర్భాలు తక్కువ. అందుకే నేను చూసిన జీవితాన్నే రాసిన. మనం మన experiented లిమిట్స్ దాటి వెళ్ళలేం కదా.!

మనం చూసిన ప్రపంచం, మనం అనుభవించింది చాలా బాగా చెప్పగలుగుతాం. చేయని దాన్ని సైతం కవి ఊహించి చెప్పగలడు. ఆ situation లో లేకున్నా ఊహించి ఆ వేదనను చెప్పగలిగే ఒక సృజనాత్మక శక్తి కవి సొంతం. నేను సోమాలియా గురించి కవితరాసాను. రాసినంత మాత్రాన దానికి స్ఫూర్తిగా సోమాలియాలోని స్థితిని నేను అనుభవించి ఉండాలని లేదు కదా.

సోమాలియా గురించి తదనుభూతి (Empathy) పొందినం! అక్కడ జరుగుతున్న దు:ఖాన్ని, పత్రికలోనో, న్యూస్‌లోనో చూసినపుడు మన అంతరంగంలో కలిగిన ఫీల్‌లోంచి వచ్చిన కవిత అది.

అలాంటి అనుభూతే James Joyce కు యులిసిస్‌గా మారుతుంది. హోమర్‌కు ఇలియెడ్‌గా మారుతుంది. వ్యాసుడికి మహా భారతంగా, వాల్మీకికి రామాయణంగా మారుతుంది.

ఇంకా చెప్పాలంటే మహాభారతం కూడా ఒక దీర్ఘకవితనే అని నేను అనుకుంటాను విక్రమ్ సేత్ A Suitable boy రాశాడు. అది ఒక సుదీర్ఘకావ్యం లాగనే ఉంటుంది.

"ఒక మనిషి తన జీవితకాలంలో ఒకటే కవితను రాస్తాడు. కాని మనం దానిని వేరు వేరు కవితలుగా చూస్తాము". ఒక్కో సంవత్సరం ఒక్కో సంకలనంగా తీసుకు వస్తాం. గానీ ఇదంతా ఒకటే కవిత.

నా ఉద్దేశ్యంలో ఒక కవి తన అంతర్గత సంఘర్షణలోంచి పుట్టిన ఒక జీవధారను, ఒక తాత్వికధారను ఒకే కవితగా వేరు వేరు కాలాల్లో వ్యక్తీకరిస్తూ వస్తాడు. అలాంటపుడు కవి తన జీవితకాలంలో చేసిన సృష్టి అంతా ఒకే కవిత అవుతుంది.

# Q

- ***ఒక పల్లెటూరి పిల్లగాడు హైదరాబాద్ నడిగడ్డకు వచ్చి జానపద కళాకేంద్రంగా నిలబడిన ప్రయాణం మీది. ఈ ప్రయాణాన్ని ఆత్మ కథగా రాస్తే బాగుంటుందని నాకు అనిపించింది. ఆత్మ కథ రాస్తే బాగుండు అని ఎప్పుడైనా అనుకున్నారా?***

**–** ఆత్మ కథ రాయాలని ఉంది కాని ఇంగ్లీష్‌లో రాస్తా. మా ఇంట్లో అందరి జీవితం రాయల్సినంతగా ఉంది. మేము మొత్తం అయిదుగురం. పెద్ద చెల్లెలు స్రవంతి. తన జీవిత ప్రస్థానం గమనిస్తే తన జీవితంలో ఎంతో పోరాటం, సంఘర్షణ ఉంది. రెండవ చెల్లెలు స్వాతి జీవితం కూడా అంతే. మూడవ చెల్లెలు సుకృతి కెనడాలో ఉంటుంది. మా ఊరందరికి ఆమె చిన్నక్కగా తెలుసు. The Girl called chinnakka అనే టైటిల్ పెట్టి రాయాలని కోరిక. మా తమ్ముడు జయకృష్ణ అమ్మ చనిపోయినపుడు చాలా చిన్నవాడు. తనను మా చెల్లెలైతే తమ కొడుకులాగ చూసుకుంటారు. ఇలా మా ఐదుగురి జీవితాలు ఐదు కోణాలలో, రకరకాల బ్యాక్‌గ్రౌండ్ లలో నాకు స్ఫురణకొస్తాయి. ఇవన్నీ బృహత్ కావ్యాలుగా రాయడానికి కావాల్సినంత విషయాలే. అలాగే మా నాన్న, అమ్మ, మా తాతలు వెంకట్రాజం, మల్లయ్య వారి గాథలు కూడా నిత్య సంఘర్షణలు, సాహసాలు, ఫెయిల్యూర్స్ తో కూడినవే. ఇవన్నీ నేను రాయాల్సిన పుస్తకాల Wish List!

Q

- **కవిత్వాన్ని, జీవితాన్ని మీరెలా నిర్వచిస్తారు? ఒకచోట 'కవిత్వం ఎప్పుడూ ఒంటరే'అని నిర్వచించిండ్రు. ఇప్పుడెలా నిర్వచిస్తారు?**

– కవిత్వం ఎప్పుడైనా ఒంటరే. ఒంటరిగా ఉన్నప్పుడే అది వినిపిస్తది.

చాలా మంది కవిత్వమే తోడు అనుకుంటరు గదా. కావొచ్చు గానీ, సమూహంలో ఒక ఒంటరి పొలికేక కవిత్వం.

నువ్వేంటి, నేనేంటి అని అన్వేషించుకునే క్రమంలో మనల్ని మనం పోగొట్టుకుంటాం. నన్ను నేను పోగొట్టుకున్నాననే ఫీలింగ్ వచ్చినపుడు కవిత్వం వస్తుంది.

నా ఉద్దేశ్యంలో మాత్రం కవిత్వం ఎప్పుడూ ఒంటరే! నాకు తోడు ఉన్నారని అనుకున్నపుడు కవిత్వమే రాదు! అందుకే Solitude is my Attiitude! నిన్ను నీవు ఎట్లా విశ్లేషించు కుంటావు? అని అంటే Lone Crusader అనుకుంటాను!

ఒంటరిగా ఉన్నాం కనుకనే చెప్పాలనుకుంటాం. సమూహంలో ఉంటే ఏం చెబుతాం? ఆ గందరగోళంలో మనం తప్పిపోతాం... ఒంటరితనంలో మాత్రమే మనల్ని మనం ఆసరాగా అందిపుచ్చుకుంటాం... పొదివి పట్టుకుంటాం ... మనతో మనం, మనలోకి మనం ప్రయాణిస్తాం... మనతో మనం సంభాషిస్తాం... ఆ సంభాషణే కవిత్వం ....! అలాంటి ఏకాంత ఆంతర్యానమే జీవితం!!

Q

- మీ సంపాదకత్వంలో 'మట్టిముద్ర', 'తల్లివేరు,' 'తొలిపొద్దు,' ఆకుపచ్చని పొద్దుపొడుపు 'స్వేదభూమి' 'అలుగుదుంకిన అక్షరం' లాంటి సంకలనాలు వచ్చాయి కదా! ఈ సంకలనాలు మీరనుకున్న ప్రయోజనాన్ని నేరవేర్చాయా?

– ఒక లక్ష్యంతోనే వాటిని వేశాము. అవి 100% నెరవేరాయి. తెలంగాణా వచ్చిన మొదటి సంవత్సరంలో 2015లో తెలంగాణ అవతరణ వేడుకలు జరుపుకుంటున్నపుడు గౌరవ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావుగారు కవి సమ్మేళనాలు నిర్వహించాలని చెప్పారు. వారికి కవిత్వమంటే, సాహిత్యమంటే అభిమానం, కళాకారులంటే గౌరవం గనుక సాహితీ, సాంస్కృతిక, కళాత్మక వాతావరణంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ వైభవంగా జరగాలనేది ముఖ్యమంత్రి గారి సంకల్పం. దాన్ని సాకారం చేసే దిశగా కవిసమ్మేళనం విభిన్నంగా పెట్టాలని, అత్యధిక కవులతో కవి సమ్మేళనం జరపాలని 442 మంది కవులను ఆహ్వానించి పొద్దున 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు కవుల కవితాగానాన్ని రికార్డు చేసి ఆ కవితల్ని 'తొలిపొద్దు' అనే సంకలనంగా తీసుకువచ్చాం.

దానికి స్ఫూర్తి సురవరం ప్రతాపరెడ్డి గారే! తెలంగాణలో కవులే లేరు. అన్నమాటకు 340 మందిపైగా కవులు, పండితులు, భాషావేత్తలు ఉన్నారని చెబుతూ సురవరం వారు "గోల్కొండ కవుల సంచిక"ను తీసుకొచ్చారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకొని మరొక అడుగు ముందుకేసి "తొలిపొద్దు" తీసుకువచ్చాం. తెలుగు సాహిత్య ప్రస్థానంలో 2015 వరకు అతి పెద్ద

సంకలనం గోల్కొండ కవుల సంచిక. అది తెలంగాణ సృష్టి. ఒకవేళ మళ్ళీ అలాంటిది వస్తే తెలంగాణ వాళ్ళే ఆ బెంచ్ మార్క్‌ను క్రియేట్ చేయాలి. ఇలా అనుకొని ఈ సమ్మేళనం నిర్వహించాం. భారతీయ భాషలు అన్నింటిలోకెల్లా అతిపెద్ద సమకాలీన కవుల సంకలనంగా 'తొలిపొద్దు' తనదైన ప్రత్యేకతను సృష్టించింది. ఆ తరువాత 'తల్లివేరు,' 'మట్టి ముద్ర,' 'అలుగు దుంకిన అక్షరం' మొదలైనవన్నీ కూడా ఒక థీమ్ ప్రకారం కవి సమ్మేళనాలు నిర్వహించి, వాటిని పుస్తకాలుగా ముద్రించడం జరిగింది. వాటి ద్వారా సమకాలీన కవుల భావాలను, ఆలోచనా ధోరణులను, వారి విస్తృతిని చారిత్రకంగా రికార్డు చేసే అరుదైన అవకాశం వచ్చింది.

అంతేగాక, భాషాసాంస్కృతిక శాఖ ద్వారా ప్రచురించిన ప్రతి పుస్తకాన్ని కూడా కొత్తగా డిజైన్ చేశాము. ఇప్పటి వరకు ఉన్న సంప్రదాయం ఏమిటంటే ఎవరైన కవి తన సొంత సంపుటి వేస్తే తన ఫోటో చివరలో వేసుకునే వాడు. చాలా సంకలనాలలో పేర్లు మాత్రమే ఉండేవి తప్ప వాళ్ళకు సంబంధించిన వివరాలు ఉండేవి కావు. 'తొలిపొద్దు' నుంచి కొత్త సంస్కృతికి శ్రీకారం చుట్టినాము. దానితో కవుల ఫోటోలు, వాళ్ళ అడ్రసులు, వాళ్ళ సెల్‌ఫోన్ నంబర్లు వేస్తూ ఒక సమగ్రతను ఇచ్చే ప్రయత్నం చేసినం. ఆ తరువాత వేసిన ప్రతి సంకలనంలో కూడా ఇలాగే వేస్తూ వచ్చాము.

కవి ఎట్లా ఉంటాడో చూడాలనే ఆసక్తి పాఠకులకి ఉంటుంది. 'స్వప్నలిపి' రాసిన అజంతా ఎట్లుంటడో చూడాలని ఉంటుంది. 'సర్రియలిజం'తో అద్భుతంగా బొమ్మలు గీస్తే సాల్వడార్ డాలీ అనే కవి పొడవైన మీసాలతో ఉంటాడు. విన్సెంట్ వాన్‌గో, MFహుస్సేన్, ఇలా వాళ్ళ వర్క్‌తో పాటు వాళ్ళు ఎట్లా ఉంటారో చూడాలని సగటు పాఠకుడికి ఉంటుంది గనుక దానిని దృష్టిలో పెట్టుకొని కవికి సంబంధించిన ఫోటోతో వేశాం. ఈ సంకలనాలన్ని తమదైన ప్రత్యేకతలను, తమదైన ముద్రని తెలంగాణ సాహిత్యంలో వేశాయి. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత అతి ఎక్కువ కవితా సంకలనాలు వేసిన వ్యవస్థ బహుశా భాష సాంస్కృతిక శాఖనే నేమో!

# Q

● *అనువాదం చేసిన కవితల తోటి కవిత్వ దినోత్సవం జరిపించారు కదా. వాటి గురించి చెప్పండి?*

– ప్రపంచంలో కవిత్వ పరంగా ఎలాంటి ధోరణులు వస్తున్నాయో తెలియవలసిన అవసరం ఉంది. మార్చి 21 రోజును 'వరల్డ్ పొయిట్రీ డే'గా UNESCO గుర్తించింది. ప్రభుత్వ పరంగా ఆరోజు వివిధ భాషల్లో ఉన్న కవులందరిని ఒక చోట చేర్చి బహు భాషా కవి సమ్మేళనం నిర్వహిస్తూ వచ్చాము. అనువాదాలు చేయగలిగిన కవులతో అనువాదాలు చేయించి పుస్తకంగా వేశాము. ఎలాంటి వస్తువుల మీద వాళ్ళు కవిత్వం రాస్తున్నారు? ఎలాంటి పరిణామాలు జరుగుతున్నాయి? ఎలాంటి వస్తువులు కవులను స్పందింపజేస్తున్నాయి? అనే విషయాల మీద మాట్లాడినాము.

కవిత్వం నిరంతర అధ్యయనం. ఇలాంటి కవి సమ్మేళనాలు పెడితేనే కవిత్వం గురించి తెలుస్తుంది అని కాదు. నిజానికి వ్యక్తిగత ఆసక్తి ఉన్నవాళ్ళకి ఎవరూ చెప్పవలసిన అవసరం లేదు.

కొన్ని సంస్థల ద్వారా, కొన్ని వ్యవస్థల ద్వారా తెలియజెప్పే ప్రయత్నం చేస్తే కవుల, సాహితీ వేత్తల జ్ఞాన చక్షువు మరింత విస్తరించుకునే అవకాశం వస్తుంది. చాలా మంది కవులు అద్భుతంగా రాస్తున్నారు. మిగతా విషయాలు కూడా తెలిస్తే ఇంకా గాఢంగా రాసే అవకాశం ఉందని ప్రపంచ కవితా దినోత్సవం ద్వారా ఆ సంకల్పాన్ని నెరవేర్చాలని అనుకోవడం జరిగింది.

Q

- *మీరు గమనించినంత వరకు తెలంగాణ రాకముందు, వచ్చిన తరువాత తెలంగాణ సాహిత్యంలో వచ్చిన ప్రధానమైన మార్పులు ఏవి?*

– తెలంగాణ అవతరణకు ముందు తెలంగాణ కవుల్లో ఉన్న లక్ష్యం ఒక్కటే తెలంగాణ రాష్ట్ర సాధన! దీన్ని ఎన్ని కోణాల్లోంచి చెప్పొచ్చో, అన్ని రకాలుగా ఆవిష్కరిస్తూ వచ్చారు. ఇంక తెలంగాణ వచ్చిన తరువాత కవులందరూ తమ తమ ఆసక్తికర వాదాలు, భావజాలాలలోకి వెళ్ళిపోయారు. కొంతమంది అభివృద్ధి గురించి, మారిన పరిణామాల గురించి, మారకుండా ఉన్న పరిణామాల గురించి రాశారు. కొంతమంది ఊహించింది అంత సాకారం అయ్యింది అని రాశారు. ఇంకా ఏమీ మారలేదనే కోణంలో కొంతమంది రాశారు. మరికొంత మంది వేటితోనూ నిమిత్తం లేకుండా మొదటి నుంచి వాళ్ళు దేన్నైతే రాస్తూ వచ్చారో, అంటే వాళ్ళ ఇన్నర్ జర్నీని, అనుభూతిని, అనుభవాలను రాస్తూ వచ్చారు.

కవి అనేవాడు నిరంకుశుడు! కవి ధిక్కార స్వరాన్ని వినిపిస్తాడు. ప్రజాల పక్షాన నిలబడడం అనేది మొదటి నుంచి ఉంది. కవిత్వానికి ఉన్న ప్రధాన లక్షణం ఇది.

ఇప్పుడున్న ప్రపంచ వ్యవస్థలను, వాటి ధోరణిని ప్రశ్నించే విధంగా కూడా కొంత మంది కవులు రాశారు. అది సామాజికమా, ఆర్థికమా అని కాదు. ఏ వ్యవస్థ అయినా కావొచ్చు. దానిని ప్రశ్నించడం, ధిక్కారాన్ని విన్పించడం, నిరసనను వ్యక్తం చేయడం జరుగుతుంది.

తెలంగాణ కవుల్లో గొప్పతనమేంది అంటే వారి నిజాయితీ! వారు మట్టితత్వాన్ని , మనిషి తత్వాన్ని, నిజాయితీని పోగొట్టుకోకుండా ఎప్పటి కప్పుడు తమను తాము చెక్కుకుంటూ తమ భావాలను ఆవిష్కరిస్తూ వస్తున్నారు.

ఇటీవలి కాలంలో ప్రధానంగా కనిపించిన పరిణామాలలో చెప్పుకోదగిన మరో అంశం - కవితా అధ్యయనంలోనూ, కవితా రచనలోనూ తెలుగుకు మాత్రమే పరిమితం అనే దశను దాటడం విశేషం. ప్రస్తుత కవుల పరిధి, విస్తృతి కూడా పెరిగింది. ప్రపంచ కవిత్వం, ఇతర భాషా కవిత్వాలతో పరిచయాలు కూడా పెరిగాయి. దాని వల్ల వాళ్ళ ఆలోచన ధోరణిలో కూడా మార్పు వచ్చింది. ఆ మార్పు వాళ్ళ కవిత్వంలో స్పష్టంగా కనిపిస్తుంది.

Q

- ***అన్నా! ఇప్పటి వరకు మూడు కవిత్వ సంపుటాలనే తీసుకొని వచ్చిండ్రు. మొత్తం ఎన్ని కవితలు రాసిండ్రు? ఎన్ని పుస్తకాలు రావలసి ఉంది?***

**–** ప్రచురితమైన కవితలే దాదాపు తెలంగాణ భాషలో వచ్చినవి 100 కవితల దాక ఉంటాయి. వాటిల్లో 36 కవితలతో 'ఊరికి పోయిన యాళ్ళ' కవిత్వ సంపుటిగా తెచ్చాను. ఇతర కవితలు దాదాపు 600 కవితల వరకు ప్రచురితం అయినవి ఉన్నాయి. ప్రచురితం కానివి ఇంకా చాలా ఉన్నాయి. వాటిల్లోంచి కొన్ని కవితలతో "ఒంటరీకరణ," "సుషుప్తి నుంచి" సంపుటాలను తెచ్చాను. మనం ఒక 45 కవితలతో ఒక సంపుటి అనుకుంటే ఇంకా ఓ పది సంపుటాలు రావొచ్చు. ఇవి కాకుండా అనువాదాలు ఉన్నాయి. ఇతర భాషల నుంచి తెలుగులోకి రాసిన కవితలు 200 దాక ఉన్నాయి. వాటిలోని ఎంపిక చేసిన 42 కవితలతో 'ప్రపంచకవిత' వేశాను. తెలుగు నుంచి ఇంగ్లీష్‌లోకి అనువాదం చేసిన కవితలు కూడా ఉన్నాయి.

అలాగే భారతీయ భాషల్లోంచి తెలుగులో అనువాదం చేసిన కవితలు కూడా ఉన్నాయి  అదొక పుస్తకం అవుతుంది.

తెలంగాణ ఉద్యమ  సమయంలో తెలుగులో నాకు నచ్చి ఇంగ్లీష్‌లోకి అనువాదం చేసిన తెలంగాణా కవితలు ఉన్నాయి.

ఇవేగాక నేను ఇంగ్లీష్‌లోనే రాసిన కవితలు 100 వరకు ఉన్నాయి. వాటిని ఇప్పుడు పుస్తకంగా వేయాలి.

Q

- **మొత్తం 1000 కవితల వరకు ఉంటాయని అనుకోవచ్చు గదా అన్నా !**

– పది పదిహేను సంపుటాలకు సరిపడే కవితలైతే ఉన్నాయి. తెలంగాణ భాషలో రాసిన కవితలు, అనువాదాలు, ఫ్యూజన్ షాయరీ కవితలు, తెలుగులో రాసిన కవితలు మొత్తం లెక్కేస్తే ఈజీగా 1000 నుంచి 1500 వరకు ఉంటాయి.

Q

- **ఇన్ని ఒత్తిడుల నడుమ మీరు కవిత్వాన్ని ఎట్లా రాస్తున్నారు? మీరు కవిత్వంగా ఎట్లా నడుస్తున్నారు అన్నా?**

– నాకున్న ఒకే ఒక స్నేహితుడు కవిత్వం! వేరే ఏ అలవాట్లు లేవు. మనకున్న ఒత్తిడులను అధిగమించడానికి ఒక్కొక్కరికి ఒక్కొక్క మార్గం ఉంటుంది. కొంతమంది టీ తాగుతారు. కొంతమంది పెయింటింగు వేస్తారు. కొంతమంది కథ రాస్తారు. కొంతమంది పాట పాడుతరు. కొంతమంది మ్యూజిక్ వింటరు ఇక, నేను ఏది చెప్పుకున్నా కవిత్వంలోనే చెప్పుకోవాలి. దు:ఖం కాని, ఆనందం గాని, ప్రేమ కాని ఏదైనా దాంట్లోనే చెప్పుకోవాలి.




గోలకొండపత్రిక
దున్నే వారికే భూమి

Q

- *మీ ఆఫీసులోకి రాగానే కాళోజి బొమ్మ, దాశరథి బొమ్మలు కనిపిస్తుంటవి. వాళ్ళ ప్రేరణ మీపై ఎట్లా ఉంది అన్నా?*

– తెలంగాణలో ఉన్న ప్రతి కవీ గొప్ప కవిత్వాన్ని రాశారు. కాళోజి గారు సరళంగా 'నాగొడవ' పేరుతో రాస్తూ తెలంగాణ తనం ఎంత నిరాడంబరంగా ఉంటుందో తన జీవితంలో, తన సాహిత్యంలో చూపించాడు.

దాశరథి భిన్న ప్రయోగాలు చేశాడు. రుబాయిలు, గజల్స్‌లను తెలుగు సాహితీలోకానికి పరిచయం చేసాడు. తెలుగు కవిత్వంలో, సినీసాహిత్యంలో ఉర్దూ పదాలను సమ్మిళితం చేశాడు. పద్య కవిత్వం రాశాడు. వచన కవిత్వం రాశాడు. గేయాలు, సినిమా పాటలు రాశాడు. సాహిత్యంలో ఎన్ని ప్రక్రియలు ఉన్నవో అన్ని ప్రక్రియల్లోకి తనను తాను ఒలికించుకున్నాడు. తెలంగాణ సాహిత్యానికి ఐకానిక్ ఫిగర్‌లా అనిపిస్తాడు.

తెలంగాణ ఏర్పడిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ద్వారా ఈ ఇద్దరి మహనీయుల జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తూ అవార్డులను కూడా ఇస్తుంది. కాళోజి జయంతి సెప్టెంబర్ 9నాడు కాళోజి పురస్కారం ఇస్తున్నాం. అలాగే దాశరథి జయంతి జులై 22న ఒక సాహితీ వేత్తకు దాశరథి పురస్కారం ఇస్తున్నాము. అందుకే ఆ రెండు పెయింటింగ్‌లను పెద్దగా చేసి పెట్టటం జరిగింది. దానితో పాటు తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రభుత్వమే కాళోజి జయంతిని అధికారికంగా ప్రకటిస్తూ జీ.వో ఇష్యూ చేసింది.

ఇదంతా తెలంగాణ భాషకు, సంస్కృతికి, తెలంగాణ జాతికి నీరాజనం. ఒకప్పుడు తెలంగాణ భాష భాషే కాదన్నరు. యాసే లేదన్నరు. అసహ్యించుకున్నరు. తెలంగాణ అస్తిత్వాన్ని వ్యక్తీకరించే క్రమంలో తెలంగాణ భాష కూడా ఒక అద్భుతమైన భాషే అని జీ.వో ఇష్యు చేయడం ద్వారా మరొక్కసారి తెలిసింది. ఇది ఒక గొప్ప మైలురాయి. ఈ ప్రాసెస్‌లో నేను అంతర్భాగం కావడం, నా ద్వారా ప్రతిపాదన వెళ్ళి ఉత్తర్వులు రావడం, గౌరవ ముఖ్యమంత్రి ఆశీస్సులతో అది శాసనంగా రావడం అనేది నేను వ్యక్తిగతంగా ఆనందించే విషయం. తెలంగాణా సాహిత్య ప్రస్థానంలో ఓ మూలమలుపులాంటి సందర్భం అది.





Q

- ***తెలంగాణ అనంగానే పాట గుర్తొస్తది! పాట ప్రజల్లోకి పోయినంతగా కవిత్వం పోత లేదు. కారణం ఏమై ఉంటది అన్నా?***

– సరళతనే ప్రధాన కారణం. తెలంగాణ జనజీవనంలో కాంప్లెక్సిటీ కనబడదు. సింప్లిసిటి మన పండుగల్లో కనబడుతుంది. బతుకమ్మ పండుగనే తీసుకుంటే అది ఎంతో సింప్లిసిటితో జరుగుతుంది. తీరొక్క పువ్వుని తీసుకొచ్చి పెడుతుంటాం కాని దాని కోసం గులాబీలను, గ్లాడియోలస్‌లను తీసుకురారు. ఇంటి ప్రక్కన ఉండే, పొలాలలో దొరికే తంగేడు పూలను తీసుకొస్తారు. మన నిత్య జీవితంలో అంతర్భాగంగా జరిగే ఏ అంశాన్ని తీసుకున్నా అన్నింటిలోనూ ఒక సింప్లిసిటి కనిపిస్తది. కవిత్వం మొదటి నుంచి కూడా కాంప్లెక్సిటినే. తొలినాళ్ళలో కవిత్వం ఛందస్సుతో, సంస్కృత భాషా పాండిత్య భావజాలంతో ఉండేది. కొంతమందికే అర్థమౌతుంది. అది 80% సామాన్య ప్రజానీకానికి అర్ధం కాదు.

మనకు సాహిత్యంలో రెండు సంప్రదాయాలు వచ్చాయి. అవి మార్గ సంప్రదాయం, దేశీ సంప్రదాయం. మార్గ సంప్రదాయంలో మొత్తం ఛందోబద్ధమైన పద్య కవిత్వం, పండిత భాష ఉంటే, దేశీ సంప్రదాయంలో రాగయుక్తమైన సరళ పదాలతో ఉంటుంది. ఇది మౌఖిక సంప్రదాయం. ఇక లిఖిత సంప్రదాయం అయితే రాసుకుంటూ పోతారు గనుక రాగం అక్కరలేదు. మౌఖిక సంప్రదాయంలో పదాలను గుర్తు పెట్టుకోవడానికి రాగం అవసరం. గుర్తుండాలి అంటే అది పాట రూపంలో ఉండాలి. గాన యోగ్యత ఉండాలి. లయాత్మకత ఉండాలి.

తెలంగాణ ప్రజల జీవనశైలి సరళంగా ఉండడం, కాంప్లెక్సిటీని ఇష్టపడకపోవడం, అక్షరాస్యత పరంగాగానీ, పాండిత్యపరంగా గాని అంతగా ముందంజలో లేకపోవడం...... వీటన్నింటి కారణాల వలన పాట ప్రజల్లోకి వెళ్ళిపోయింది. మిగతా కవిత్వం అంతగా వెళ్ళలేదు. ఇప్పటికి కూడా ఆ అంతరం ఉంది. ఇది ఒక్క తెలంగాణలోనే కాదు తమిళం, కన్నడం, గుజరాతి, మళయాళం, బెంగాలీ భాషల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది.

విదేశాలలో చూస్తే చైనా, కొరియాలలో కూడా ఇంతే, కొరియా కవిత్వం కంటే కొరియా పాటలు చాలా పాపులర్. అమెరికన్ కవిత్వం కంటె అమెరికన్ పాటలు చాలా పాపులర్! మైకేల్ జాక్సన్ డేంజరస్, థ్రిల్లర్ అనే ఆల్బమ్‌లో చైల్డ్ లేబర్ మీద ఒక పాట రాసిండు అది ప్రపంచ వ్యాప్తంగా వెళ్ళిపోయింది. "బ్లాక్ ఆర్ వైట్" అనే పాట రాసి తానే పాడిండు. రంగుపరమైన వివక్ష ఎందుకు పెట్టుకుంటాము అనే సందేశంతో ఈ పాట రాస్తే కొన్ని బిలియన్ల ప్రజలకు వెళ్ళిపోయింది. అదే అమెరికన్ కవిత్వం ఎంతమందికి చేరుకుంది? ఒకవేళ చేరుకున్నా అది బిలియన్లలోకి చేరుకోలేదు. ప్రతిభాషలో, ప్రతి సాహిత్యంలో కూడా ఈ అంతరం ఉంది. దేని స్థానం దానిదే. ఏదీ తక్కువ గాదు. ప్రక్రియలు వేరు కాబట్టి ఎలా పోలికలు చెబుతాం? అలాగే రెండు కవితల మధ్య కూడా పోలికలు చెప్పడానికి లేదు. ఇద్దరు కవుల కవితల మధ్య మాత్రమే కాదు.. ఒకే కవికి చెందిన రెండు కవితల మధ్య కూడా పోలికలు, తేడాలు, పరిశీలనలు చేయలేము. ఎందుకంటే కవిత దేనికదే ఇండిపెండెంట్.... దేనికదే ఒక స్కేల్..! అయినా మనం ప్రయత్నం చేస్తాము. ప్రయత్నం మాత్రమే చేస్తాము.

ఏ కవితకు ఆ కవితే Special, Unique, Different! ఎందుకంటె వస్తువులు వేరు! వస్తువులు వేరైనపుడు ఒక కవితలోని నిష్టత, తీవ్రత, ప్రామాణికత, గాఢత, ఒక కవితలోని స్కేలుతో ఇంకో కవితను ఎలా కొలుస్తాం? ఏ కవితకు ఆ కవితకు Individual Identity ఉంటుంది. అలాగే, ఏ పాటకు ఆ పాటే ఓ Individual entity! అంతర్గతంగా కవితల మధ్యనే సారూప్యత లేనపుడు కవిత - పాత అనే వైవిధ్యమైన, వైరుద్ధమైన రెండు ప్రక్రియలను ఎలా పోలుస్తాం?


బతుకమ్మ మహాప్రదర్శ

Q

* *అన్నా, ఈ మధ్యలనే మీరు "పండగొత్తాందంటే సాలు" అనే పాట కూడా రాసింద్రు. ఇట్లనే మీరు తెలంగాణ వారసత్వాన్ని అందుకొని భవిష్యత్తులో పాట రాసే అవకాశం ఉందా?*

– నిజానికి అది పాట కాదు. ప్రసార భారతి ప్రతిసంవత్సరం ఒక భాషలో జాతీయ కవితను ఎన్నుకుంటే అలా 2019లో నా కవితను తెలుగులో ఎన్నిక చేసి "జాతీయ తెలుగు కవిగా" నన్ను పిలిచారు! ప్రతి కవి అదొక గౌరవంగా భావిస్తారు. 'పండగొత్తాందంటే సాలు' అనే కవిత పండుగ వస్తుందంటే తండ్రి పడే వేదన ఎట్లుంటదో చెప్పిన కవిత. దానికి మంచి పేరొచ్చింది. "పండుగొత్తాందంటే సాలు దునియాల లేని హైరానా పడుతడు మా నాయిన" అని ఆ కవితను తెలంగాణ భాషలో రాసుకున్న. చరణ్ అర్జున్ అనే తమ్ముడికి ఈ కవిత నచ్చింది. చరణ్ అర్జున్ చాలా మంచి క్రియేటివిటీ ఉన్నవాడు. మంచి మ్యూజిక్ కంపోజర్.

"ఈ కవిత నన్ను కదిలించింది. నీవు పర్మిషన్ ఇస్తే ట్యూన్‌గా చేసి పాడుకుంటా" నన్నడు. నీ ఇష్టం తమ్ముడు ఫరవాలేదని చెప్పిన. లయాత్మకతకు తగినట్టుగా జోడించుకొని పాటలాగ కంపోజ్ చేశాడు. మళ్ళీ ఇంతకు ముందుకు చెప్పుకున్నట్టు పాటనా, కవితనా ఏది ఎక్కువ చేరుకుంటది అంటే 100% పాటనే చేరుతుంది. నేను రాసిన కవిత కొన్ని వందల మందికి చేరి ఉండొచ్చు. కాని పాటగా వచ్చిన తరువాత కొన్ని లక్షల మందికి చేరింది. దానిలో ఉన్న సౌలభ్యం ఏంటంటే లయాత్మకత! కవిత అయితే ఆ వాక్యాలను

బట్టీ పట్టాలి. గుర్తు పెట్టుకోవాలి. పాటలో అయితే ట్యూన్‌తో పాటు కలిసి ఉంటుంది. గనుక జ్ఞాపకం పెట్టుకోవడానికి ఈజీగా ఉంటుంది.

పాటలు రాద్దామనే ఆలోచన ప్రస్తుతానికైతే లేదు. పరిస్థితి వస్తే చెప్పలేం. ఫిక్స్‌డ్ ఫ్రేములో పెట్టుకొని నిర్దిష్టంగా ఇలాగే ఉంటానని మొదటి నుంచి కూడా నేను లేను.

Q

- ***తెలంగాణ భాషా పదాలతో పాటు ఉర్దూ, హిందీ భాషా పదాలు, హైదరాబాది తత్వం మీ కవిత్వంలో కనిపిస్తుంటది. దీని గురించి ఏమంటరు అన్నా?***

**–** తెలంగాణలో ఉండే ప్రతీ ఒక్కరికి ఉర్దూ అనేది జీవితంలో అంతర్భాగం. నాకూ అలాగే.! కుతుబ్‌షాహిల కాలం, ఆసిఫ్ జాహీలకాలం నుంచి కూడా ముస్లిం రాజులు మనలను పరిపాలించడం వలన మనకు తెలియకుండానే ఉర్దూ మన భాషలో సమ్మిళితం అయిపోయింది. ఉర్దూకు అతీతమైన తెలంగాణ భాష లేదు. అనివార్యంగా నా కవిత్వంలో కూడా అవి వచ్చాయి. హిందీ సాహిత్యం కూడా ఎక్కువ చదివాను. అందుకే హిందీ పదాలు కూడా కొంత వరకు వస్తుంటాయి.

Q

- **ఇప్పుడున్న చాలా మంది తెలంగాణ కవులకు ప్రభుత్వ కవులు అనే ముద్ర ఉంది. మీరు ఒక ప్రభుత్వంలో పనిచేస్తున్నప్పటికీ మీ మీద ప్రభుత్వ కవి అనే ఒక ముద్ర కంటె కూడా కళాకారుడిగానే పరిగణిస్తారు దీనిని మీరెట్లా భావిస్తారు?**

– నేనైతే బ్రాండింగ్‌కే వ్యతిరేకం. సోరెన్‌కీర్క్‌గార్డ్ ఒక గొప్పమాట చెబుతాడు. "No body is complete in this world. Every one is in the process of becoming'' ప్రభుత్వ కవులు, ధిక్కార కవులు ఇప్పుడే కాదు ప్రతి సందర్భంలో ఉన్నారు. నన్నయను మించిన ప్రభుత్వ కవి ఎవరున్నరు చెప్పు?

నా మాటలు కొంచెం చిత్రంగా అనిపించొచ్చు గాని రాజరాజ నరేంద్రుడిని ప్రస్తావించిన తీరుగాని, ప్రశంసించిన తీరు గానీ చూస్తే నన్నయ కన్న ప్రభుత్వ కవి ఎవరున్నారని అనిపిస్తది. నాకైతే ఏ Stampలు లేవు. బ్రాండింగ్‌లకు కాని, ఈయన ఫలానా అని నిర్ధారించడానికి నేను పూర్తి వ్యతిరేకిని.

ఈయన ప్రత్యేకంగా దళితవాద కవి అని, స్త్రీవాద కవి అని చెప్పడానికి నేను వ్యతిరేకం. మనిషిలో అన్నీ ఉంటాయి. పరిస్థితిని బట్టి, స్థల, కాల, న్యాయాలను బట్టి కవులు ఒక్కొక్క సారి ఒక్కొక్క కోణంలో తను భావావేశాన్ని వ్యక్తీకరిస్తారు. ఆ సందర్భంలో వారు ఒక వాదం వైపు ఎక్కువగా మొగ్గు చూపించవచ్చు. ఆ మొగ్గునే మనం వారికి 'బ్రాండింగ్' వేస్తాం. కానీ నా వ్యక్తిగత అభిప్రాయం అయితే కవులు ఉంటరు, కవిత్వం ఉంటుంది అంతే.

# Q

- ***అన్నా, మీ మొదటి రెండు పుస్తకాలకు మీరే చిత్రాలు గీసుకున్నరు. ఫాంటింగ్ డిజైనింగ్ కవర్ పేజి అంతా మీదే, వాటి అనుభవం ఎట్లుంది? మీరు విద్యార్థిదశలో రాసిన కవితలను చేతిరాత తోటి ఎట్లుందో అట్ల వేసింద్రు. మళ్ళీ ఒక 30 ఏండ్ల తరువాత చూసుకున్నపుడు మీకు కలిగిన అనుభూతి ఎట్లాంటిది?***

– చాలా గొప్ప అనుభూతి తమ్ముడూ! నేను ఇష్టం కొద్ది కొంత తెలుసుకున్నాను. పుస్తకం అంటే చాలా ప్రేమ నాకు. నన్ను నేను 'పుస్తకం చెక్కిన మనిషిగా' భావిస్తాను. వ్యక్తుల కంటే కూడా పుస్తకాలనే నా గురువులుగా భావిస్తాను. పుస్తకం మన బ్రెయిన్ చైల్డ్. అందుకని పుస్తకాన్ని వేసేటపుడు అపురూపంగా ఉండాలని అనుకుంటాను.

కవిత్వంలో మాత్రమే కాదు డిజైన్‌లోగాని, లే అవుట్‌లో గాని మొత్తం నేను కనిపించాలి. నేను ఆవిష్కృతం కావాలి. లక్కీగా వాటి గురించి నాకు తెలుసు. నేనొక మంచి పెయింటర్‌ని! స్క్రిప్ట్ రైటర్‌ని! ఇవన్నీ నాకు తెలుసు కాబట్టి వాటిని ఎందుకు సద్వినియోగం చేసుకోకూడదు అనుకున్నాను.

అందరి మార్గంలో నేనెందుకు వెళ్ళాలి. నాకొక మార్గం ఉంది కదా అని నా పుస్తకాన్ని నేను డిజైన్ చేసుకున్నాను.

'ఊరికిపోయిన యాళ్ళ' కవర్ ఫోటో మాత్రం ఏలే లక్ష్మణ్ గారి

పెయింటింగ్. తలకు చేతులు వెనక్కి పెట్టుకునే దృశ్యం అది. ఎందుకది నచ్చింది అంటే ఊరికి పోవడం అంటేనే ఒక రిలాక్సేషన్. ఊరికి పోయిన వాళ్ళకు రిలాక్స్‌గా ఉంటుంది. కానీ ఊర్లో ఉన్న వాళ్ళైతే నిత్య పోరాటం. చేయాల్సిందే.. పొద్దుగాల లేవాలి, గొర్లను కొట్టుకొని పోవాలి. వ్యవసాయ పనులకు పోవాలి. లేకపోతే కూరదెచ్చుకోవాలి. అంగడికి పోయి రావాలి. ఇదంతా ఒక పోరాటం.

ఎక్కడో వేరే చోట బతుకుతూ తన ఊరికి పోయినపుడు విలాసం, వినోదం, వికాసం ఉంటాయి. ఆ భావనను చెప్పగలిగిన చిత్రం లక్ష్మణన్న పెయింటింగ్‌లో కనిపించింది. అయితే దాని టైటిల్ ఫాంట్ మాత్రం నేను రాసిందే.

2019లో 'ఒంటరీకరణ' వేసేటపుడు కవిత్వం మాత్రమే కాదు లోపలంతా నేను ఉండాలి అనుకున్నాను. డ్రాయింగ్‌కు సంబంధిన అన్ని అంశాలు వచ్చు కదా. దాని కవర్ పేజి డిజైన్ కూడా మార్మికంగా తెలియజేసే Abstract Art లో వేసాను. క్రెయాన్స్‌తో చేసిన వర్క్ అది. దానినే కవర్ పేజీగా వేశాను.

'ఒంటరీకరణ' అనే పదం ఫస్ట్ కాయినేజ్! అప్పటిదాకా తెలుగు భాషలో లేనిపదం. జాతీయాకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ పదాలు కూడా క్రమంగా ఏర్పడ్డాయి. ఒంటరితనం కూడా 'కరించ బడుతుంది.' ఆవృతమై పోతుంటది. అలాంటి భావనను చెప్పడానికి 'ఒంటరీకరణ' అని అన్నాను.

ఇక 'సుషుప్తి నుంచి' పుస్తకానికి ఇంకొక ప్రత్యేకత ఉంది. కవర్‌పేజి డిజైను నుంచి లోపలి స్క్రిప్ట్ కూడా నా హ్యాండ్ రైటింగ్‌నే తీసుకున్న. ఇప్పటి హ్యాండ్ రైటింగ్ కాకుండా **1986-89**లో నేను ఏ లేపాక్షి నోట్ బుక్‌లో అయితే రాసుకున్నానో అదే హ్యాండ్ రైటింగ్‌ని ఉన్నది ఉన్నట్లు వేశాను.






ఆశాదీపం
కథానికల సంకలనం
HIV / AIDS పై రచయిత్రుల సాహితీ సమారోహం



# Q

- **ఇది ఒక గొప్ప ప్రయోగం అనిపిస్తుంటది అన్నా. ఇలాంటి సంకలనాలు తక్కువ వచ్చి ఉంటాయి. సుధామ లాంటి వాళ్ళు వాళ్ళ దస్తూరితో వేసినారని విన్నాను.**

– అందరిలాగే మొదట నేను డి.టి.పి చేయించాను డి.టి.పి చేయించినంక నా ఆలోచన ఏమిటంటే మంచో చెడో, తప్పో ఒప్పో ఇవి నా తొలి అడుగులు. Maturity ఉండొచ్చు లేకపోవచ్చు. కవిత్వమా? అకవిత్వమా? ఏదో తెలియదు. అది మాత్రం ప్రపంచానికి తెలియాలని As it isగా వేశాను. అదే లేపాక్షి నోట్ బుక్‌లో నేను వేసుకున్న బొమ్మలు కూడా ఉన్నాయి. వాటిని కూడా యధాతథంగా అలాగే ఈ సంకలనంలో చేర్చాను.

Q

- ***మీ కలం పేరు 'తపస్వి' అనే పేరు కూడా వాటిలో కనిపిస్తుంటది కదా అన్నా!***

– అవును, ఆ తపస్సు, ఆ యోగం, ఆ ఋషిత్వం పట్ల మొదటి నుంచి నేను సానుకూలం. మొదట్నించీ  నాకు చాలా అంశాలపట్ల అనురాగం లేదు. వైరాగ్య భావనే ఉండేది. నాకు 'విరాగి' అనే పేరంటే చాలా ఇష్టం. పెద్ద బాలశిక్షలో తెలుగు ఉగాదుల్లో సంవత్సర నామాల్లో 'విరాగి' నామ సంవత్సరం అని 60 పేర్లలోని ఒక పేరుని చూసినప్పుడు నాకు సంభ్రమాశ్చర్యాలు కలిగాయి. కొన్ని పదాలు నచ్చుతుంటయి. ఎందుకు నచ్చుతుంటాయో తెలియదు అలాంటి వాటిలో ఇది ఒకటి.

నిరంతర తాపసికి లక్ష్యం తెలీదు. గమ్యం తెలీదు. గమనం తెలీదు. అందుకే తపస్వి అని అప్పుడు పెట్టుకున్న! తర్వాత తర్వాత మళ్ళీ అనిపించింది తపస్వి ఎందుకు? మనకు అమ్మ నాన్నలు పెట్టిన పేరుంది కదా అనిపించింది. మొదట్లో నేను రాసినపుడు కూడా  బాలసాహిత్యం లిఖిత పత్రిక చేసినపుడు ఎడిటర్ అనే పేరులో ఎం. స్వరాజ్య హరి సుదర్శన్ అని పెట్టుకునేది. మా అమ్మ పేరుండాలి మా నాన్న పేరుండాలి. మధ్యలో నేనుండాలి అనే కాంక్షతో అలా పెట్టుకున్న.

Q

- **వెస్టర్న్ లిటరేచర్‌ను మీరు చాలా విస్తృతంగా చదువుకున్నరు. వెస్టర్న్ లిటరేచర్‌ను చదువుకున్న వాళ్ళు క్రిటిసిజం వైపు ఎక్కువ వస్తుంటరు. అయితే దానికి భిన్నంగా సినిమాల మీద విమర్శ రాసిండ్రు గాని కవిత్వం మీద విమర్శ రాయలేదు. దీనికి ప్రధానమైన కారణం ఏదైనా ఉందా?**

– Literary criticism అండ్ Film criticism ఈ రెండు అంశాలలో లిటరరీ క్రిటిసిసమ్ వైపు నేనెందుకు వెళ్ళలేదంటే లిటరరీ World లో నేను సృష్టించాలి! My Intention is to create the things in literature! ఇక సినిమాల విషయానికి వచ్చేసరికి సినిమా Creation అనేది నా ఒక్కడితో ముడిపడిలేదు. సినిమా అనేది టీం వర్క్. అన్నీ కుదరాలి. కెమెరా నుంచి మొదలుకొని ఎడిటింగ్ వరకు అంటే Pre-production నుంచి Post - production వరకు, Distribution, Theatre Exhibition వరకు ఇవన్నీ వేరు వేరు దశల్లో జరిగేవి.

ఇక సినిమా విషయానికి వచ్చేసరికి.... లిటరేచర్‌ని ఎంత విస్తృతంగా చదివానో, World cinema ని కూడా అంతే అధ్యయనం చేశాను. నాకున్న forte, World literature and world cinema! హాలీవుడ్‌కు మాత్రమే పరిమితం కాకుండా, ఇరానియన్, యూరప్, జర్మన్, కొరియన్, ఇటాలియన్, స్పానిష్, జపనీస్, చైనీస్, డానిష్, మెక్సికన్ సినిమాలను విస్తృతంగా చూశాను. వాటి మీద పరిచయం, విమర్శ రాశాను. Analysis రాశాను. ఎందుకంటే అక్కడ విమర్శ చేయడానికి కావలసినవన్నీ సమకూర్చుకున్నాను.

ఇక సాహిత్యం విషయానికొస్తే, ఇక్కడ నేను Litrerary Criticism పైన Concentrate చేయడం కంటే నేను సృష్టించాల్సిన బాధ్యత నాకుంది. రెండవది ఏంటంటే నాలోని లోలోపలి మాటల్ని చెప్పుకోవాలె,! చాలా చెప్పుకోవల్సి ఉంది. నేను చెప్పుకోవాలనుకున్నపుడు నేను ఇతరులను కామెంట్ చేయడం కంటె నా First hand impressions, First hand experiences, First hand emotions నేను చెప్పాలి! అందుకే కవిత్వాన్ని, కథల్ని రాస్తూ వెళ్ళాను తప్ప సాహితీ విమర్శ వైపు ఎక్కువగా దృష్టి పెట్టలేదు. అయితే సాహితీ విమర్శ కంటె కూడా సంపాదకీయాలు చాలా రాశాను. సంపాదకీయాలు రాస్తున్నపుడు దాంట్లో ఒక నేపథ్యం, ఆ కవిత్వం, సాహిత్యం లోతుల గురించి ప్రపంచ సాహిత్య ధోరణులను అన్వయిస్తూ, తులనాత్మక దృష్టితో వివరిస్తూ ఒక మినీ థీసిస్‌లా రాశాను. అంత విస్తృతంగా అధ్యయనం చేసి రాసిన సందర్భాలు నా ప్రతి సంపాదకీయంలో ఉన్నాయి. అది Analysis తప్ప విమర్శ మాత్రం కాదు. There is a lot of difference between analysis and criticism.




Centenary
Celebrations

Q

- **సినిమాల మీద రాసిన వ్యాసాలకు నంది అవార్డులు రావడం కూడా సంతోషం అనిపించిందన్నా (నవ్వుతూ) అవార్డుల విషయం వచ్చింది కాబట్టి అడుగుతున్న. బయట మీకు పెద్ద సాహిత్య ప్రపంచం ఉంది. రాజకీయ ప్రపంచం ఉంది. మీరు అవార్డుల వైపు ఎందుకు మొగ్గు చూపలేదు. అంటే అవార్డులు ఒకవేళ వచ్చినా మీరు తిరస్కరించిండ్రా?**

- అవార్డులనేది ఎవరికైనా కూడా ఒక Encouragment! It's a Recognition, It's an Honour. నేను నిష్కామ కర్మను నమ్ముతాను. ఇక్కడ నాది Philosphical approach! మనం ఏదైతే నమ్ముకున్నామో ఆ మార్గంలో వెళుతూ నిరంతరం పనిచేస్తూ వెళ్ళిపోవడమే. ఇప్పటి వరకు ఫలితాలు ఆశించకుండా చేస్తూ వచ్చాను. నా జీవన తాత్వికత కూడా అదే. నా పని నేను చేస్తూపోతున్న క్రమంలో మనకు ఎవరైన Honour గా గుర్తించి నా కంట్రిబ్యూషన్ బాగుంది అని ఇస్తే అది ఎవరికైనా గొప్పదే.

తెలుగు సినీ విమర్శకుడిగా అందుకే మూడు నంది అవార్డులను స్వీకరించాను. అవి ఉమ్మడి రాష్ట్రపాలనలో తెలంగాణ ఉద్యమం ఉధృతంగా ఉన్న సమయంలో వచ్చాయి. నేను కూడా తెలంగాణ అస్తిత్వాన్ని చెప్పాలనే కాంక్షతో ఉన్నాను. ఈ అవార్డులను తెలంగాణ అత్మను చెప్పే అవకాశంగా మలుచుకున్నాను. తెలంగాణలో సినిమా లేదు అనీ, సినిమాల్లో తెలంగాణ అవహేళనకు గురౌతున్న సందర్భాలను అందరితోపాటు నేనుకూడా చూశాను. తెలంగాణ విషయంలో ప్రజల ఆకాంక్షలను, దుఃఖాన్ని కూడా చూశాను.

అందుకే **2009**లో నంది అవార్డు వచ్చినపుడు ఆ పురస్కారాన్ని అమ్మకు, తెలంగాణకు అంకితం చేశాను. రెండవసారి అవార్డు వచ్చినపుడు మా జిల్లాకు అంకితం చేశాను. తెలంగాణ ఉద్యమ వీరులకు అంకితం చేశాను! I feel that, it is also one way of expressing my solidarity towards the telangana cause.

ఒక Cause కోసం నేను వ్యక్తం చేయడానికి ఆ అవార్డు ఒక మార్గంగా భావించాను. అందుకే దానిని స్వీకరించి తెలంగాణకు అంకితం చేస్తున్నానని వేదిక మీద చెప్పాను.

అయితే వ్యక్తిగతంగా అవార్డులకు సాధ్యమైనంత వరకు దూరంగానే ఉంటాను. నిజంగా ప్రామాణికమైనవి, అయితేనే అంగీకరిస్తాను.

**1956** నుంచి భారత ప్రభుత్వ Ministry of Information and Broad casting డిపార్ట్‌మెంట్ వాళ్ళు ప్రతిష్టాత్మకంగా ఇస్తున్న ఒక అవార్డు 'National poet'

భారతీయ భాషల్లోంచి ప్రతి సంవత్సరం ఒక్కొక్క కవిని ఎంపిక చేసి National poet గా ఆహ్వానిస్తారు. **2020** సంవత్సరానికి గాను నన్ను గుర్తించి ఆహ్వానం పలికారు. అక్కడికి వెళ్ళి "పండుగ" అనే కవితను చదివాను ఈ కవిత గురించి ఇంత క్రితమే చెప్పుకున్నాం. దీనిని కూడా ఎందుకు వాడుకున్నానంటే, తెలంగాణ భాషను మాండలికంగానే చూస్తున్న క్రమంలో ఈ కవిత ఎంపిక అవడం అంటే తెలంగాణ భాషకు యావత్ దేశం, ప్రపంచం గుర్తింపు ఇచ్చినట్లే! పైగా ఆ కవిత భారతరాజ్యాంగం గుర్తించిన **24** భాషలలోకి అనువదించబడి జనవరి **26,2021** నాడు దేశంలోని అన్ని ఆకాశవాణి కేంద్రాలలో ప్రసారం అయింది. అందుకే నేను ఒక అవార్డు అంగీకరించాను అంటే ఖచ్చితంగా దాని వెనుక నా వ్యక్తిగత ప్రతిష్టకన్నా ఒక విస్తృత సామాజిక ప్రయోజనం ఉండాలని భావిస్తాను.


RITY OF TELANGANA STATE
ZEE CINE
AWARDS
TELUGU 2018



Q

- హైద్రాబాద్ మీద కవిత్వం రాసినవాళ్ళను చూసినపుడు చాలా మంది హైద్రాబాద్‌ను తిడుతూనో, హైద్రాబాద్ జీవితం మీద విరక్తి పడుతూనో రాసినవాళ్ళు ఉన్నరు. కాని హైద్రాబాద్‌ను మీరు ఒక "పెద్దమ్మ" అని చెప్పింద్రు. యాకూత్‌పుర మీద కూడా ఒక కవిత రాసింద్రు. హైద్రాబాద్‌తో, యాకుత్ పురాతో మీకున్న అనుబంధం ఎలాంటిది అన్నా?

– నా పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఉస్మానియా యూనివర్సిటీలో జరిగింది. అప్పటి నుంచీ ప్రత్యక్షంగా హైదరాబాద్‌తో ఒకలాంటి ప్రత్యేక అనుబంధం. ఇది 1992 నుండి 1996 వరకు ఆ తర్వాత కోపరేటివ్ డిపార్ట్‌మెంట్‌లో ప్రభుత్వ ఉద్యోగంలో చేరినప్పుడు ట్రెయినింగ్ రాజేంద్రనగర్‌లో చేసాను. అలా 1992 నుండి 1997 వరకు హైదరాబాద్‌తో అనుబంధం ఏర్పడింది. ఆ తర్వాత వరంగల్‌కు పోస్టింగ్ రావడంతో అక్కడకు వెళ్ళిపోయాను.

నేను 2002లో వరంగల్ నుంచి తిరిగి హైద్రాబాద్ వచ్చాను. సాధారణంగా వరంగల్ ఏరియా నుంచి వచ్చేవాళ్ళు ఉప్పల్, రామంతపూర్ ఏరియాలలో ఉండటానికి ఇష్టపడుతారు. నల్గొండ నుంచి వచ్చేవాళ్ళు ఎల్.బి నగర్, దిల్‌సుఖ్‌నగర్‌లలో ఉండడానికి ఇష్టపడుతారు. కరీంనగర్, నిజామాబాద్ నుండి వచ్చేవాళ్ళు ఆల్వాల్, తిరుమలగిరి, సుచిత్ర వంటి ఏరియాలలో

ఉండటానికి ఇష్టపడతారు. వాళ్ళు వచ్చే రోడ్డుకు అనుకూలంగా ఉండే ఏరియాలలో ఉండడానికి ఇష్టపడుతారు. అంటే వారి నేటివ్ ప్లేస్‌కు దగ్గరగా ఉన్నామనే సైకలాజికల్ Bonding దీనికి కారణం. అంటే వారికి హైదరాబాద్ కావాలి. అలాగే వారి మాతృ ప్రదేశంతో అనుబంధం కొనసాగాలి. ఈ రెండు జరగాలనే వాంఛలోంచే ఇలా ప్రదేశాల ఎంపిక జరుగుతుందని నేను అనుకుంటాను.

కాని నాకు మొదటి నుంచి కూడా హైద్రాబాద్ ఓల్డ్ సిటీ లైఫ్ ఇష్టం. ఎందుకంటే అది ఒరిజినల్ city. హైద్రాబాద్‌లో పాతబస్తీ జీవితం ఎలా ఉ ంటది? నగర జీవితం తాలుకూ ఆ Originality, వైవిధ్యత ఏమిటి? అక్కడ గజల్స్ ఉన్నాయి. ముషాయిరాలు ఉన్నాయి. ఒకప్పుడు గానాబజానాలు ఉన్నాయి. సూఫీ సంగీత్ ఉంది. దక్కనీ థియేటర్ ఉంది. వీటన్నింటితో కూడిన వైవిధ్యమైన జీవన తాత్వికతతో హైద్రాబాద్ ఉంది. వరంగల్ నుంచి హైద్రాబాద్ వచ్చినపుడు యాకూత్‌పురలో ఒక సంవత్సరం ఉన్నా! ఇస్లామియా కాలేజి నుంచి రైల్వేస్టేషన్, డబీర్‌పురా, చంచల్‌గుడా, సంతోష్‌నగర్ వరకు తెలుసు.

ఆ జీవితాన్ని చూశాను. అది ఎంతో అద్భుతమైన జీవన సౌందర్యం!

ఒకరోడ్డు మీద గీత గీసినట్టు గీతకు ఒక వైపు బ్రాహ్మణ వాడి, మరొక వైపు ఇస్లాం ప్రజలు ఉంటరు. వాళ్ళిద్దరు ఒక అద్భుతమైన సహజీవన సౌందర్యాన్ని గడుపుతుంటరు. ఎవరి ధర్మాన్ని, దార్శనికతను, మార్మికతను వాళ్ళు వ్యక్తం చేస్తుంటరు. ఇదొక మిస్టిసిజం! ఇప్పటికీ ఆశ్చర్యం అనిపిస్తది. అటు వైపు చూస్తే బీఫ్ షాపులు కనిపిస్తుంటవి ఇటువైపు చూస్తే సాంబ్రాణి, పూలదండలు కనిపిస్తుంటవి.

గీతకు అవతల ఒకలాంటి జీవన విధానం, ఇవతల మరొకలాంటి జీవన విధానం. ఏ మాత్రం సంబంధం లేని రెండు రకాల జీవన వైవిధ్యతలు ఒకే రోడ్డుకి ఇరువైపులా సహజీవనం చేస్తున్నాయి. ఈ వైవిధ్యత నన్ను బాగా ఆకట్టుకుంది. వరంగల్ నుంచి వచ్చి మొదట ఒక సంవత్సరం పాటు యాకుత్‌పురాలో ఉండటం వల్ల ఆ ఏరియాతో ఒక ప్రత్యేక అనుబంధం ఏర్పడింది. అందుకే 'యాకూత్‌పురాణ శకలం' అనే కవిత రాసిన. వాళ్ళ జీవన విధానాన్ని ఒక డాక్యుమెంటరీలాగ చూపించాను.

చాలా మంది మీద నాదొక complaint ఏమిటంటే ఊరు గొప్పది, ఊరు గొప్పది అంటరు. అందులో No doubt! అమ్మ ఎప్పటికైనా గొప్పదే. At the same time.. మన ఎదుగుదలకి, మన రెక్కలు విస్తరించడానికి దోహదపడిన అమ్మగాని, పెద్దమ్మగాని ఇంకెవరైనా గాని వాళ్ళు కూడా గొప్పోళ్ళే అని నా అభిప్రాయం. వాళ్ళ గొప్పతనాన్ని కాదనలేము కదా.

చాలా మందికి ఒక ఫ్యాషన్ ఏమైపోయిందంటే నగరాన్ని తిట్టడం, నగరానికి రాంగనే ఏలియనేషన్ అయిపోయాము. అస్తిత్వాన్ని పోగొట్టు కున్నామని చెబుతూ చాలా కవితలు వచ్చాయి. చాలా సాహిత్యం అట్లనే పుట్టింది.

కాని నగరం మనకి అన్నీ ఇచ్చింది. ఉండడానికి, ఎదగడానికి మనకుఎన్నో అవకాశాలు ఇచ్చింది. మనకు డ్రస్సునిచ్చింది. అడ్రస్సునిచ్చింది ఈ నగరమే.! నగరమనగానే ధ్వంస సంస్కృతిలాగనే భావించడం అనేది ఎందుకొచ్చిందో తెలియదు. నగరజీవనం అనగానే ఎవరికెవరు పట్టించుకోరు, ఇక్కడికి డబ్బుల కోసమే వస్తరు అని ఒకలాంటి భావనను ఫ్రేము చేసుకుంటూ వచ్చినం. అలాంటపుడు ఎందుకుండడం ఇక్కడ? ఇక్కడి సౌకర్యాలు అన్నీ కావాలి. ఇక్కడుండే పేరు ప్రతిష్ఠ, గౌరవం అన్నీ కావాలి. కానీ రచనలో, సృజనలలో మాత్రం నగర జీవనం అంటే మాత్రం విసుగు, వ్యతిరేకత, అభ్యంతరం వ్యక్తం చేస్తాం. ఇది ఎందుకో నాకు అర్థం కాలేదు. బహుశా ఇదొక గమ్మత్తయిన psychological dichotomy అనుకుంటా. నాతో సహా!

ఊరికి వెళితే గొప్పగా ఉంటుంది. అమ్మ పిల్చినట్లు ఉంటుంది. అని అంటరు. ఇక్కడ ఏదో మిస్సింగు అవుతున్నం అని అంటూ, ఏదో హిపోక్రసిలో ఉంటున్నామేమోనని నా భావన! అందుకే పట్నాన్ని Pre-conceived notion లేకుండా, Pre-Judice కు తావివ్వకుండా Pre-Occupied Opinion లేకుండా సరిగ్గా వాస్తవంగా ఎట్లా చెప్పాలి అనుకున్నపుడు పట్నం "పెద్దమ్మ"గా నాకనిపించింది. ఆమె కూడా అమ్మనే. కానీ పెద్దమ్మ అని అనిపించింది.

ఇప్పటిదాకా చాలా మంది పల్లెతల్లిలాంటిది, పట్నం ప్రియురాలి లాంటిదని అంటరు! పల్లెతల్లి నీ కడుపు చూస్తుంది, ప్రియురాలు నీ జేబు చూస్తుంది, అని చెప్పుకుంటూ వచ్చారు. కొత్త కోణంలోంచి చూస్తే తప్ప కొత్తగా చెప్పడం రాదు. ముందు మన దృష్టిలో కోణం మారాలి.

హైదరాబాద్‌కు వచ్చిన ప్రతీ ఒక్కరు గాయాలతో వచ్చినవారే. ఆ

గాయాలకు మలాం పూసింది, ఆ గాయాన్ని తగ్గించింది. మళ్ళీ నిలబడి పరిగెత్తేలా చేసింది ఈనగరమే. అలాంటప్పుడు సిటీలైఫ్‌కి థ్యాంక్స్ ఎందుకు చెప్పకూడదు? Thankless గా ఎందుకుండాలి. ఈ ఒక్క వేదనలోంచే పట్నం పెద్దమ్మ అని నేను భావించిన!

పెద్దమ్మింటికి ఎపుడు పోతం? వినోదం కోసం, వికాసం కోసం మరింత విస్తరించడం కోసం, ఎదగడం కోసం మనం పెద్దమ్మింటికి పోతం. అందుకని పల్లె మన అమ్మయితే పట్నం ఖచ్చితంగా మన పెద్దమ్మనే అని నేను భావించి అప్పటి దాకా ఉన్న పట్నం ప్రియురాలు అనే Concept నుంచి పట్నం ను పెద్దమ్మగా చూసాను.

సమాజమనే తల్లికి ఇద్దరు బిడ్డలు ఒకరు పల్లె! ఇంకొకరు పట్నం!! ఇదొక కొత్త కోణం.

మన సాహితీ లోకంలో గతంలో పట్నాన్ని పెద్దమ్మలాగ ఎవరు ట్రీట్ చేయలే . ప్రేయసిలాగానో, జవరాలుగానో ట్రీట్ చేశారు తప్ప అమ్మ స్థానమిచ్చి మాత్రం ఎవరూ గౌరవించలేదు అనే అనుకుంటాను. అది నేను చేశాను. ఎందుకంటే నాకు అమ్మలాగనే అనిపించింది. అందుకే హైదరాబాద్ మీద చాలా కవితలు రాసిన.





Q

- **మీ కవిత్వం చదివినపుడు నాటకీయ శైలి, కథనాత్మక శైలి కనిపించింది. ఇతర కళల పట్ల ప్రవేశం ఉండడం వలన ఈ శైలి వచ్చిందా? లేకపోతే వెస్టర్న్ లిటరేచర్‌ని చదువుకోవడం వలన ఈ శైలి వచ్చిందా? లేక ఒక కవితను రాస్తున్నపుడు ఆ ఉద్వేగంలోంచి వచ్చిందా!**

– ఇప్పుడు నీవు చెప్పినవన్నీ కరెక్టే. వస్తువును బట్టి శైలి ఎంపికౌతుంది, శిల్పం ఎంపికౌతుంది. నాక్కూడ జరిగిందదే.

ప్రపంచ సాహిత్యంలో నాటకీయ శైలి కొంత ఉంటది. సంవాద శైలి ఉంటది.

అలా అని నేను రాసిన కొన్ని కవితలలోని శైలికి పూర్తిగా Western style of literature ప్రభావం అని చెప్పడానికి ఏం లేదు, ఇండియన్ లిటరేచర్ కూడా అట్లాగే ఉంటది. ప్రాచీన సాహిత్యాన్ని చూస్తే గనుక సంవాద శైలిలోనే కవిత్వమంతా నడుస్తది. జానపద సాహిత్యంలో కూడా బావా మరదళ్ళ సంభాషణే ఒక సంవాదంలాగ సాగిపోతుంటది. ఇవన్ని మన మూలాలే.

కవిత్వమంటే ఇట్లనే చెప్పాలె అనే ఒక ఫ్రేములో మనం ఫిక్స్ అయినము. దానివల్ల ఏర్పడ్డ అభిప్రాయం అనుకుంటాను! అంతే తప్ప Think beyond అని మర్చిపోయినమేమో. కొన్ని కవితల్ని First person లోనే చెబుతాం, కొన్ని సంవాద శైలిలో చెబుతాం. కొన్నింటిని స్టేట్‌మెంట్స్‌లాగ చెబుతాం.

వేరు వేరు శిల్పాలను ఎంచుకోవడం వెనుక మొదటి కారణం మాత్రం

కవితా వస్తువే! ఆ వస్తువును అలా చెబితేనే బాగుంటుంది. ఇంక ఏ రకంగా చెప్పినా మనసు లోపలికి వెళ్ళదు. రెండవ కారణం విస్తృతమైన అధ్యయనం! జాతక కథలు, వినయ, సుత్త, అబిధమ్మ పీఠికలు నుంచి మొదలుకొని జైనసాహిత్యం, ఏంగిల్స్, కారల్ మార్క్స్, సిగ్మండ్ ఫ్రాయిడ్, ఆగస్టు కోమ్టే, చార్లెస్ డార్విన్, ఇలా ఎందరినో చదివా. వాటిలో కూడా సందర్భాన్ని బట్టి శైలి, శిల్పం ఉంటాయి.

గ్రీక్ "ఇలియడ్"లో, ప్లేటో 'రిపబ్లిక్' లో, జిడ్డు కృష్ణమూర్తి రచనల్లో కూడా సంవాదశైలి కనబడుతది. అలాగే మన భారతీయ సాహిత్యంలో, తెలుగు సాహిత్యంలో కూడా కనిపిస్తది.

నేను ఏ కవితనైతే ఎంపిక చేసుకున్నానో, ఏ భావనను వ్యక్తం చేయాలని అనుకుంటున్నానో దానికి ఏ శిల్పం అయితే బాగుంటుందని అనుకుంటానో దానిలో వ్యక్తం చేస్తు వచ్చాను.

ఇక నా కవితల్లో కొంత నాటకీయ శైలి వచ్చింది అని అంటే, దానికి సినిమాల ప్రభావం కూడా కొంత వరకు కారణం. సినిమాల్లో presentation అనేది కళ్ళకు కట్టినట్లు చెప్పాలనే భావన ఉంటుంది. గనుక అనివార్యంగా అది కవిత్వంలోకి కూడా వచ్చి ఉంటుంది. మరో మాటల్లో చెప్పాలంటే నేను కవితావస్తువును, కవితను అమ్మ చెప్పే కథగా భావిస్తాను.

# Q

- **అన్నా! మీ 'సుషుప్తి నుంచి' 'ఒంటరీకరణ' కవిత్వం చదివినపుడు సంక్లిష్టంగా అనిపించింది. అదే 'ఊరికి పోయిన యాళ్ళ' చదివినపుడు చాలా సరళంగా అర్థం అయ్యింది. ఏ కవిత్వమైనా సరళతరం కావలసిన అవసరం ఉందా? సంక్లిష్టత ఎందుకు అవసరం?**

– ఇక్కడ కూడా మళ్ళీ మనం చెప్పే వస్తువును బట్టే ఉంటుంది. కొన్ని భావాలు, ఉద్వేగాలు చెప్పడానికి సరళత అవసరం! కొన్నింటికి ఖచ్చితంగా పాండిత్యం అవసరం!

పాండిత్యం అంటే మన అధ్యయనం! ఉదాహరణకు 'ఒంటరీకరణ' అనే కవిత ఉంది. దాంట్లో 'యూంగ్' అని సంబోధిస్తూ రాసిన. అది కార్ల్ గుస్తావ్ యూంగ్ అనే సైకాలజిస్ట్‌ను ఉద్దేశించినది. 'అంతర్లోకం' కవితలో 'కె' అని సంభోదిస్తూ రాసిన. 'కే' అని జిడ్డు కృష్ణమూర్తిని అంటరు. ఇక్కడ జె.కె ఫిలాసఫీని చెప్పాల్సి ఉంది కనుక ఆయన పేరును సంబోధించాను. ఆయన "ఆలోచనా రాహిత్యం కూడా ఆలోచనే కదా'' అంటాడు. ఆ భావాన్ని ప్రస్ఫుటించడానికి 'కె' అని వాడాను. అట్లాంటపుడు సంక్లిష్టత కొన్నిసార్లు కవిత్వంలో వస్తుంది. అయితే తప్పనిసరిగ పాఠకునికి అర్థం కాని స్థాయిని సంక్లిష్టత అని చెప్పలేను. ఆయన అధ్యయనానికి అందని స్థితి అని చెప్పగలను. పరిచయం ఉంటే సంక్లిష్టతే కాదు! జిడ్డు కృష్ణమూర్తి గారి ఫిలాసఫీ తెలిస్తే అక్కడ ఆ వాక్యం సంక్లిష్టతే కాదు. ఆ సందర్భాన్ని బట్టి అలా కొనసాగింది.

ఇక, తెలంగాణ కవితలన్ని ఎందుకు అంత సరళంగా ఉన్నాయంటే, అది తెలంగాణ తత్వంలో, తెలంగాణ జీవన తాత్వికతలోనే ఆ సామాన్యత, సరళత ఉంది.

ఆడంబరాలు గాని, పాండిత్యంగాని లేని, సార్వకాలీన అనుభవాల పుట్ట తెలంగాణ జీవితం! కొన్ని చోట్ల Metaphorical Expressions ఉంటయి. కొన్ని చోట్ల Allegory ఉంటుంది. ఇంకా కొన్ని చోట్ల 'Symbolism' కూడా ఉంటది. కానీ ఎక్కడ కూడా 'సరళత' అనే సూత్రం మిస్సవకుండా "ఊరికి పోయిన యాళ్ళ"లోని కవితలన్ని ఉంటయి. అది 'బోనాల పండుగ' మీద కావొచ్చు 'బుగులోని తీర్థం' కావచ్చు. ఏ కవిత రాసినా అలాగే ఉంటుంది.

కానీ "ఒంటరీకరణ"లోని కవితలు సంక్లిష్టంగా అనిపిస్తాయి. ఎందుకంటే ఆ భావనను చెప్పడానికి ఖచ్చితంగా ఎక్కడో ఉదాహరణను తీసుకోవలసి వస్తది. మనో మథనంలో జరుగుతున్న వేదనను 'ఆస్విజ్' అనే పదంతో చెప్పవలసి వచ్చింది. ఆస్విజ్ ఏంటంటే రెండో ప్రపంచ యుద్ధకాలంలో నాజీజర్మనీ వాళ్ళు కొన్ని Concertration క్యాంపులు పెట్టి యుద్ధఖైదీలను, యూదుజాతీలను సామూహికంగా చంపేవారు. Mass Genocide! నేను ఇప్పుడున్న స్థితి ఎలా ఉంది అని చెప్పడానికి ఆస్విజ్‌లో ఉన్నట్లుగానే ఉంది అని Symbolism చెప్పవలసి వచ్చింది.

మరోవైపున కవిత్వంలో సంక్లిష్టత అనివార్యత మాత్రమే కాదు అవసరం అని కూడా ఒక్కొక్కసారి అనిపిస్తుంది. కవిత చదవగానే ఇట్టే అర్థం కావడం, సామాన్యుడికి సైతం అందటం ఆహ్వానించదగిందే. దాంతోపాటు పాఠకుడికి ఒక రసానుభూతిని, ఒక తెలియని విషయ జ్ఞానాన్ని అందించడం కూడా కవిత్వం కర్తవ్యం అని కూడా నేను అనుకుంటాను. అందుకే కవిత ఆ పాఠకుడిలో **24/7** Something వెతికే అవకాశం కూడా ఇవ్వాలి. ఆసక్తిని క్రియేట్ చేయగలగాలి. అది కూడా అవసరమని భావిస్తాను. పాఠకుడు తాను చదివిన కవితా పంక్తులలోని విషయాలను తెలుసుకోవడమే కాకుండా, అన్వేషించడానికి కావలసిన ఒక అవకాశాన్ని ఇవ్వడం కూడా కవి బాధ్యతే అని నేను అనుకుంటాను.

Q

**● ఊరితో మర్చిపోలేని ఒక జ్ఞాపకం చెప్పండన్నా! అంటే మీ కవిత్వం మొత్తంలో స్థానికత ఎక్కువుంది. ఒక చెరువుంది. ఒక చెరుకుబాయి వుంది. ఒక తాత ఉండు. వీటన్నింటి మధ్య, మర్చిపోలేని ఒక మంచి సంఘటన ?**

– అమ్మ... అంతే. ఇంకేం లేదు అమ్మ.

**● చాలా సందర్భాల్లో మీరు యురోపియన్ పొయెట్రి లేకపోతే అమెరికన్ పొయెట్రీ గురించి చెప్పిండ్రు కదా! వాటి ప్రభావం మీ సాహిత్యం మీద ఎంత వరకు ఉందని భావిస్తున్నారు అన్నా?**

– అవి మాత్రమే కాదు ఆఫ్రికన్, లాటిన్ అమెరికన్ స్పానిష్ కవిత్వ ప్రభావంకూడా ఉంది. రూమీని ఇష్టంగా చదివాను. “Prophet” రాసిన ఖలీల్ జిబ్రాన్ ను విపరితంగా చదివాను. ఆయన రాసిన Sand and Foam ని నేను, అయినంపూడి శ్రీలక్ష్మి గారితో కలిసి తెలుగులో అనువాదం చేశాను. ఈ కవిత్వం చెప్పాలనుకుంటున్నపుడు అనువాదం తప్ప వేరే మార్గం లేదు. రంగవల్లి పబ్లికేషన్స్ నరసింహారావు గారు ఇది అనువాదం చేయండి అని అడిగారు. అందుకే Sand and Foam ని ట్రాన్స్లేట్ చేశా. మహమ్మద్ దర్విష్‌ను, మీర్జా గాలిబ్ ను. ఉమర్ ఖయ్యూమ్‌ను చదివా .యురోపియన్ ఒక్కటే కాకుండా మిడిల్ ఈస్ట్‌కు సంబంధించిన కవులు... అలాగే , చైనా, కొరియా, జపనీస్ కవులను కూడా చదివా! వాళ్ళది ఒక స్టైల్. జపనీస్ కవిత్వం హైకూ స్టైల్లో రాస్తుంటారు.

ఒక్కొక్కరిది ఒక్కో స్టైల్లో ఉంటుంది. మనకు తెలియకుండానే కొన్నింటికి కనెక్ట్ అవుతాము. మనలో  లేకుంటే కనెక్ట్ కాము. మనలో ఉన్నదానికే మనం అవుతాం.

ఆఫ్రికన్, స్పానిష్, యురోపియన్, ఫ్రెంచ్, కొరియన్, చైనీస్, అరేబియన్ కవిత్వం వైపు ఎందుకు కనెక్ట్ అవుతున్నా నంటే అక్కడేదో'' మనలో అంతర్లీనంగా ఉన్న ఆ లాలిత్యం, ఆ సున్నితత్వం, ఆ సెన్సిబిలిటి ఎక్కడో వుండింది. ఆ ఉన్న దాన్ని Touch చేయుగలిగింది. స్పందింపజేయగలగింది! దానికి తోడు ఆయా భాషల కవిత్వంలోని వస్తువులు, శైలి కూడా!

**● ఇక్కడికి రాంగనే మీరు చాలా బిజీగా ఉన్నరు. మొదట మిమ్మల్ని కలవాలంటేనే భయం వేసింది. మిమ్మల్ని కలిసినంక మాత్రం చాలా సంతోషమేసింది అన్నా. దీని కంటె ముందు మీ కవిత్వాన్ని చదువుకోవడం గొప్ప అనుభూతి. మీరు వాడిన ఊహలు , పోలికలు నన్ను చాలా రోజులు వెంటాడినయి. ఒక పతంగిని "దారం కట్టిన చందమామ"తో చెప్పడం, హైద్రాబాద్ ను "పెద్దమ్మ"గా పోల్చడం బాగా నచ్చాయి. ఈ వారం రోజులు మీ కవిత్వంతో ప్రయాణం చేశాను. మీ కవిత్వలోతుల్ని మీ కవిత్వానికి మొదట ఏర్పడిన పాదుల్ని తెలుసుకుందామని మీ దగ్గరకు వచ్చిన అన్నా!**

**–** సంతోషం తమ్ముడూ... బిజీగా ఉండడం అంతా  మామూలే. ఇది Part of life కదా. గోపాల్ అంటే "దండకడియం'' రాసిన కవి. చాలా మంచిగ రాస్తున్నడు. మాట్లాడుకుందాం అనుకున్నపుడు కవిత్వం గురించి నేనూ  మాట్లాడుదాం అనుకున్న.! ఇలా కవిత్వం గురించి మాట్లాడుకోవడం నాకూ ఇష్టమే.

**● మొదట ఏ ఆఫీసుకు వెళ్ళిన గాని చాలా భయపడుతుంట అన్నా. వాళ్ళు పెద్ద వాళ్ళు కదా వాళ్ళతో ఎట్లుండాలి అని అనుకుంటుంట. అట్లాంటివి ఏమీ లేకుండా నిజంగా ఒక అన్నను కలిసిన ఫీలింగ్ కలిగింది అన్నా నాకు.Thanks అన్నా.**

**–** ఇది నా స్టైల్ తమ్ముడూ .. నేను ఇట్లనే ఉంట. సహజంగా ఉండడం నాకిష్టం.

**● మిమ్మల్ని చూడగానే నాకు గోపిసార్ వాక్యాలు గుర్తొచ్చినయి అన్నా. పదవి ఐదేళ్ళు, పెదవి నూరేళ్ళు, అనే వాక్యాలు మీకు దగ్గరగా ఉన్నాయని పించింది.**

**–** అధికారం, పదవి, హోదా, మర్యాద వీటన్నింటి కన్న అతీతమైనది human bondage ఒకటుంటది తమ్ముడూ! దాన్ని మించింది ఏది లేదు. అది తెలంగాణ తత్త్వం. మా ఇంట్ల మా చిన్నప్పటి నుంచి కూడా మా అమ్మ నాన్న ఊళ్ళో అందరినీ వరసలు పెట్టి పిలిచేది. అలవాటు చేసింద్రు అందుకే నాకు అంతరాలు పెద్దగా ఒంటబట్టలేదు. అందరినీ గౌరవించడం, అందరినీ పావురంగ సుసుడే జీవిత అయింది. నేను కూడా ఆ మట్టి మనిషినే ఇంకా.

ఎంత చదివినా, ఎంత తెలిసినా ఆ సహజత్వాన్ని నేను పోగొట్టుకోలేదు. అది అలాగే నాలో ఉండి పోయింది. అందుకే అధికారం లాంటిది ఏముండదు. అన్నదమ్ముల ఆత్మీయతలే ఎక్కువ ఉంటయి. మొదటి అ(అధికారం) కంటే రెండవ ఆ ( ఆత్మీయత) కే ప్రాధాన్యత ఇస్త .

**● ఒక ఇంటర్వ్యూలో చదివిన అన్నా. అక్క వాళ్ళు మిమ్మల్ని ఒక అమ్మ నాన్నల స్వరూపంగా భావిస్తరు అని. మీ చెల్లెండ్లను ఎట్లా చూసుకున్నరు అన్నా.**

– నాక్కూడా అన్నీ వాళ్ళే కదా. అమ్మలోని 'అ', నాన్నలోని 'న్న' ఈ రెండు కలిపితే అన్న అయితదని అంటరు కదా. నాకెందుకో అది అనుకోకుండా వచ్చింది. పరిస్థితి కూడా అట్లా కల్పించింది.

మా తమ్ముడు, చెల్లెల్లందరికి అన్నయ్యలాగ కంటే కూడా అమ్మలాగనే ఉంట. వాళ్ళు కూడా అంతే మంచివాళ్లు. అందుకే అది వాళ్ళ గొప్పతనం!

**● అనుబంధాలకు ఎంత విలువనిస్తరో మీ పుస్తకాల్లో కూడా కనిపించింది అన్నా . "ఊరికిపోయిన యాళ్ళ"ను అమ్మకు అంకితం ఇస్తూ అంకితం దగ్గర కేవలం మీ పేరు పెట్టుకోకుండా జయకృష్ణ అని తమ్ముడి పేరు కూడా పెట్టారు. ఏ కవైనా సాధారణంగా కవి ఒక్కడి పేరు పెట్టుకుంటడు. దానికి భిన్నంగా మనిషితత్వంతోటి మీ సంపుటాలు వేసింద్రు కదా అనిపించింది.**

– స్వరాజ్యం మా అమ్మ పేరు. స్వరాజ్యం పబ్లికేషన్స్ అనేది మా అమ్మ పేరు మీద పెట్టిన పబ్లికేషన్స్. స్వరాజ్యం పబ్లికేషన్స్ అంటే మేమందరం కదా. అమ్మ యొక్క వేరు వేరు రూపాలం మేము. ఒకరు ఇక్కడుండొచ్చు. ఒకరు వరంగల్‌ల్లో ఉండొచ్చు. ఒకరు కెనడాలో, అమెరికాలో ఉండొచ్చు. అనేకత్వంలోని ఏకత్వాన్ని చెప్పడం ఉంది. ఆ ఏకత్వ సూత్రం ఏందంటే అమ్మ.!

**● బాగా బాధైనపుడు, సంతోషం కలిగినపుడు కవిత్వం రాయడం కాకుండా ఇంకేం చేస్తుంటరు అన్నా .**

– ఎప్పుడైనా నేను మూడు పనులు చేస్త తమ్ముడూ! చదవడం ఒకటి. రాయడం ఇంకొకటి. బాగా చదువుతాను. తెల్లారిపోయింది అనేది కూడా ఒక్కోసారి తెలియదు. మూడవది సినిమాలు చూస్తాను. బాగా సంతోషమనిపించినా, బాగా దుఃఖమనిపించినా నన్ను నేను రిఫ్రెష్ చేసుకోవాలంటే ఫస్టు నేను చేసే పని సినిమా చూడడం! ఒక మంచి Art film అయినా, సెన్సిబుల్ సినిమా అయినా చూస్తుంటాను. భారం

ఎక్కువైపోయినపుడు మాత్రం రాస్త తమ్ముడూ. That is the only outlet to express my grief.

తట్టుకోలేని తనం వచ్చినపుడు, ఇక నేను burst అయిపోత అన్నప్పుడు ఖచ్చితంగా రాస్తాను. భరించగలిగే స్థితిలో ఉన్నపుడు మాత్రం చదువుత.

- **మీ జీవన తాత్వికతను తెలిపే కవిత 'కట్ట మీద ర్యాల చెట్టు.చివరగా కొన్ని వాక్యాలు వినిపించండి అన్నా.**

– " ఆ ర్యాల చెట్టు కట్ట మీద ఒక్కటే నిలబడి
మా ఊరి జనాలందరి తరుపున
దేవున్ని శనార్తి వేడుకుంటున్న యోగిలెక్క అన్పిస్తది.
అయితే, మీరంతా అన్నట్టు రాలచెట్టు ఒంటరే
అయితేంది.
మా ఊరు ఊరుకే పెద్దదిక్కై నిలబడ్డది
ప్రతి చెట్టూ ఒంటరే -
అయితేంది -
లోకానికంతటికీ పచ్చని రంగులు అద్దుతూ
పెట్టని కోటై మనల్ని గెలిపిస్తది."


తెలంగాణ ప్రభుత్వం





“నిత్య జీవితంలో మనం ఎన్నో అంశాలని వింటాం. చదువుతాం. నేర్చుకుంటాం. అధ్యయనం చేసి, అభ్యాసం చేసి ఈ ప్రపంచాన్ని అవగాహన చేసుకునే ప్రయత్నం చేస్తాం. ఆది మధ్యాంత రహిత జ్ఞాన నదులలో మునకలేసినప్పటికీ, ఇంకా వివృతం కాని అజ్ఞానాన్ని ఆవహించి ఉంటాం. విజ్ఞానమో, వేదాంతమో, వైరాగ్యమో, వ్యామోహమో, వ్యాకులతో, విప్లవమో.. ఇంకేదో తెలీని అజ్ఞాత, అభూత, అధి భౌతిక, ఆధ్యాత్మిక ప్రవాహంలో పడి కొట్టుకు పోతాం! కానీ ఏదో ఒక సందర్భంలో ఇలాంటి ప్రశ్నలు ఎదురైనప్పుడు మాత్రమే మన తార్కికత లోని లోతు, మన తాత్వికత లోని గాఢత, మన అధ్యయనంలోని దార్శనికత, మన పఠనాభిలాష పుట్టించిన కాల్పనికత, మన జీవనానుభావం చూపించిన వాస్తవికత... వాటి ప్రభావం అంతా, పాక్షికంగానైనా ఒకచోట గుదిగుచ్చినట్టుగా, సాపేక్షంగానైనా వేల చోట్ల విసిరేసినట్లుగా, ఎంతో ఆపేక్షగా మన నుంచి వెల్లువ లాగా బయటకు వస్తాయి.”

– డా॥ మామిడి హరికృష్ణ

నేను గతంలో ఎన్ని ఇంటర్వ్యూ లలో పాల్గొన్నా, ఈ ఇంటర్వ్యూ మాత్రం ప్రత్యేకంగా అనిపించింది. ఒక మట్టి మనిషి, పల్లె ధూళిని మనసంతా పులుముకున్న మనిషి , తెలంగాణ జీవన సంస్కృతిని ఆవాహన చేసుకున్న మనిషి, అక్షరాలు అక్షరాలు గా కవిత్వాన్ని శ్వాసిస్తూ, తన వాక్యా లకి సాహిత్యపు “దండ కడియం” తొడిగిన మనిషి నన్ను ఇంటర్వ్యూ చేయడం as novel as natural గా, as natural as new గా, as new as nuances గా అనిపించింది!

– డా. మామిడి హరికృష్ణ

“మేము మాట్లాడుకున్న మూడున్నర గంటల్లో అమ్మ పేరు చెప్పినా, అక్షరం పేరు విన్నా హరికృష్ణన్న కదిలిపోవడం చూశాను. ఒక వాక్యంలోని విషయాన్ని వంద పేజీల్లో ఎట్లా విమర్శనాత్మకంగా చెప్పొచ్చో చూశాను. వంద పేజీల భావాన్ని ఒక పదంలో చెప్పడమూ చూశాను. చదివిన పుస్తకాల మీద గంటల తరబడి సాధికారికంగ మాట్లాడగలిగే మాటల ప్రవాహాన్ని చూశాను. “ఎందుకు చేనేత జీవితం మీద ఎక్కువ కవిత్వం రాయలేదన్నప్పుడు” జీవితం ముందు వినమ్రంగా చేతులు కట్టుకున్న నిజాయితీ చూశాను.

హరికృష్ణన్నతో మాట్లాడడమంటే లైబ్రరీలో కూర్చొని ఇష్టమైన పుస్తకాలను ఒక్కోటి తిరిగేసిన అనుభూతి. తన మాటల్లో కవిత్వానికి సంబంధించిన నిర్వచనాలే కాదు జీవితానికి సంబంధించిన పాదులూ కనబడినయి. ఆ పాదుల్లోకి నీళ్ళు పారించడానికే ఈ సెలిమెదీస్తున్నం.”

–తగుళ్ళ గోపాల్

